నవభారతి

సాహిత్య సాంస్కృతిక మాస పత్రిక

అక్టోబరు 1958

మూల్యం : రూ[redacted]పాయి

నవభారతి కార్యాలయం

గాంధీనగరం ★ విజయవాడ-2

నవ భారతి ★ అక్టోబరు 1958

విషయ సూచిక

చిత్రములు



ఒళ్లు విరుపు

★

చిత్ర శిల్పి :

శ్రీ అ. పైడిరాజు

★



పారాణి

★

చిత్రశిల్పి:
శ్రీ కళ్యాణ్ ప్రసాద్ శర్మ

నవభారతి

సాహిత్య సాంస్కృతిక మాస పత్రిక

సంపుటి	విజయవాడ ★ అక్టోబరు 1958	సంచిక 5

గాంధీజీ జయంతి

మహాత్మగాంధీజీ జయంతి ఏటేటా జరుపబడుతున్నది. ఈ జయంత్యుత్సవములో భారతీయు లందరూ పాల్గొనడం జరుగుతున్నది. మహాత్ముని సందేశాలను, సంకల్పాలను వాడవాడలా వినిపించడం జరుగుతున్నది గాంధీజీ పుణ్యపురుషుడు. గాంధీజీ తపస్సంపన్నుడు. గాంధీజీ ప్రతిభాశాలి. గాంధీజీ కర్మయోగి. గాంధీజీ ధర్మమూర్తి. గాంధీజీ శాంతిప్రియుడు. గాంధీజీ ఆత్మసందర్శి. ఒకటేమిటి? గాంధీజీ అన్నిమూర్తులూ నిండిన ఆదర్శమూర్తి. గాంధీజీయే భారత జాతీయ వాణి ఇంతేకాదు- ఒక్క మాటలో చెప్పాలంటే, 'జాతీయజీవనమే మహాత్మగాంధీజీ' అని అనవచ్చు. ఇది ఏటేటా మనం మననం చేస్తూ వున్న మార్గము. వ్యక్తిని పూజించడం, వ్యక్తిని ప్రశంసించడం, వ్యక్తి గుణగణాలను ఉల్లేఖించడం, వ్యక్తి కార్యసాధనను అనుసరించమనడం, జరుగవచ్చు. అయితే ఇదిమాత్రమే సరిపోతుందా? ఈ కార్యం చేయడంలో మరేదైనా ప్రయోజనం ఉందా? ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పుకోవాలి.

గాంధీజీ తాను ఆశించిన జీవితవిధానాలను గురించి, తానూ, తనజన్మభూమి అనుసరించదగిన కార్యవిధానాలను గురించి, తన అంతరాత్మ చెప్పిన విధంగా తాను కొన్ని సూచనలు చేశానని చెప్పడం అందరం ఎరుగుదుము. అయితే ఇవి ఈనాడు ఆచరించ బడుతున్నదీ, లేనిదీ మనందరికీ తెలుసు. కాని ఇవి ఎందుకు ఆచరించబడడం లేదో పరిశీలించడం మాత్రం జరగడంలేదు.

భారతజాతీయ జీవనాన్ని తీర్చి దిద్ది, మహోన్నతమైన మానవత్వ వ్యవస్థను నెలకొల్పి, తద్వారా భారతస్వాతంత్ర్య పిపాసను రేకెత్తించి, పరపరిపాలనా విముక్తి కలిగించిన జాతీయకాంగ్రెస్ సంస్థ, ఈనాడు బలహీన పడినదని జాతీయ నాయకులచేత ఎందుకు అనిపించుకో బడుతున్నదో, ఆలోచించి నిర్ణయం మాత్రం తీసుకోవడం లేదు.

కాంగ్రెస్ సంస్థలో అధికారదాహం ఏర్పడిందనీ, ఈ లోపాన్ని తొలగించుకోవడం సాధ్యంకావడం లేదనీ, అన్నివర్గాల ప్రజలూ అసంతృప్తి పొంది ఉన్నారనీ సూక్తులు వల్లించడం మాత్రం చేస్తున్నారు.

మహాత్మగాంధీజీ కాంగ్రెస్ సంస్థను సజీవం చేసి నడిపించినాడని మాత్రం అందరూ అంటున్నారు. భిన్నభిన్న భావుకు లయినవారినీ, ఉత్తమ విజ్ఞానసంపన్ను

లయిన మేధావు లయినవారిని, సామాన్య పరిజ్ఞానము కలిగిన కాంగ్రెస్ కార్యకర్త లను ఉత్తేజపరచి జాతీయస్వాతంత్ర్య సమరంలో త్యాగం చేయించిన ధీశాలి అని అంగీకరిస్తున్నారు. ఇవన్నీ అంగీకరిస్తూనే ఆయన చెప్పినవాటిని ఆచరించలక పోతున్నారు. ఒకటి చెప్పడం, తదాచరణయందు ఆసక్తి లేకఉండడం, — ఈనాడు పరిపాటి కావడంవల్ల కాంగ్రెస్, జాతీయసంస్థగా సజీవమై, శక్తివంతముగా నడుప బడడం లేదని ఈనాటి కాంగ్రెస్ పెద్దల కార్యవిధానమే స్పష్టంచేస్తుంది. ఉదాహర ణకుచూడండి— గాంధీజీ జయంతి సందర్భంలో పదయాత్ర చెయ్యాలని అఖిలభారత కాంగ్రెస్‌సంఘం తాఖీదు పంపింది. దాని శాఖలన్నీ అదే తాఖీదుకు నకలు తయారుచేసి తదాచరణయందు నిమగ్నం కావాలని ఆదేశించినవి

ఈ పదయాత్ర ఎందుకోసం ఏర్పరుపబడింది? ఈ పదయాత్రలో ఏమైనా ప్రయోజనం ఉందా లేదా? అన్న మీమాంస మాత్రం పూజ్యంగా ఉంది. ఇందుకు కారణం లేకపోలేదు. కాంగ్రెస్‌సంఘం, కాంగ్రెస్ కార్యకర్తలు సుశిక్షితులై, విజ్ఞానసంపన్నులై, వివేకవంతులై, విజ్ఞానమూర్తులై వర్థిల్లడానికి ఏ మార్గం అనుస రించాలో తెలియక సతమత మవుతున్నారు. ఏది ఉన్నతమార్గమో, ఏది మధ్యమ మార్గమో, ఏది సామాన్యమార్గమో వివరించి చెప్పకపోవడంవల్ల ఈ అవ్యవస్థ ఏర్ప డింది. ఇందుకు కారణం ఇది:

గాంధీజీ ఆశించిన సామాజికజీవనం సర్వజన సమ్మతమై, ధర్మకర్తృత్వ నేతృత్వం కలిగిఉండాలని నిశ్చయమైన నిర్ణయం చేయబడి, ప్రజాప్రబోధం కలిగించే రీతిగల రచనలద్వారా భావవ్యాప్తం చేయడం జరిగింది. ఆయా రచనలలో భావ వైవిధ్యాన్ని విస్పష్టంచేసి, విశిష్టమైన పద్ధతిలో మానవప్రవృత్తిని తీర్చిదిద్దగల రీతిని అనుసరించబడాలని స్పష్టం చేయబడి ఉంది అయితే ఈనాడు సోషలిస్టు పద్ధతిగల ప్రజాస్వామ్యవ్యవస్థ ఏర్పడడానికి ప్రయత్నం చేయాలని కాంగ్రెస్ తీర్మానించింది ఈ సోషలిజాన్ని గురించి ఎవరికి తోచినరీతిని వారు నిర్వచనమాత్రం చేస్తున్నారు. సోషలిజమంటే ఏమిటో కాంగ్రెస్ కార్యకర్తలకు తెలియదు కాంగ్రెసు పెద్దలకు తెలుసునో తెలియదో మనకు తెలియదు. కాంగ్రెస్ చెప్పే సోషలిజాన్ని గురించి ఎలా చదివి, ఎలా నేర్చుకుని, ఎలా అనుసరించాలో అగమ్యంగా మాత్రం ఉంది. మహాత్మగాంధీజీ ఆశించిన సామాజిక జీవన వ్యవస్థాపద్ధతికీ, ఈనాడు మనకాంగ్రెసు పెద్దలు ఆశించే సోషలిస్టుపద్ధతికీ వ్యత్యాసం తెలియక అందరూ అన్నివిధాల తిక మక పడుతున్నారు ఇది కాంగ్రెస్‌వాదులలో అపార్థాలకూ, అనైక్యతకూ, దారి తీస్తుంది. ఇది గ్రహించకుండా కాంగ్రెస్‌వాదులు పదవీవ్యామోహంలో పడి పోవడం వల్ల ఈ అవ్యవస్థ ఏర్పడిందని కాంగ్రెసు పెద్దలు భావించారు. తమ తమ బాధ్యతలనుండి తప్పించుకొని గాంధీజీజయంతి వారంలో వాడవాడల్లోనూ పదయాత్రలు జరపమని కాంగ్రెస్‌వాదులను ఆదేశిస్తున్నారు. ప్రజావిజ్ఞప్తి అందుకో మంటున్నారు. సాంఘిక దురాచారాలు రూపుమాపడం, మద్య నిషేధానికి

అమలుజరపడం, ఖద్దరు అమ్మకంచేయడం, మొదలయిన నిర్మాణకార్యక్రమ సూత్రాళ్లో ప్రజామోదం పొందవలసిందని హెచ్చరికలు చేస్తున్నారు. ఇది దేశానికి హితవు కలిగించకపోగా, ప్రతిపక్షాలవారు అపహసించడానికి అవకాశం కలిగిస్తుంది ఆలోచించండి. ప్రతిఒక్కరూ అర్థంచేసుకోండి గాంధీజీ భారతజాతీయ హృదయాన్ని అవగతంచేసుకొని, జాతి చైతన్యం పొందినంతవరకే కార్యాచరణను ప్రేరేపించి, ఉన్నతమైన భావోద్దీపన కలిగించడానికి ప్రబోధంచేశాడు ఆ పద్ధతి అనుసరించడానికి తగిన శక్తిసామర్థ్యాలను కాంగ్రెస్ అగ్రనాయకులు పెంపొందించుకొని, కార్యకర్తలను సువిజ్ఞాన, సుసంపన్నులను చేసి, సుశిక్షితమైన మార్గంలో నడిపించడానికి గాంధీజీ జయంతివారోత్సవాన్ని జరిపితేమాత్రం అది ఉత్తమమైన మార్గదర్శకత్వాన్ని ఇచ్చి జాతిని సజీవంచేస్తుంది. జయంతి వారోత్సవాలు జరపడంలో ఔచిత్యం ద్యోతకమవడానికి, సంపన్నమైన విజ్ఞానప్రబోధం చేయడం ఒక్కటే పరమ పవిత్రమైనదని పూజ్యబాపూజీ జీవితం సుస్పష్టం చేస్తుంది.

గాంధీజీ జ్ఞాని. గాంధీజీ మహామహోపాధ్యాయుడు. భారత జాతీయౌన్నత్యాన్ని పెంపొందించే రీతిలో ఆయన విజ్ఞానప్రబోధం చేశాడు అదే విజ్ఞాన ప్రబోధం కాంగ్రెస్ ఆశయమైతే ఎవరినీ ఎవరూ నిందించుకో నవసరం లేదు. ఎవరినీ ఎవరూ దూషించుకో నవసరం లేదు ఎవరూ ఎవరినీ స్వార్థపరులని అపహాస్యం చెసుకొవలసిన అవసరంలేదు. గాంధీజీ విజ్ఞానపిపాసి. గాంధీజీ కర్మజీవి. గాంధీజీ విద్యావ్యాసంగి ఆయన జయంతివారంలో ఆయన చేసింది చేయగలిగితే అది ఈ అవ్యవస్థ నంతనూ తొలగించి, సువ్యవస్థను ఏర్పరుస్తుంది. ఆనాడు, గాంధీజీజయంతి లోకానికి కల్యాణాన్ని ప్రసాదిస్తుంది. ఇది అవునో కాదో ఈ గాంధీజీజయంతి వారంలో అందరూ ఆత్మసాక్షిగా, అత్మానుభవాన్ని పరిశీలించండి. అందరికీ గాంధీజీ జయంతిలోని ఆంతర్యం తెలిసిపోతుంది.

★

యోగదర్శనము

శ్రీ వేలూరి శివరామశాస్త్రి

౧

హిరణ్యగర్భుఁడు యోగమునకు మొదటి ఉపదేశకుఁడు. పిదపఁ బిదప యోగి యాజ్ఞవల్క్యాదులు యోగమును ప్రపంచించిరి. తరువాత పతంజలి సూత్రీకరించెను. ఈ సూత్రములకు యోగదర్శనమని పేరు. దీనికి (౧) భాష్య కర్త వ్యాసులు. పతంజలి కాలనిర్దేశము సులభము కాదు. సాంఖ్యసూత్రముల కును బ్రహ్మసూత్రములకును నడుమ ఇతఁడున్నాఁడని చెప్పుట క్షేమము. ఈ సూత్రములలో బౌద్ధమతఖండనము ఉండుటచే పతంజలి కది ప్రాచీనము. యోగ దర్శనమునకు ప్రత్యక్షమును అనుమానమును, (౨) ఆగమమును ప్రమాణము. కాని కణాదుఁడును గౌతముఁడును ఇతనికి ప్రాచీనులో కారో చెప్పుటకు మాత్ర మాలోచింపవలెను.

సాంఖ్యము గ్రహించిన ఇరువదియయిదు తత్త్వములతో యోగ ఖింకొక తత్త్వమును (౩) గ్రహించెను. కాన ఇందు తత్త్వము లిరువదియాఱు. ఇంతమాత్ర మున ఈ రెండును వేఱుకావు. కావుననే దీనికి సాంఖ్యప్రవచనమని పేరు. సాంఖ్యము విశ్లేషించి చెప్పిన తత్త్వములను సాక్షాత్కరించుకొనుటకు ఉపాయ మైన ధ్యానమును యోగము చెప్పెను. ప్రధానము తక్క తక్కిన తత్త్వముల నన్నింటిని ఈ ధ్యానముచే సాక్షాత్కరించుకొన వచ్చును.

---

(౧) సూత్రములమీదను భాష్యముమీఁదను ౨౬ వ్యాఖ్యలు కనిపించుచున్నటులు శ్రీ రాజేంద్రలాల్ మిత్రగారు వ్రాసిరి. ఇంకను ఉన్నవి. ఈ కాలమున రచితమయిన వానిలో శ్రీ హరిహరానందారణ్యుల భాస్వతీవృత్తి చెప్పుకోదగినది. తెలుఁగులో ఓమండూరు దొరసా మయ్య గారి వ్యాఖ్యకలదు. శ్రీ.తి. కం. తిరువెంగడాచార్యులవారి తెలుఁగు వ్యాఖ్య దొడ్డది.ఒక చేతితో ఇంతవఱకు అయిదు దర్శనములను వ్రాసిన పండిత గోపదేవుల తెలుఁగు యోగదర్శ నము సులభగ్రాహ్యము. ఇవికాక నా చూడనివి ఇంకను ఉండవచ్చును.

(౨) యోగులు సాంఖ్యులవలె మూలకారణము ననుమానముచే సిద్ధమొనర్తురుగాన వీరికి ముఖ్య ప్రమాణ మనుమానము, పిదప ఆగమము—ఆగమానుమాన ధ్యానములు ఉత్తమయోగ సిద్ధికావశ్యకము లని వ్యాసులు (౧-౪౮). ఈ మూఁడును శ్రవణమనన నిదిధ్యాసనము లని వాచ స్పతి (౧-౧౨)

(౩) రాధాకృష్ణులు- 'Indian Philosophy, Vol ii-342 - పుటలో - The twentyfive principles are accepted by the Yoga which does not care to argue about them' అని వ్రాసిరి. ఉపాదానముగాని నిమిత్తముగాని కాని ఈ పురుషవిశేషుని జాతిపరముగా చేకొనిగాని కొండొక ఉద్దేశముతోఁగాని వీ రిటుల వ్రాసియుందురు.

పురుషతత్త్వము తక్క తక్కు తత్త్వము లన్నియు పరిణామము చెందు చున్నను నిత్యములు. ప్రలయమునందు ఇరువదిమూఁడు తత్త్వములును ప్రకృతిలో లయించును. ప్రకృతి పురుష తత్త్వములు రెండును పరమనిత్యములు. మిగిలినవి ఆపేక్షికనిత్యములు.

పురుషుఁడు

ఒక్క పురుషతత్త్వముతక్క తక్కిన తత్త్వము లన్నియు పరిణామితత్త్వ ములు. పురుషతత్త్వ మపరిణామి. పురుషునకు పుట్టు సావులుగాని రూపాంతరము గాని లేదు. ఇతఁ డెపుడును మాఱక ఒక తెఱఁగుననే యుండును. ఇతఁడు చిత్ స్వరూపుఁడు. అనఁగా ఇతని స్వరూపము జ్ఞానము. జ్ఞానము ఇతని స్వరూపము కాని ధర్మము కాదు. అనగా జ్ఞానమున కితఁ డాశ్రయము కాఁడు. ఈ జ్ఞాన మొకపు డుండి ఒకపుడు పోవునది కాదు. వెలుఁగు దేనికి స్వభావమో దానిలో చీకటి సుంతయేని ఉండదు. విషయ సన్నిధానమున జ్ఞాన మితనికి కలుగునది కాదు. అటులు కలిగెనేని ఇతని స్వభావము చిద్రూపము అయ్యెడిది కాదు. ప్రపంచ సన్నిధానమున సూర్యునకు భాస్వరత్వము కలుగ లేదు. ప్రపంచము ఉండుఁగాక పోవుఁగాక, సూర్యుఁడు ప్రకాశించుచునే యుండును దేనికేది స్వభా వమో అది పోదు. పురుషుఁడు స్వప్రకాశుఁడు. పురుషుఁడు సదాజ్ఞాతవిష యుఁడు. చిత్తమున ఏవృత్తి కలిగినను అది పురుషునకు తెలియును. పురుషుఁ డపరిణామి యని యనుట కిది అనుమాపకము. యీ చిత్తమున కొకపుడు తెలియు టయు ఒకపుడు తెలియక పోవుటయు కలదు. పరిణామికి ఇది స్వభావము. పురు షుఁడు జ్ఞస్వరూపుఁడు. కాన అతని జ్ఞానమున కెన్నఁడును లోంపులేదు

పురుషునిలో వ్యాపారము సంచరింపదు. క్రియ లేకపోయియు ప్రకాశ రూపతయే పురుషుని స్వరూపము. వ్యాపారమితనిలో కల దనుచో నితనిలో శక్తియు (౪) ఉండవలసివచ్చును. శక్తియు పురుషుఁడును వేఱు వేఱు శక్తి పరిణ మించును. పురుషుఁడో పరిణమించువాఁడు కాఁడు.

క్రియ యున్నచోట రూపాంతరము కలుగును. దాన నవస్థాంతరప్రాప్తి నేలలో పాఁతిన విత్తు చెట్టుగా పరిణమించును. చెట్టు విత్తుయొక్క స్ఫుటమగు రూపము. విత్తు చెట్టుయొక్క అస్ఫుటరూపము ఈ పరిణామ మూలమున బీజ శక్తియు శక్తివ్యాపారమును కలవు. బీజము ఘనీభూతమైన శక్తివిశేషము. విత్తు రూపు చెట్టుగా మాఱును. ఇది పరిణామము. పరిణామవిశేష మేమియును లేమి

---

(౪) చిద్రూపునే చితిశక్తియని వాడుదురు. దీనికి చైతన్యమే అర్థము. ఇచటిశక్తి నేతిబీఱ.

పురుషుఁడు దృశిమాత్రుఁడని చెప్పఁబడును. అనఁగా వికారము పొందని ద్రష్ట. ద్రష్ట ఎప్పుడును స్వద్రష్ట. మరియు నితఁడు స్వబోధకు కరణముల అపేక్ష లేనివాడు. మన మాటలందును చేఁతలందును 'నేను' అను భావము దబ్బనముతో తాడువలె అనుస్యూతమయి యుండును ఇది బుద్ధి విశేషము. దీనికి కరణాపేక్ష కలదు. ఈ 'నేను' అను భావమున కేది ఏది మూలమో దానికిని మఱియేది వెనుకఁ గలదో దేనిని జెప్పుటకు ప్రయత్నింతుమో అలదానికి కరణములతో పని లేదు. కరణమునకు విషయము దృశ్యము. కరణముగూడ దృశ్యము కాన ద్రష్ట కరణమునకు అవిషయము ద్రష్టఁగాని ద్రష్టృస్వరూపబోధ స్వబోధ. ద్రష్ట యన స్వద్రష్ట. అనఁగా 'నేను జ్ఞాతను' అను స్వవిషయక మగు బుద్ధి నెఱుఁగువాఁ డని పర్యవసానము. వృత్తిని నిరోధించినపుడు దృశ్యము లయ మగుఁ గాన ద్రష్టృత్వవ్యవహార మెటు లన్న యెడల దానఁజేసియే ద్రష్టకు దృశి యని చితి యని చితిశక్తియని చైతన్య మని ఇన్ని పేర్లు.'పురుషుఁ డపరిణామియు అప్రతి సంక్రముఁడును' అని పంచశిఖాచార్యు (౫) లందురు. 'చితి అప్రతిసంక్రమ' అని పతంజలి.౪-౨౨ కైవల్యపాదము. చూ. అప్రతిసంక్రముఁ డనఁగా వ్యాపార మితనిలో సంక్రమింప దని తాత్పర్యము. వ్యాపారము ప్రకృతిది. పురుషుఁడు ప్రకృతి కంటె పూర్తిగా వేఱు. పురుషుని ఏ క్రియయు దఱియఁజాలదు. పరిణామశీలము కాని వస్తువులో క్రియాసంచార మసంభవము ఉపాధి యగు బుద్ధివలన పురుషునిలో క్రియాసంచారము కలుగునే యని యనుచో క్రియాసంచారము కలిగినటు లుండునేకాని నిక్కముగా కలుగదు. కలిగినటు లుండుట భ్రాంతి. ఆ భ్రాంతికే యోగము మందు. రోగము, రోగమునకు నిదానము, ఆరోగ్యము, దానికి మందు, వీనినిఁజెప్పు వైద్యశాస్త్రము చతుర్వ్యూహము. అటులే సంసారము, సంసారమునకు కారణము, ముక్తి, ముక్తి కుపాయము, వీనిని బోధించు యోగశాస్త్రము చతుర్వ్యూహము.

ప్రతిబింబ పురుషుఁడు

ప్రకృతి పురుషులు మూలతత్త్వములు. దృశ్యభావమున కెల్ల మూలము ప్రకృతి. ద్రష్టృభావమున కెల్ల మూలము పురుషుఁడు. 'అమూలమ్ మూలమ్' అను న్యాయముచే వీనికి కారణాంతరము లేదు. కారణము లేని దనాది కాన ప్రకృతి అనాది పురుషుఁ డనాది. ఈ రెంటి సంయోగ మనాది. ఇటులే

---

(౫) కపిలునకు శిష్యుఁ డాసురి. ఆసురికి శిష్యుఁడు పంచశిఖాచార్యులు. మున్మొదటి సాంఖ్యసూత్రకర్త యితఁడే కానోపును. వ్యాసులు తమ భాష్యమున వీరి సూత్రములను పెక్కింటి నుదాహరించిరి. మహాభారత మోక్షధర్మపర్వమున వీరి ప్రస్తావము కలదు.

గ్రహీతృ గ్రహణ గ్రాహ్యములయు సంయోగమున కనాదిత్వము సిద్ధము లింగా శ్రితములగు ధర్మజ్ఞానాదు లనాదు లనియు దాన కర్మ అనాది యనియు, దాన సంసార మనాది యనియు తేలుచున్నది.

అనాదియగు ప్రకృతి పురుష సంయోగము వలన గలుగు సంసార మెటులు నివర్తింపఁ గలదని ప్రశ్నించుచో 'సంసారము సహేతుకముగాని అహేతుకము కాదు సంయోగ మవివేక హేతుకము. అవివేకప్రత్యయమువలన సంయోగము, సంయోగము వలన మరల నవివేకము. ఇటులు సంయోగము అవివేకముల అనాదిత్వము బీజవృక్షముల చందము. వివేకముచే అవివేక నివృత్తి. దాన సంయోగ నివృత్తి. దాన సంసార నివృత్తి' అని బదులు చెప్పఁదుము

అత్యంతము వేఱయినను ఈ ప్రకృతి పురుషులకు సంయోగము సంభవింపఁ గలదు. సంయోగ మునఁగా ప్రకృతి పరిణామ మగు గుణము లందు పురుషుని ప్రతిబింబము సూర్యుఁడు నీరుకాఁడు. నీరును సూర్యుఁడు కాదు ఇటులయ్యు ఈ రెంటికిని సంయోగ (౧) మున్నచో ప్రతిబింబ మేర్పడును ఈ ప్రతిబింబమునకు జలస్వభావములేదు సూర్యప్రభావమును లేదు. మఱియు లేకయును పోలేదు. నీరు కదిలినచో ప్రతిబింబము కదలును. మఱియు ప్రతిబింబమునకు ప్రకాశమును కలదు. కాఁగా ఈ ప్రతిబింబము సూర్యునకు సరూపమును కాదు. విరూపమును కాదు.

సూదంటురాయి ఇనుముకంటె వేఱు. ఇనుము సూదంటురాతికంటె వేఱు. ఇటులయ్యు ఈ రెంటికిని సామీప్యమున్నచో సూదంటురాతి ధర్మము ఇనుము నందు ప్రవేశము పొంది ఆ రాయి యినుమును తనవంటి దానినిగాఁ జేసికొనును.

ఇటులే ప్రకృతి పరిణామమయిన చిత్తమునం దీ చితిశక్తి జలమున సూర్య శక్తివలె, ఇనుమున అయస్కాంత శక్తివలె ప్రవేశము పొంది చిత్తమును తన వంటి దానినిగా చేయును. చిత్తమునం దీ చితిప్రవేశమే ప్రతిబింబము. ఇదియే ప్రతిబింబితుఁడగు పురుషుఁడు లేక గ్రహీత ఈ ప్రతిబింబమే ప్రకృతి పురుషుల సంయోగము. ప్రతిబింబితుఁడగు నీ పురుషుఁడును చిత్తమును వేఱువేఱు స్వభావములు కలవయినను విరుద్ధస్వభావములు కలవి కావు. కావున చిత్తపరిణామరూపమగు వృత్తికి ఈ ప్రతిబింబ పురుషుఁడు ప్రతిసంవేది. బుద్ధివృత్తి సంవేదనము. ప్రతిబింబ పురుషుఁడు ప్రతిసంవేది ఇతఁడు బింబ పురుషునకు విషయము. బుద్ధి బింబప్రతిబింబ పురుషుల కిరువురకును విషయము.

---

(౧) కొన్నిలక్షల క్రోసుల దవ్వుల నున్న సూర్యునకును జలములకును సంయోగ సంబంధ మెటులని శంక కలుగవచ్చును: ఇది దైశికసంబంధము కాదు. యోగ్యతయే ఇచటి సంబంధము. గోడమీఁద సూర్యప్రతిబింబము పడదుగదా! అటులే ప్రకృతిపురుషులకును గల సంబంధము యోగ్యత. సూర్యునకు ప్రతిబింబించు శక్తి కలదు. జలములకు ప్రతిబింబింపఁ జేసికొను శక్తి కలదు. ఇటులే పురుషునకును ప్రకృతికిని యోగ్యత కలదు. ౧-౪.వాచస్పతి చూ.

'నేను' అను నీ భావము వ్యావసాయిక గ్రహీత 'నేను ఉంటిని. ఉందును' అను నీ భావములు అనువ్యావసాయిక గ్రహీత. ఇచ్ఛాస్మృత్యాదు లనువ్యవసాయములు.

ప్రతిఫలకము లేనిచో అను వ్యవసాయ మసంభవము జ్ఞానప్రతిఫలకుఁడు ప్రతిసంవేది. జ్ఞానములన్నియు ప్రతిసంవేద్యములు. ప్రతి సంవేది యొకఁడు లేనియెడల జ్ఞాన మసంభవము కాన బుద్ధి ప్రతిసంవేదియగు పురుషునకు విషయముగు గ్రహీతచే గ్రహింపఁబడని జ్ఞానమని ఒకటి ఉండబోదు. గ్రహీత సదాజ్ఞాత. కాన గ్రహీత కేవఁడు ద్రష్టయో అతఁడపరిణామి యగు జ్ఞస్వరూపుఁడు ఇటులు కానిచో అజ్ఞాతగ్రహీతను సృజింపవలసివచ్చును 'నేను జ్ఞానమును గ్రహించువాఁడను' అను ప్రత్యయ మెఱుఁగఁబడకపోవుట అసంభవ మెప్పుడు కాదో అప్పుడతఁడు సదాజ్ఞాత. సదాజ్ఞాతవిషయు నెఱుఁగువాఁడును సదాజ్ఞాత.

ఈ ప్రతిబింబపురుషుఁడును స్వభావముచే నిస్సంగుఁడు. ఇటులయ్యు చిత్త సంగముచే గుణివలె కనుపట్టును కాన ఈ ప్రతిబింబ పురుషుఁడు పురుషునకు సరూపుఁడు కాఁడు, విరూపుఁడును కాఁడు విషయములకును బింబపురుషునకును నడుమ ఈ ప్రతిబింబపురుషుఁడు లేనిచో ప్రపంచ వ్యవహారమే లేదు ఈ ప్రతిబింబ పురుషుఁడే భోక్త, కర్త, అనుభవిత. బింబపురుషుఁడు శుద్ధపురుషుఁడు. ఇతఁడు అభోక్త, అకర్త, అననుభవిత ప్రతిబింబితుఁడగు ఈ పురుషునకు వ్యావహారిక పురుషుఁడనియు గ్రహీత యనియు పేరు. గ్రహీత వికారి యగు జ్ఞాత. ద్రష్టృగ్రహీతలు సదృశులుగాని ఒకరు కారు ద్రష్ట అప్పుడును స్వద్రష్టయే గ్రహీత జ్ఞానకాలమున గ్రహీత, నిరోధకాలమున కాఁడు. 'నేను ద్రష్టను' అను బుద్ధియే గ్రహీత.

★

శ్రీ మద్రామాయణ కల్పవృక్షము - శిల్పదృష్టి
కావ్యాది శిల్పము

శిల్ప మనేక విధములు. పద్యరచనలో శిల్పమున్నది. ఉచితమైన యర్థమును సంగ్రహించుటలో శిల్పమున్నది. ఈ సందర్భములో చెప్పునది ఒక విలక్షణమైన శిల్పము బాలకాండములో ఇష్టిఖండములో సర్వమును రామచంద్రుని జన్మాభిముఖముగా కథ జరుగును రామునిపేరు రామచంద్రుఁడు చంద్రునకు రామునకు అవినాభావముగాచేసి, అశ్వమేధయాగాంతము చంద్రవర్ణన చే చేయఁబడినది. దీనిప్రారంభము దశరథుఁడు సౌధాగ్రమునందెక్కి చూడఁగా చంద్రుఁడు కనిపించుట. "క్రతు చుత్న మెంతదూరము వచ్చెనో" అన్న పద్యముతో నారంభమైనది. ఋశ్యశృంగుని దీసికొని వచ్చుటకు నిర్ణయింపబడినది. మరల దశరథ మహారాజు సౌధాగ్రమున కేగెను. మరల చంద్రుఁడే కన్పించెను. ఇచట చంద్రవర్ణనము నాల్గు పద్యములు.

ఒనర బోర్కాడించి యుయ్యేల తొట్టెలోఁ
　బండఁబెట్టిన పసిపాప వోలె,
వీధులం బడి తిర్గి బూదియ మైఁ జల్లు
　కొని పర్వలం బెట్టు కుఱ్ఱ వోలె,
నన్నమ్ముఁ దించు మోమంతయుఁ బెరుగన్న
　మును జేసి కొన్నట్టి బొట్టె వోలెఁ,
జిట్టి! తలంటి పోసెద నన్న నందక
　తొలఁగి పర్వులు వెట్టు నులిపి వోలె,

　వెల్ల దుస్తులు కట్టించి వీధులన్ షి
　కారు పంపిన రాజ కుమారు వోలె
　మింట నడుచక్కి జాబిల్లి మేదినీశు
　నేత్రములకును జలువఁ బండించి పోసె.

ఇచ్చట దశరథ మహారాజు తన కడుపున జన్మించఁబోవు శ్రీరామచంద్రుని 'పొత్తిళ్ళబిడ్డతనము.' 'కొంచెము పెరిగిన తనము'- అన్నియు చంద్రు నందే చూచు చున్నాడు.

చంద్ర బింబం బని యంద్రు గానీ వియ
　ద్వల్లిఁగాచిన 1 చంద్ర బాలకాయ,
ప్రాలేయ కరుఁడన్న పలుకె కానీ మింటి
　గట్టు 2 నైలా వాలుకంబు పండు,
సోముఁ డంటయె గాని యామినీక్రకచక్ర
　త్తంబైన 3 సోమ వల్కంబు చెక్క,
యమృతాంశుఁ డనుటయే యాకాశ కార్తికో
　ద్యాన భూషణ మమృతా ఫలంబు,

　ఏకదేశ వర్ణ వ్యత్యయైక శస్య
　మాత్త వర్ణ లోపాగమ వ్యాకృతిఁగొని

1, పెద్దయేలకులు, 2. నూగుదోస, 3. వెలిచంద్ర, 4. ఉసిరిక.

పేరు మారెను వీనికన్ పృధ్విపతికి
మంత్రి చిఱునవ్వు నవ్వుచు మాఱుపలికె.

ఈ పద్యములో చంద్ర నిరాస మున్నది. రామచంద్రునియొక్క యాధిక్యమున్నది. ఇందులో రామచంద్రునియొక్క మూర్తి మిక్కిలి యెక్కువగా కట్టినది.

అశ్వమేధయాగము చేయుట నిర్ణయింపబడినది యాగారంభముతో పాటు వసంత ఋతువుకూడ నారంభించెను. ఈ వసంతము రామచంద్రుఁడు పెరుగు వఱకు తిరిగి తిరిగి వచ్చుచునే యున్నది. వేదసంప్రదాయమున మనుజుని యాయువు వసంతములతో పోల్తురు. శ్రీరామచంద్రునియొక్క దీర్ఘాయువు. ఆయన పెరుగుట ఆయన సౌందర్యము. ఆయన సర్వ శ్రేష్ఠత్వము తిరిగి తిరిగి వచ్చిన యీ వసంతర్తువుతో కవి ప్రదర్శించుచు వచ్చెను.

అశ్వమేధయాగము తొలుతనే వసంతర్తు వర్ణనము జరిగెను.

ఎఱ్ఱనౌ నేత్రమ్ము లిష్టివేళానల
ధూమ సంతానమ్ము దూఱినట్లు,
ఆకులు తినుట దీక్షాకాల భోజన
నియమ తీవ్రత చేత నెగడి నట్లు,
చివురాకు ముక్కునఁ జిమ్ముట జుహూవుచేఁ
జాత్రాదికమ్ములు పట్టి నట్లు,
పంచమ స్వరము స్తోభలు చక్కఁగాఁజూచి
సామగానమ్ములు సదివి నట్లు,
రేక లీఁకల నలుపు ధరించినట్టి
నియమవస్త్ర మాలిన్యంబు నెఱయునట్లు
సప్తతంతు మహాకార్య సమయమందుఁ
గర్తపోలికఁ గోకిల కానుపించె.

కోకిలకును క్రతువునకు నభేదాధ్యవసాయముగా నీపద్యము చెప్పఁబడినది.

ప్రతి రసాల కుజంబుఁ బచ్చిపిందెలతోడ
నెల మసలిన కాంత వలెనె తోఁచె,
ప్రతి నిస్వన ద్భంభరము యజ్ఞ దక్షిణ
కై యేగు బ్రాహ్మణు నట్లె తోఁచె,
ప్రతి మల్లె పూవు సవ ప్రేష హవిరర్థ
సుగృహీత లాజల చొప్పు దోఁచె,
ప్రతి చిన్ని పూఁదోట పలిత దోహద ధూప
ముల యజ్ఞ వాటిక వలెనె తోఁచె,

మాధవుఁడు సవప్రీతుఁ డన్మాట కలిమి
నెల్ల రీతుల సాగింప నేమొ యనఁగఁ

దాను దద్దిత రూప మాధవుఁడు వచ్చె
దీప్త మఖ యోగ్య నిర్వర్ష దీప్తమూర్తి.

రాణులయొక్క గర్భ ధారణ లక్షణములు వసంత ఋతువు నందారోపింప బడినవి. రాముఁడు జన్మించిన తరువాత ఈ వసంతర్తువు విజృంభించినది. శ్రీరామచంద్రుని జన్మము వసంత మాసముననే జరిగినది.

చిత్రభాను సంవత్సర శిశిర మేగి
అల స్వభాను వసంతమ్ము నరుగుదెంచె
ముగురు రాణులు కాన్పులు ముతుక దాల్ప
తరులు చివురాకు సన్నముల్ దాల్పఁజొచ్చె.

ఇచ్చటి వసంతవర్ణన నాల్గు భిన్నవృత్తములలో చేయఁబడినది అశ్వమేధారంభమునుండి జరిగిన వసంతర్తువు కంటె రామచంద్రుఁడు జన్మించిన నాటి వసంతర్తువు యొక్క వైలక్షణ్యము సూచించుట కిట్లు చేయఁబడినది. మధుమతి, హంసరుతము, భ్రమరవిలసితము, మత్తకోకిల - ఈ నాల్గు వృత్తములును వ్రాయఁబడినవి. ఈ వృత్తము లొకదానికంటె నొకటి పెద్దవి. మొదటి మధుమతి చిన్నివృత్తము.

వగరు పిందెలతో
చిగురు టాకులతో
తొగరు వన్నెలతో
మిగిలె మావి తరుల్

ఈ వృత్తములోని అచ్చతెనుఁగు మాటలతో మెత్తని కూర్పుతో రామచంద్రుని బాల్యము నందలి సౌకుమార్య మంతయు వ్యంజిత మగుచున్నది.

హంసరుతము ·

శ్రీ సంపాదితములై యు
ద్యానం బొప్పఁగ సరోజా
వాసంబై మధు రవంబై
కూసెన్ మత్త కల హంసల్.

పూర్వ వృత్తముకంటె నిది చరణమున కొక్క యక్షర మెక్కువకలది. అది నగణ ముతో నారంభించును. ఇది మగణముతో నారంభించును. ఇందు రామచంద్రుడు పెరుగుట, మాటలునేర్చుట సూచింపఁబడినది మత్త కలహంసలు కూసెననుట దీనికి వ్యంజకము.

తరువాత భ్రమరవిలసితము. ఇది హంసరుతము కంటె పెద్దవృత్తము. భ్రమరములు సంచరించినట్లు రామచంద్రుఁడు పెరిగి విహరించుటమొదలైనవి దీనిచేతఁ దెలియఁ బడుచున్నవి.

నాల్గవది మత్తకోకిలము. ఇది రామచంద్రునియొక్క యవతార సార్థక్యమును జూపు చున్నది.

మాధవాగము మెల్లలోచన మంజు శోణ నవచ్ఛవిన్
సాధులై యొసఁగన్ పికీ తతి శ్రావ్యమోహన గీతికా

మాధు నిర్ఝరపాళి చిమ్మఁగ మాధవుం డరుణాతుఁడై
సాదు ధర్మము నెగ్గఁజేసెడి చాయ దోచిన దెల్లెడన్.

మాధవాగమము, వసంతర్తువు-విష్ణువుయొక్క అవతారము. మాధవుం డరుణాక్షుఁడు. వసంతర్తువు ఎఱ్ఱని చివురాకులతో నొప్పుచున్నదనియు, రామచంద్రుని కన్నులు భాగ్యవద్రాగ రేఖ కలవనియు సాధుధర్మము నెగ్గఁజేసినవాఁడు గవా, శ్రీరామచంద్రుఁడు: శ్రీరామచంద్రుని యవతారమే అందుకని.

ఈ మత్తకోకిలమే తీసికొనుట ఆ వృత్తముయొక్క మధురమైన గమనము కొఱకు. రామచంద్రుని శీలవైఖరి సూచించుట కొఱకు

రామచంద్రుఁ డేడాది పెరిగెను.

తిరిగి వసంత కాల మరుదెంచె గరుత్కనక చ్ఛవిప్రభన్
గరుడి వియత్పథంబున సుఖంబుగ ఱెక్కలు సాఁచి పోయె మై
హొరువునఁ బొంచ జన్యములు హంసలు ముక్కులు మీఱె నందక
స్ఫుర దురుకాంతి పుంజములు పుట్టె దిశాభిహతాతపంబులన్.

గరుత్మంతుఁడు ఆకాశమున సుఖముగా రెక్కలుచాచి పోయెను. అనఁగా రామచంద్రు నకుపిట్టారునని భయపడు రోజులు పోయిన వన్నమాట. హంసవలె రాముఁడు నడచు చుండెనన్న మాట. నందకాసికాంతులు రామచంద్రుని యందు ప్రకాశించుచున్న వన్నమాట.

మరల నేడాది జరిగినది.

తిరిగి వసంతకాల మరుదెంచెను మాధవుఁడున్ బ్రభుత్వ వై
ఖరిని వనాంతముల్ బహుముఖంబులఁ బొందఁగ స్వీయముద్ర ని
ర్భర సుమనోభిరాముఁడయి రాజిలె రాజిత రాజకీరముల్
పరువులు వెట్టె నాత్మభువు వారువ ముల్ హరి దుజ్జ్వలాంగముల్.

రామచంద్రుఁడు పెరిగెను. ఆయనలో ప్రభులక్షణము దీపించు చుండెను. ఆయనయందు దేవతల కభిలాష పెరుగుచుండెను.

మరల రెండు మూడేండ్లు గడచెను.

తిరిగి వసంతకాల మరుదెంచె వినూత్న శిఖ ప్రభా శిఖా
హరణము వోలె నొప్పెఁ జివురాకుల తుట్టతుదల్ జగా జిగుల్
రురువులు లేత పచ్చికలు రోసెను సాగెను నాగచెట్టు గం
బుర లుమిసెన్ వనీ శిలలు మోసిన కస్తురి లేళ్ళ పక్కముల్.

ఇది రామచంద్రున కెన్మిమిదవయేడు ఉపనయన కాలము వచ్చినది. వసంతకాలము తన యెఱ్ఱదనము చేత అగ్నిని తీసికొని వచ్చిన్నట్లున్నదట. రురువులు-అనఁగా లేళ్ల పచ్చికల

కోసము వెదకెనట. అనఁగా ఉపనీతునకు జందెము చిట్టచివర లేడి చర్మమును కట్టుదురు. మరియు లేడిచర్మమే పూర్తిగా జందెమువలె వేయుదురు, దానికిది సూచన. చాగచెట్టు సాగి నది చాగనార తీసి త్రాళ్లుపేని వటువు నడుమునకు బిగించికొనును, దండమునకు కట్టుకొనును, రామచంద్రునియందొక వటులక్షణమే లేదు, రాజలక్షణము కూడనున్నది. అందుచేత కస్తూరి లేళ్ళ ప్రసక్తి

రామచంద్రునకు పంద్రెండేళ్ళు వచ్చినవి.

చెలువుల్ చెల్మలు నుబ్బఁగా మరల వచ్చెంబో వసంతంబు క్రొం
జిలమల్ చెల్మలఁ బాడఁగా మరలఁ దెచ్చెంబో వసంతంబు పి
చ్ఛిలముల్ తేనెలు కాల్వలై సొగసు హెచ్చెంబో వసంతంబు వె
న్నెల పంద్రెండగు రేకలన్ దగె హిమానీ కాంతి బింబంబునన్.

ఈ రీతిగా రామచంద్రుని పెరుగుదల యంతయు పుట్టిన నాటనుండి వసంతర్తువుతో అభేద ప్రతిపత్తిగా చేయఁబడినది.

ఇంకొక విషయము. భగవంతుఁడైన విష్ణువు దశరథ మహారాజు హస్తమున నున్న పర్వాన్నమునందు ప్రవేశించుట. ఇష్టికాండము చివరి రెండు పద్యములును.

ముది పృదాకువు సెజ్జ మునులు జోదిళ్ళియ
హాళిమైఁ గూర్కు సుమాళి యొకఁడు,
పామిన్కు చిట్టచివళ్ళలో నసురుల
దోరించు నట్టి కటారి యొకఁడు,
ప్రామట్టి కినిడఁ బారమ్ము మునులతో
మునులచేఁ జదివించు పోఁడు డొకఁడు,
పాలవెల్లి కరళ్ళపై వెలికింతలై
కాలిత్రేవే ల్చికెడు కందొకండు,

పసిమియై గాలికిని రాలిపడిన యొక్క
నలుసు నివ్వరిముల్లైన వెలుఁ గొకండు,
స్థూలమై వచ్చివచ్చి తా సూక్ష్మమగుచు
జనపతి కరస్థమగు పాయసమునఁ జొచ్చె.

అసుర కన్యాకంఠహార మంగళసూత్ర
సూత్ర కర్తన కేళి సురియ వాటు,
దనుజ వాపీ కేళివన సర్వతోభద్ర
భద్రతా హానువుపైఁ బావకోడు,
బర్హిర్ముఖాళి సంపత్తి వృద్ధ్యాజీవ
జీవ మృగా కృష్టి జిగురుఁ గండె,
మునిధర్మకర్మ నిర్మూలనో త్క్యుపకంఠ
కంఠ దేశములకుఁగాని దిగులు,

సూరి లోకైక కంటకాసుర వితాన
ప్రాణముల పైకినెత్తిన పాము పడగ
యగు మహాజ్యోతి యొక్కఁ డంతంత వచ్చి
జనపతి కరస్థమగు పాయసమునఁ జొచ్చె.

మొదటి పద్యములో మునులు స్తోత్రములు చేయుచున్న శేషశాయి. తరువాత వేదాంతముల నసురులను సంహరించుచున్నవాఁడు. తరువాత మఱ్ఱిచెట్టు క్రింద మునులను చదివించు బాలకుఁడు. తరువాత క్షీర సముద్రముమీద పండుకొనిన శిశువు. చివరకు నీవార శూక వత్తనువు. ఈ రీతిగా తగ్గితగ్గి సూక్ష్మమై దశరథుని చేతిలోని పాయసమున ప్రవేశించెను పరమేశ్వరుని యొక్క అంశ విరాణ్మూర్తి నుండి తగ్గితగ్గి సూక్ష్మాతిసూక్ష్మ వైఖరిని పైకొనిన క్రమ మిందు చెప్పఁబడినది.

రెండవ పద్యములో రామావతారముయొక్క విజృంభణము క్రమప్రాప్తియు చెప్పఁబడినవి. మొదటి చరణములో అవతార పరమార్థము చెప్పఁబడినది. రెండవ చరణములో 'పావకోడు' అన్న శబ్ద నిక్షేపముచేత పాదుకా వృత్తాంతము సూచింపఁబడినది. మూడవ చరణమున 'మృగాకృష్టి' యన్న శబ్దముచేత మారీచ వృత్తాంతము సూచింపఁ బడినది. నాల్గవ చరణమున 'కంఠ' శబ్దముచేత దశకంఠ నిర్మూలనము సూచింపఁబడినది. గీత పద్యమునందు 'ఎత్తిన పాము పడగ' యనుటచేత రామచంద్రునియొక్క సర్వాధర్మ నిర్మూలనా హేతుకావతార జయ పతాకా లక్షణము సూచింపఁ బడినది.

ఈ పద్యములకు జవాబు పద్యములు గలవు. ఈ జవాబు పద్యములు వ్రాయుట కావ్యము నందొక శిల్పము. ఈ శిల్పమును పూర్వకవు లొకటి రెండు మార్గములుగానే వాడిరి. తిక్కన్న 'దుర్వారోద్యమ బాహువిక్రమ' మొదలైన పద్యములో ద్రౌపదియొక్క కీచకునితో మాట్లాడి నప్పుడున్న స్థితి అంత అచ్చముగా భీమునకు తెలియునట్లు ద్రౌపది చెప్పిన దనుటకు గుర్తుగా వ్రాసెను.

సీతారాముల ప్రణయములో మేనకా విశ్వామిత్రుల సమాగమ లక్షణము సీతారాముల సమాగమ లక్షణమునందు చూపింపఁబడినదని చెప్పితిమి. మరల నిది యింకొక్కఁడు.

దేవత లందఱు శ్రీరామచంద్రుని జన్మవేళ కౌసల్యా పురుటింటి ప్రాంతమున చేరిరి రామచంద్రుఁ డుదయించినాడు. అప్పుడు మరల రెండు సీసపద్యములు. షష్టి ఖండాంతమైన సీసపద్యముల కివి జవాబులు.

పామిన్కు గమిఁ బంటఁబట్టి నీళ్ళులఁ ద్రవ్వు
కొని పోవు నసుర వెన్కొనిన మీను,
శరధిలో మున్ను మంధర మాడఁ బైడిప్పఁ
గుదురు చేసిన చిన్ని కూర్మరాజు,
హేమాక్షుఁడను తుంగ నెగచి ముట్టియను బా
తాళంబు గ్రుమ్మిన దట్టు పోత్రి,
స్తంభంబున సకలాంతర్యామితకు సాక్ష్యు
ముగఁ జీల్చి వెలలిన మృగవిభుండు,

విఱిచి పెరిగించుఁ దననేర్పు వెలయ క్షత్ర
జాతిఁ బోకార్చి వెలయింపఁ జాలుటకును
బరశు ధనువులతో మూర్తిపట్టు వెలుఁగు
జనపతి కరస్థమగు పాయసమునఁ జొచ్చె.

ఈ పద్యమునందు దశావతారములలో రామావతారము వఱకునైన ఆఱవతారములు చెప్పఁబడినవి. రాముని దేడవ యవతారము. తక్కిన యవతారములు చెప్పఁబడలేదు. ఈకలుగఁ చున్న బిడ్డ విష్ణువుయొక్క యేడవ యవతారమని చెప్పుటకు

క్షీరాబ్ధి తరగలో శ్రీపయోధరములో
తొలిపాము పొలసులోఁ దూఁగు శయ్య,
చలువ వెన్నెల చాలొ మఱయు నెండల వాలొ
యగ్గిమంటల డాలొ నిగ్గు చూపు,
ప్రామిన్కుల చివళ్లొ బహుళసృష్టి మొదళ్లొ
యచ్చతెల్వి కరళ్లొ యసలు మూర్తి,
తెఱగంట్ల హాళికో దితిజాళి మోళికో
పట్టిన కేళికో వచ్చు నటన,

ఇట్లు వైకుంఠమందొ మౌనీంద్ర హృదయ
మందొ తన దహరాకాశ మందొ యైన
చిత్తు నానందమును మించు సత్తొకండు
జనపతి కరస్థమగు పాయసమునఁ జొచ్చె.

ఈ పద్యమైన తరువాత 'అంతనెల్ల జనుల కనిమిషత్వముపోయి మానవత్వ మెల్ల మగిడినట్లు' అన్నదానిలో ఇతఃపూర్వము దేవతల ప్రసక్తి యంతయు పోయి, మరల రాణుల యొక్క నిండునెలల లక్షణ మందు కొనఁబడినదని సూచన.

★

శ్రీ జగన్నాథ పండితరాయ విరచిత
లక్ష్మీలహరి

అనువాదకులు : డాక్టర్ శ్రీ బూర్గుల రామకృష్ణరావు.

హర క్రోధ త్రస్య న్మదని నవ దుర్గ ద్వయ తులాం
దధ త్కోక ద్వంద్వ ద్యుతి దమన దీక్షాధి గురుతామ్
తవైత ద్వక్షోజ ద్వితయ మరవిం దాక్ష మహిళే
మమ స్వాంత ధ్వాంతం కిమపిచ నితాంతం శమయతు.

వర కోక ద్వయ కాంతి శిక్షణ గురుత్వ ప్రౌఢి రాణించి శం
కరు కోపానకు డాగు మన్మథుని దుర్గ ద్వంద్వ మై మించి, యో
యరవిం దాక్షుని యింతి! నీ కుచ యుగ మ్మస్మ న్మో ధ్వాంత వి
స్తర మెల్లన్ హరియించుఁ గావుత నితాంత మబ్ధి కన్యామణీ! 21

అనేక బ్రహ్మాండ స్థితి నియమ లీలా విలసితే
దయా పీయూ షాంభో నిధి సహజ సంవాస భవనే
విధో శ్చిత్తా యామే హృదయ కమలే తేతు కమలే!
మనా జ్మ న్నిస్తార స్మృతి రపిచ కోణే నివసతు.

వివిధా జాండము లేలు లీలల గడున్ బెంపొంది, యావాస పుం
భవన మ్మోచుఁ గృపామృతాంబు నిధికిన్, బద్మాక్షు భావోదయ
స్తవనీయ మ్మయినట్టి నీదు హృద యాబ్జమ్మందు నేమూలనో
యవభాసించుత మత్సముద్ధరణ కార్యజ్ఞప్తి నీ యిందిరా! 22

మృణాళీనాం లీలాః సహజ లవణిమ్నా లఘయతాం
చతుర్ణాం సౌభాగ్యం తవ జనని! దోష్ణాం వదతు కః
ఉర స్ని స్వచ్ఛందం మరకత శిలా మాంసల రుచః
శ్రుతీనాం స్పర్ధాం యే దధత ఇవ కంఠే మధు రిపోః

నిజ లావణ్యమునన్ మృణాళ రుచులన్ నిర్జించు యుష్మ చ్చతు
ర్భుజ సౌభాగ్యము నెన్న నేరితరఁ మంభోజాక్షు కంఠ శ్రుతి
వ్రజ సంస్పర్ధ సమర్థమై మరకత గ్రావము ప్రభా పుంజ సం
విజయశ్రీ రుచి రంజితమ్ము లవి యో విశ్వేశి! రంజిల్లెడిన్. 23

అలభ్యం సౌరభ్యం కవికుల నమస్యా రుచిరతా
తథాఽపిత్వద్ధస్తే నివస దరవిందం వికసితమ్
కలాపే కావ్యానాం ప్రకృతి కమనీయ స్తుతి విధౌ
గుణో త్కర్షా ధానం ప్రథిత ముపమానం సమజని.

కవి లోకాంజలు లంది సౌరభ సముత్కర్ష మునన్ బొంద నె
ట్లువునమ్మా! యరవింద మందిర! భవ ద్దస్తము నం దున్న భా
గ్యవిధిన్ గాక, నిసర్గ సుందర నుతిన్ గావ్యమ్ము దాఁ బోల్కియై
స్తవనీయ మ్మరవింద మంచిత గుణో త్కర్ష మ్మునన్ బొల్చెడిన్. 24

అనల్పం జల్పంతు ప్రతిహతధియః పల్లవ తులాం
రసజ్ఞా మజ్ఞానాం క ఇవ కమలేః మంథర యతు
త్రపంతు శ్రీ భిక్షా వితరణ వశీభూత జగతాం
కరాణాం సౌభాగ్యం తవ తులయితుం తుంగ రసనాః.

మందులు వాగు చుండెద రమంద గతిన్ జివురుల్ సమానమం,
చందరి నోరు మూయ వశమా? కమలా! నెరవాదు లెందు సి
గ్గందరె? భిక్ష వెట్టి సిరు లన్ని జగమ్ములలో నొనర్చు నీ
యందము గుల్కు హ స్తముల యందముతో నెది సాటి నెప్పగన్. 25

సమాహార శ్శ్రీణాం, విరచిత విహారో హరిదృశాం
పరీహారో భ క్త ప్రభవ భవ సంతాప సరణేః
ప్రహార స్సర్వా సామపిచ విపదాం విష్ణు దయితే
మమోద్ధారో పాయం తవ సపది హారో విమృశతు.

హారము నీది కల్పిత విహారము విష్ణు దృశాళికిన్ సమా
హారము శ్రీలకున్, శ్రిత జనాఖిల సంసృతి దుర్వ్యథా పరి
హారము, కష్టకోటికిఁ బ్రహారము, తాఁ గనిపెట్టుతన్ మదు
ద్ధారము దారి యొక్కటి సుధారుచి సోదరి! విష్ణుసుందరీ! 26

అలంకుర్వాణానాం మణిగణ ఘృణీనాం లవణిమా
యదీయాభి ర్భాభి ర్భజతి మహిమానం లఘురపి
సుపర్వ శ్రేణీనాం జనిత పర సౌభాగ్య విభవా
స్తవాం గుళ్య స్తామే దదతు హరి వామే ఽ భిలషితమ్.

సరవిన్ దీరిచి దిద్ద నమ్మణి ఘృణీ సర్వస్య లావణ్యముల్
పరమాల్పంబులెయై, యదీయమగు శోభన్ బ్రాభ వోత్కర్షులై
సుర పాళీ పరభాగ్య కల్పకము లై శోభిల్లు నీ యంగుళుల్
హరివామా! దయసేయు గావుత మదీ యాభీష్ట సంభారమున్. 27

తప స్తేపే తీవ్రం కిమపి పరితప్య ప్రతిదినం
తవ గ్రీవా లక్ష్మీ లవ పరిచయా దాప్త విభవమ్
హరేః కంబుం చుంబత్యభవహతి పాణౌ, కిమధికం
వదామ స్త్రత్రా ఽయం ప్రణయ వశతో ఽస్య స్పృహయతి.

దిన దినమున్ దపించి యొక తీరునఁ దీవ్ర తప మ్మొనర్చి తాఁ
గొనె విభవమ్ము నీదు మెడఁ గొల్వగు శోభ యొకింత గొల్చి, దా

నిని హరి ముద్దు వెట్టుకొని నిల్చెడుఁగా యరచేత మోహముఁ
గొని యిటు శంఖముఁ, జననీ! గొప్పతనమ్ము మరేమి సెప్పుదుఁ. 28

> అథా ద్రప్రత్యూహః సకల హరి దుల్లాసన విధి
> ర్విలీనో లోకానాం సహినయన తాపోఽపి కమలే।
> తవాస్మిన్ పీయూషం కిరతి వదనే రమ్య వదనే।
> కుతో హేతో శ్చేతో విధురయ ముదేతి స్మజలధేః.

ఆ వదనమ్ము రమ్య వదనా! భవదీయ మశేష దిక్కులఁ
భావితముం బొనర్పఁగఁ బ్రభాతతిఁ, గన్నుల తాపమార్పి, యా
ప్లావితముం బొనర్చుచు నిలాస్థలి నయ్యమృతంబు నింప యే
లా విధు బింబ మయ్యా దుదయంబగు నివ్విధి వారిధిఁ రమా! 29

> ముఖాంభోజే మందస్మిత మధుర కాంత్యా వికసతాం
> ద్విజానాం తే హారావలి విహిత నీరాజన రుచామ్
> ఇయం జ్యోత్స్నా కాపి స్రవ దమృత సందోహ సరసా
> మమోద్య ద్దారిద్ర్య జ్వర తరుణ తాపం తిరయతు.

వద నేందు స్ఫుట మందహాస మదుర వ్యాప్తిఁ నిగారింపు శో
భ దలిర్పఁ నవరత్న హారములు శుంభ చ్చారు నీరాజన
మ్మొదవింపఁ ద్విజ పఙ్క్తి వెన్నెల యొకం డుప్పొంగి పీ యూష సం
పద దారిద్ర్య మహోజ్వర జ్వలన తాప మ్మెల్ల జల్లార్చుతన్. 30

> కులైః కస్తూరీణాం భృశ మశి మాశాస్య మపిచ
> ప్రభాత ప్రోన్మీల న్నలిన నివహై రశ్రుత చరమ్
> వహంత స్సౌరభ్యం ఋజుగతి విలాసా మమ శివం
> తవ శ్వాసా నాసా పుట విహిత వాసా విదధతామ్.

ఘన కస్తూరి కులమ్ము ముచ్చట వడుఁ గల్యాణి! ప్రాభాత మో
హన పద్మావళి కెన్నఁడుఁ వినను రా దాలాటి సౌరభ్య మూ
నిన నీ శ్వాసలు నాసికా పుట సమున్మేషమ్ము లత్యార్జవో
ప నియుక్తమ్ములు మాకు సర్వ శుభ సంప ల్లాభముల్ గూర్చుతఁ. 31

> కపోలేతే డోలాయిత లలిత లోలాలక వృతే
> విముక్తా ధమ్మిల్లా దభిలసతి ముక్తావళి రియమ్
> స్వకీయానాం బందీకృతి మసహమానై రివబలా
> న్నిబ ధ్వోర్ధ్వం కృష్టా తిమిర నికురంబై ర్విధు కలా.

ఊఁయెల చేర్చు లై యలక లూగఁ ద్వదీయ కపోల పాళి ము
క్తాయత మాల చాల సొగ సొ గద నీ తురుమందు జారుచున్
స్వీయుల బంధెఁ బెట్టుటకుఁ జీఁకటు లోర్వక కట్టె వేణిపై
ఛాయ ననంగ సిందుకళ చాగు భవ న్మకుటాగ్ర రేఖలోన్. 32

ప్రసాదో యస్యాయం నమ దఖిల గీర్వాణ మకుట
స్ఫ సర్ప జ్యోత్స్నాభి శ్చరణ తల పీఠార్చిత విధిః
దృగంభోజం త త్తే గతి హసిత మ త్తేభగమనే!
వనే లీనై ర్దీనైః-కధయ కధ మీయా దిహ తులామ్.

వినుత సురాళి మౌళి మణి విస్తృత చంద్రిక లంఘ్రి పీఠికా
ర్చన విధి కౌనో యెయ్యది ప్రసాదము సూపగ, నట్టి నీదు లో
చనమునకున్ వనంబునన సారెకు లీనము దీనమైన య
వ్వనజము సాటి యెట్టులగుఁ బల్కవె భద్ర గజేంద్ర గామినీ! 33

దురాపా దుష్వ్రృత్తై ర్దురిత దమనే! ధారణ భరా
దయార్ద్రా దీనానా ముపరి, దల దిందీ-ర నిభా
దహంతీ దారిద్ర్య ద్రుమకుల ముదార ద్రవిణదా
త్వదీయా దృష్టి ర్మే జనని! దురదృష్టం దలయత

దుష్టుల కందరా, దఖిల దుష్కృతముల్ దమియించు నెంతయున్
కష్టము నోర్చు, దీనులను గాంచిన యంత దయా రసార్ద్రిమౌ,
నిష్ట ధనమ్ము లిచ్చు, దహియించు నభాగ్య తరు ప్రతానమున్
దృష్టి త్వదీయ మంబ దురదృష్టము నాయది వాపు గావుతన్. 34

తవ శ్రోత్రే ఫుల్లోత్పల సకల సౌభాగ్య జయినీ
సదైవ శ్రీనారాయణ గుణ గణౌఘ ప్రణయినీ
——————————మనిశ మవధా నాతి శయినీ
మమాప్యేతాం వాచం జలధి తనయే గోచర యతామ్.

కలువల కల్మలన్ గెలిచి, కంజ దళాతు గుణ ప్రసక్తులన్
వలపులు గుల్కి, యాలనయుఁ బాలనయుం బొనరించి దీన వా
క్కుల నలరారు నీ చెవులు గోచరముం బొనరింపఁ జేసికో
గలుగుత నాదు పల్కిది జగజ్జననీ! జగదేక సుందరీ! 35

ప్రభా జాలైః ప్రాభాతిక దిన కరా భావ నయనం
తవేదం భేదం మే విఘట యతు తాటంక యుగళమ్
మహిమ్నా యస్యాయం ప్రలయ సమయేఽపి క్రతు భుజామ్
జగ త్పాయం పాయం స్వపితి నిరపాయం తవ పతిః.

అరుణార్క ద్యుతి పుంజమున్ జెవులు వట్టాడింపగా నేర్చు సుం
దర దీప్తిన్ దగ భేదముం దొలచు ద్వ తాటంక యుగ్మమ్ము నీ
వరుఁ డెవ్వాని ప్రభావ మెంచి ప్రళ యాపాయమ్ము నం గూడ ని
ద్దుర పోవున్ నిరపాయ మమ్మరో! సుదాంధోలోక భద్రస్థితిన్. 36

నివాసో ముక్తానాం నిబిడతర నీలాంబుద నిభ.
స్తవాయం ధమ్మిల్లో విమలయతు మల్లోచన యుగమ్

భృశం యస్మిన్ కాలాగురు బహుళ సౌరభ్య నివహైః
పతంతి శ్రీ భిక్షార్థిన ఇవ మదాంధా మధులిహః.

శ్రీ కాలాగురు చారు సౌరభ తతిన్ శ్రీ భిక్షు నర్థించి న
ట్లాకంపించి మదంబునన్ మధుకర మ్మల్లల్లనన్ మూగు నెం
దాకల్ప మ్మది ముత్తెపున్ సరుల క య్యంబోధ సాంద్ర ప్రభా
శ్రీ కమ్మౌ కబరీ భరమ్ము విమల శ్రీ దిద్దు నా కన్నులన్. 37

విలగ్నౌ తే పార్శ్వ ద్వయ పరిసరే మత్త కరిణౌ
కరో న్నీ తై రంచన్మణి కలశ ముఖాస్య గలితైః
నిషించంతౌ ముక్తామణి గణ మయై స్త్వాం జలకణై
ర్నమ స్యామో దామోదర గృహిణి దారిద్ర్య దళితాః.

నీ యిరువంకలన్ మొనసి నిల్చి మదేభములున్ స్వహస్త శో
భాయుత నవ్య భర్మ మణి పాత్రికలం దగవాంచి నవ్య ము
క్తాయత రత్న పుంజ మయ హారి సుగంధ జలాభిషేకముల్
సేయగ నొప్పు నీకు నతి సేసెద నస్మ దభాగ్య మీఁగగన్. 38

అయే మాత ర్లక్ష్మి! త్వ దరుణ పదాంభోజ నికటే
లుఠ న్తం బాలం మా మవిరళ గలద్బాష్ప జటిలమ్।
సుధా సేక స్నిగ్ధై రతి మసృణముగ్ధైః కరతలైః
స్పృశంతీ మారోదీరితి వదన మాశ్వాస్యతి కదా.

అమ్మా! లక్ష్మి! త్వదీయ మయ్యరుణ పాదాంభోజ సాన్నిధ్యమం
దిమ్మాడ్కిన్ బడి యేక ధారగ నయో యిట్లేడ్చు నీ పాపనిన్
లెమ్మా! యంచు సుధా ప్రసేక మసృణ స్నిగ్ధమ్ములౌ చేతులన్
నెమ్మో మంటుచు నన్ను దేర్చు టెపుడో నీ వేద్వకం చమ్మరో. 39

రమే! పద్మే! లక్ష్మి! ప్రణత జన కల్ప ద్రుమ లతే!
సుధాం భోధేః పుత్రి! త్రి దశ ని కరో పాస్త చరణే!
పరే! నిత్యం మాత ర్గుణమయి! పరబ్రహ్మ మహిళే!
జగన్నాథ స్యాకర్ణ య మృదుల వర్ణావళి మిమామ్.

కమలా! లక్ష్మి! పరా! సమాశ్రిత జగ త్కల్ప ద్రుమాంత ర్లతా
అమృతాంభోనిధి పుత్రికా! త్రిదశ లోకారాధి తాంఘ్రి ద్వయీ!
రమ! మన్మాత! గుణాత్మికా! శివ! పరబ్రహ్మాంగనా! చారు వ
ర్ణము లాలింపుము రామకృష్ణుల జగన్నాథోక్త లక్ష్మి స్తుతిన్. 40

శ్రీ శ్రీ శ్రీ

ఆంధ్ర తర్క సంగ్రహము

శ్రీ కుప్పా బైరాగి శాస్త్రి

౧

శ్లో॥ నిధాయ హృది విశ్వేశం విధాయ
గురు వందనం
బాలానాం సుఖ బోధాయ క్రియతే
తర్కసంగ్రహః.

హృదయమందు విశ్వేశ్వరుని ధ్యానించి గురువులకు వందనము గూడ చేసి బాలురకు సుఖముగా గ్రంథము తెలియుటకొరకు తర్కసంగ్రహము చేయబడుచున్నది.

గ్రంథాదియందు అనుబంధ చతుష్టయము అనగా అధికారి, చెప్పబడు విషయము, సంబంధము, గ్రంథప్రయోజనము నిరూపింపవలయును గాన ఈ శ్లోకము వలన బాలురకు దెలియుటకు అని చెప్పుటలో బాలురు గ్రంథము చదువుటకు అధికారులనియు తర్కములు అనగా పదార్థములు విషయములనియు సుఖబోధ ప్రయోజనమనియు ప్రతిపాద్య ప్రతిపాదక భావము సంబంధమనియు తెలిసికొనవచ్చును.

తర్కసంగ్రహ కారులు అన్నంభట్టారకులు — గ్రంథనిర్విఘ్న పరిసమాప్తికి గ్రంథాదియందు మంగళముచేసి, (ఇష్టదేవతా నమస్కారాత్మకము మంగళము) శిష్య శిక్షకొరకు అనగా శిష్యులు గూడ గ్రంథమునకు ప్రారంభములో మంగళము చేయువలయును, అని తెలిసికొనుట కొరకు గ్రంథాదియందు నిబంధించినారు.

మూ॥ ద్రవ్య గుణ కర్మ సామాన్య విశేష
సమవాయా ఉభావా స్సప్త పదార్థాః.

తర్క సంగ్రహమనగా, తర్క్యంతే ప్రతిపాద్యంతేఇతి (తర్కించబడుచున్నవి, లేక చెప్పబడుచున్నవి గనుక) తర్కాః అనగా పదార్థములు. తేషాంసంక్షేపేణ స్వరూప కథనం. అనగా శేలికగా వానిని గురించి చెప్పుట సంగ్రహము అని చెప్పబడుచున్నది కాన పదార్థములనుగురించి చెప్పు శాస్త్రమే తర్కశాస్త్రము - ఆ పదార్థములు 1 ద్రవ్యము 2 గుణము, 3. కర్మ, 4 సామాన్యము, 5. విశేషము 6. సమవాయము, 7. అభావము అని ఏడు రకములుగా విభజించబడుచున్నవి. ద్రవ్యములే అనంతములుగా ఉండగా ఏడురకములుగా విభాగము ఎటుల పొసగు నన, విభాగహేతువు లయిన ద్రవ్యత్వ గుణత్వ కర్మత్వ సామాన్యత్వ విశేషత్వ, సమవాయత్వ అభావత్వ రూప ధర్మములు ఏడు అగుటవలన ఆ ద్రవ్యత్వము మొదలగు నేడు విభాజక ధర్మములలో ఏదో ఒక్కొక ధర్మము గలవి, ఆ పదార్థములని అర్థము చెప్పుకొనుచున్నాము గానదోషము లేదు.

శ్లో॥ తత్ర ద్రవ్యాణి పృథి వ్యప్ తేజో
వాయ్వా
కాశ కాల దిగాత్మ మనాం సి నవైవ.

ఏడుపదార్థములలో ఉన్న ద్రవ్యములు పృథివి, అప్, తేజస్సు, వాయువు, ఆకాశము, కాలము, దిక్కు, ఆత్మ, మనస్సు అనితొమ్మిదివిధములుగాఉన్నవి. ఇక్కడ గూడా ఒక్క పృథివి (భూమి) అనేకములుగా ఉండగా అన్నియు కలిసి తొమ్మిది అని చెప్పుట సరియగునా

అనగా, ఇదివరలో చెప్పినట్లు విభజించుటకు కారణములయిన పృథివీత్వ, అప్త్వ, తేజస్త్వ, వాయుత్వ, ఆకాశత్వ, కాలత్వ, దిక్త్వ, ఆత్మత్వ, మనస్త్వాదులు తొమ్మిదియే అగుటచేత ఆ తొమ్మిది ధర్మములలో నేదియో ఒక్కొక్క ధర్మము కలవి ద్రవ్యములు అని అర్థము చెప్పుకొనవలయును.

మూ॥ రూప, రస, గంధ, స్పర్శ, సంఖ్యా, పరిమా
ణ, పృథక్త్వ, సంయోగ, విభాగ, పరత్వ, అప
రత్వ, గురుత్వ, ద్రవత్వ, స్నేహ, శబ్ద, బుద్ధి,
సుఖ, దుఃఖ, ఇచ్ఛా, ద్వేష, ప్రయత్న, ధర్మా ధర్మ
సంస్కారా, శ్చతుర్వింశతి గుణాః.

ఏడుపదార్థములలోని గుణములు, రూపత్వ, రసత్వ, గంధత్వ, స్పర్శత్వ సంఖ్యాత్వ, పరిమాణత్వ, పృధకత్వత్వ, సంయోగత్వ, విభాగత్వ, పరత్వత్వ, అపరత్వత్వ, గురుత్వత్వ, ద్రవత్వత్వ స్నేహత్వ, శబ్దత్వ, బుద్ధిత్వ, సుఖత్వ దుఃఖత్వ,ఇచ్ఛాత్వ, ద్వేషత్వ,ప్రయత్నత్వ ధర్మత్వ, అధర్మత్వ, సంస్కారత్వములు అనే విభాగమునకు కారణమైన ఇరువది నాలుగు ధర్మములలో ఏదో ఒక్కొక్క ధర్మము కలవి

మూ॥ ఉత్క్షేప ణా పక్షేపణా కుంచన ప్రసా
రణ గమనాని పంచకర్మాణి

ఏడు పదార్థములలో కర్మలు ఉత్క్షేపణత్వ, అపక్షేపణత్వ, ఆకుంచనత్వ, ప్రసారణత్వ, గమనత్వము లనెడు నయిదు విభాజక ధర్మములలో ఏదియో ఒక్కొక్కధర్మము గలవి కర్మలు.

మూ॥ సామాన్యం ద్వివిధం పర, మపరం చేతి.

ఏడు పదార్థములలో సామాన్య మగు నది పరత్వము అపరత్వము అను రెండు విభాజక ధర్మములలో ఏదియో ఒక ధర్మము గలది.

శ్లో॥ విశేషాః నిత్య ద్రవ్య వృత్తయో
అనంతా ఏవ.

నిత్యములయిన ద్రవ్యముల (పృథివి జలము,తేజస్సు, వాయువు ఈ నాల్గింటి పరమాణువులు, ఆకాశకాలది గాత్మమనస్సులు నిత్యద్రవ్యముల) యందుండు విశేషములు, నిత్యద్రవ్యములు అనంతములు గాన, విశేషములు గూడ అనంతములే, లెక్కపెట్టుటకు వీలుగానివి.

మూ॥ సమవాయ స్త్వేక ఏవ.

ఏడు పదార్థములలోని సమవాయము ఒక్కటియే, అనగా తనకు సమాన జాతీయమైన రెండవ వస్తువు లేని దని అర్థము—

అభావ శ్చతు ర్విధః ప్రాగభావః ప్రధ్వంసాభావః అత్యంతాభావో అన్యోన్యాభా
వ శ్చేతి—

ఏడు పదార్థములలో అభావము, ప్రాగభావత్వ, ప్రధ్వంసాభావత్వ, అత్యంతాభావత్వ, అన్యోన్యాభావత్వ, రూపమైన నాలుగువిభాజక ధర్మములలో ఏదోఒక్క ధర్మముగలది యైయుండును

మూ॥ తత్ర గన్ధవతీ పృథివీ.

తత్ర అనుచోట తత్ అను శబ్దము బుద్ధిస్థ వస్తువును చెప్పున దగుటచేత ద్రవ్యములు అనిఅర్థము. త్రత్ ప్రత్యయమునకు ఇమిడిఉన్న అని అర్థము. అందుచేత ద్రవ్యములయందు ఇమిడియున్న పృథివి (గంధవతి) గంధము కలది.

లక్షణ ప్రమాణములచేత వస్తు సిద్ధి అగును. ప్రస్తుతము పృథివి అని నిర్ణయింపబడుటకు అనగా మనకు సిద్ధించుటకు పృథివికి లక్షణము చెప్పవలయును. కాన గన్ధవతి అని పృథివికి లక్షణము చెప్పబడుచున్నది.

పృథివికి ఏమిటి లక్షణముఅనగా గంధవత్వము. గంధవత్త్వమనిన గంధనిష్ఠ ఆధేయతానిరూపితఅధికరణతాశ్రయత్వము. పృథివి గంధముకలది అనగా పృథివియందు గంధము ఉండుటచేత పృథివి అధికరణము అయినది. గంధము ఆధేయమైనది ఆధేయమునందు ఆధేయతయు అధికరణమందు అధికరణతయు గలవు. ఆ అధికరణత్వ ఆధేయత్వములకు నిరూప్య నిరూపక భావసంబంధము గలదు గాన ఆధేయతా నిరూపితము అధికరణత అగుచుండును. గంధము ఆధేయము గాన గంధమందున్న ఆధేయతా నిరూపితము పృథివియందున్న అధికరణత. ఆ అధికరణతకు ఆశ్రయము పృథివి అయినది. లక్షణమును లక్ష్యమందు సమన్వయము చేయుటకుగాను గంధమునందు ఉన్న ఆధేయత ఏది అని ప్రశ్నలో (పృథివ్యాం గంధోఽస్తి) పృథివియందు గంధమున్నది అను ప్రతీతి సిద్ధమైన ఆధేయత అని చెప్పవలయును. ఆ ఆధేయతా నిరూపితమైన అధికరణత ఏదియన పృథివియందు గంధముకలదు, అను ప్రతీతి సిద్ధమైన అధికరణత ప్రతీతి చేతను వ్యవహారముచేతను వస్తు సిద్ధిగనుక ప్రతీతి సిద్ధమైనవి ఆధేయత్వ అధికరణత్వములు ఆ అధికరణతకు ఆశ్రయము పృథివిగనుక గంధనిష్ఠఆధేయతా నిరూపిత అధికరణతాశ్రయత్వ రూప లక్షణము లక్ష్యమైన పృథివియందు ఉండుటచేత లక్షణ సమన్వయము చేయబడినది. లక్షణము నిఖిల లక్ష్యముల యందు ఉండవలయును. లక్ష్యముకాని వానియందు ఉండగూడదు. కొన్ని లక్ష్యముల యందు లక్షణము ఉండక పోవుట అవ్యాప్తిదోష మనియు, ఏలక్ష్యమందున లక్షణము ఉండకపోవుట అసంభవ దోషమనియు, లక్ష్యముకాని దానియందు ఉండుట అతివ్యాప్తి దోషమనియు చెప్పుదురు.

ప్రస్తుతము పృథివికి చెప్పిన గంధమందున్న ఆధేయతచే నిరూపితమైన అధికరణతాశ్రయత్వము లక్ష్యముకానటువంటి కాలమందుగూడ ఉండుటచేత అతివ్యాప్తి దోషము పట్టుచున్నది ఎటులనగా గంధమునందున్న ఆధేయత ఏదియన, సర్వమునకు ఆధారము కాలము, అను ప్రతీతిచేత అన్నింటికి కాలము ఆధారముగాన, అన్నింటిలో గంధము గూడ జేరియుండుటచే గంధమునకు గూడ కాలము ఆధారము, అనగా అధికరణము కాలము, అప్పుడు గంధము ఆధేయము ఆ గంధమునందున్న ఆధేయతా నిరూపితమైన అధికరణత ఏదియన సర్వాధారః కాలః అను ప్రతీతి సిద్ధమైన కాలమందున్న అధికరణత దానికి ఆశ్రయము కాలము, అందుచేత పృథివీ లక్షణము లక్ష్యము గాని కాలమందు ఉండుటచేత అతివ్యాప్తి అను దోషము వచ్చినది. ఆదోషనివారణ కొరకు లక్షణమును కొంత మార్చవలయును. గంధమందలి సమవాయ సంబంధావచ్ఛిన్నమైన ఆధేయతచే నిరూపితమైన అధికరణ తాశ్రయత్వము పృథివికి లక్షణ

మని పృథివియందు గంధము సమవాయ సంబంధముచే ఉండును పృథివి గుణి, అనగా గుణములుకలది గంధముగుణము గుణమునకు గుణికి గల సంబంధము సమవాయము. కాన ప్రస్తుత లక్షణములో గంధమందున్న సమవాయ సంబంధావచ్ఛిన్నమైన ఆధేయత ఏది, అనగా పృథివియందు సమవాయ సంబంధముతో గంధముగలదు అనుప్రతీతి సిద్ధమైన ఆధేయత, కాని (సర్వాధారః కాలః) సర్వమునకు ఆధారము కాలము అను ప్రతీతి సిద్ధమైన ఆధేయత గాదు. ఆప్రతీతిలో కాలము సర్వమునకు కాలిక సంబంధము చేతనే ఆధారమగును. సమవాయసంబంధముచే ఆధారముకాదు. కాన సమవాయసంబంధా వచ్ఛిన్నమైన గంధమందలి ఆధేయత ఏది? అని ప్రశ్నలో పృథివియందు సమవాయ సంబంధముచే గంధము గలదు అను ప్రతీతి సిద్ధమైన గంధమందలి ఆధేయతయే. ఇచ్చట యే సంబంధముచేత ఆధేయము ఆధారమందు ఉండునో ఆ సంబంధా వచ్ఛిన్నము ఆధేయత అగును. గంధమైన ఆధేయము సమవాయ సంబంధముచే ఆధారమైన పృథివియందు గలదు. కాన గంధమందలి ఆధేయత సమవాయ సంబంధా వచ్ఛిన్నమగును. ఆ సమవాయసంబంధా వచ్ఛిన్న గంధమందలి ఆధేయతా నిరూపితమైన అధికరణత పృథివియందే ఉన్నది, కాలమందు లేదు కాలమందలి అధికరణత గంధమందలి కాలిక సంబంధా వచ్ఛిన్నమైన ఆధేయతా నిరూపితము అగును. అందుచేత సమవాయసంబధా వచ్ఛిన్న ఆధేయతా•నిరూపిత అధికరణత, పృథివియందేఉండి కాలమందు లేదు గనుక అతివ్యాప్తి రూపదోషము లేదు

మరలజలమందు అతివ్యాప్తి రాగలదు. ఎటులనన పృథివియందు గంధము గలదు అను ప్రతీతి సిద్ధమైన గంధమందలి ఆధేయత గంధత్వావచ్ఛిన్నము, గుణత్వావచ్ఛిన్నము అగును. ఒకచోట రెండు ధర్మములు ఉన్నచో రెంటికి అవచ్ఛేద్య అవచ్ఛేదక భావము ఏర్పడును. గంధమందు గంధత్వము, గుణము గాన గుణత్వము, ఆధేయము గాన ఆధేయత్వము గలవు. అందుచేత గంధత్వావచ్ఛిన్నము ఆధేయత అగును గుణత్వావచ్ఛిన్నము ఆధేయత అగును మనము లక్షణములో, గంధనిష్ఠమైన సమవాయ సంబంధావచ్ఛిన్నమైన ఆధేయత యేదియన, గంధమందలి గుణత్వావచ్ఛిన్న ఆధేయత తీసికొనబడును. "ఏకధర్మావచ్ఛిన్న ఆధేయతా ఏకైవ" అను న్యాయముచే గంధమందలి గుణత్వావచ్ఛిన్న ఆధేయత, శీతస్పర్శయందలి గుణత్వావచ్ఛిన్న ఆధేయత గూడ అగుచుండును ఒకే ధర్మముచే అవచ్ఛిన్నమైన ఆధేయత యెచ్చట నున్నను ఒక్కటే గాన. అటువంటి ఆధేయతా నిరూపితమైన అధికరణత ఏది యనగా గంధమందలి గుణత్వావచ్ఛిన్న ఆధేయతా నిరూపితమైన జలమందలి అధికరణత తీసికొనబడును. తదాశ్రయత్వము జలమందు గలదు గనుక పృథివి లక్షణము అలక్ష్యమైన జలమందుండుటచే మరల అతివ్యాప్తి వచ్చినది.

దాని నివారణకొరకు గంధమందలి ఆధేయతయందు సమవాయ సంబంధావచ్ఛిన్నత్వ మను విశేషణము వేసినట్లుగా

గంధత్వావచ్ఛిన్నత్వ మను విశేషణము గూడ వేసినచో దోషము పోవును. గంధత్వావచ్ఛిన్న సమవాయ సంబంధావచ్ఛిన్న ఆధేయత ఏదియన గంధమందలి గంధత్వావచ్ఛిన్న ఆధేయతయే గాని గంధమందలి గుణత్వావచ్ఛిన్న ఆధేయత కాదు. తన్నిరూపితమైన అధికరణత పృథివియందే ఉండును. కాని జలమందు ఉండదు. జలమందు, గంధమందలి గుణత్వావచ్ఛిన్న మైన యే ఆధేయత కలదో తన్నిరూపతమైన అధికరణత మాత్రమే యుండును. తదాశ్రయత్వము పృథివియందే యుండి జలమందు లేదు గనుక అతివ్యాప్తి లేదు. సమన్వయమును అయినది.

మరల పుట్టిన మొదటి క్షణములోని ఘటమందు అవ్యాప్తి. (ఉత్పన్నం ద్రవ్యంక్షణమగుణం నిష్క్రియంచా పతిష్ఠతి) పుట్టినద్రవ్యము ఒక్క క్షణకాలము గుణము, కర్మ కలిగియుండదు అందుచేత ఆ ఘటముగూడ పృథివియే కనుక అందులో నే గుణములేదు కనుక గంధము గూడ ఉండదు. కాన గంధత్వావచ్ఛిన్న మైన సమవాయసంబంధావచ్ఛిన్నమైన యే ఆధేయతగలదో దానిచే నిరూపితఅధికరణతాశ్రయత్వము, ఆ పుట్టిన మొదటి క్షణములోని ఘటమందు లేకపోవుటచే లక్ష్యములో ఒకటిఅయిన ఘటమందులేదు గాన అవ్యాప్తిదోషము పట్టినది. అందుకు లక్షణమును ఈ దిగువ విధముగా మార్చవలయును.

గంధత్వావచ్ఛిన్న సమవాయ సంబంధావచ్ఛిన్న ఆధేయతానిరూపిత అధికరణతాశ్రయమందలి జాతి కలిగియుండుట అని. ఇప్పుడు దోషము వారించవచ్చును. గంధత్వావచ్ఛిన్నమైన సమవాయసంబంధావచ్ఛిన్నమైన ఆధేయతచే నిరూపితమైన అధికరణత, రెండవక్షణము మొదలుకొని ఉన్న ఘటముల యందలి అధికరణత దానికి ఆశ్రయము రెండవక్షణముల యందలి ఘటము దాని యందున్న జాతి పృథివీత్వ రూపమైన జాతి. ఆ పృథివీత్వ రూపజాతి మొదటి క్షణములో ఘటమందుగూడ నున్నది గాన ఆ జాతిమత్త్వము, అనగా ఆ జాతి కలిగియుండుట సర్వ పృథివియందు గలదు గాన అవ్యాప్తి రూప దోషముగూడ లేదు

మూ॥ సా ద్వివిధా నిత్యా నిత్యా చేతి

ఆ పృథివి నిత్యత్వ అనిత్యత్వరూపమైన విభాజక ధర్మములలో ఏదో ఒక ధర్మము గలది.

మూ॥ నిత్యాః పరమాణుః రూపాః అనిత్యాకార్య రూపాః

నిత్యమైన పృథివి పరమాణు రూపమైనది. కార్యరూపమైన పృథివి అనిత్యరూపమైనది.

మూ॥ పున స్త్రివిధాః శరీరేంద్రియ విషయ భేదాత్.

తిరిగి ఆ నిత్యానిత్య రూపమైన పృథివి శరీరత్వ ఇంద్రియత్వ విషయత్వరూపములైన మూడు విభాజక ధర్మములలో ఏదియో ఒకటి కలది.

మూ॥ శరీర మస్మ దాదీనాం.

మనయొక్క శరీరము పార్థివశరీరము.

మూ॥ ఇంద్రియం గంధ గ్రాహకం ఘ్రాణం

గంధమును గ్రహించునది, అనగా గంధ ప్రత్యక్షములో గంధము విషయము. గంధమును విషయముగా కలిగియుండుటయే గంధ విషయకత్వము. గంధవిషయక ప్రత్యక్షమును కలుగజేయు

ఇంద్రియము , ఘ్రాణము. ఘ్రాణేంద్రియమునకు లక్షణము ఏమనిన గంధ విషయక ప్రత్యక్షమును కలుగ జేయుచు నింద్రియమగుట- లక్షణ సమన్వయము. గంధవిషయక ప్రత్యక్షమనగా ఇది మంచి గంధము, ఇది చెడుగంధము అను ప్రత్యక్షము. ఆ ప్రత్యక్షమును కలుగజేయుట ఇంద్రియము గాన ఇంద్రియ త్వ ము. (ఇంద్రియమగుట) ఘ్రాణేంద్రియమందు గలదు గాన లక్ష్యమైన ఘ్రాణమందు లక్షణమైన గంధవిషయక ప్రత్యక్షమును కలుగజేయుచు ఇంద్రియమగుట అనునది కలదుగాన లక్ష్యమందు లక్షణ సమన్వయమైనది.

గంధవిషయక ప్రత్యక్షమును కలుగజేయుట యే ఘ్రాణేంద్రియమునకు లక్షణము చెప్పిన, ప్రత్యక్షములో విషయము కారణము గాన గంధప్రత్యక్షములో గంధము కారణమైనది. గాన ప్రత్యక్షమును కలుగజేయుట గంధమందుగూడ నుండుటచే గంధమందు అతివ్యాప్తి, అందుకొరకు ఇంద్రియమగుట అను విశేషణము గూడ లక్షణములో జేర్చిన గంధము గుణముగాని, ఇంద్రియము కాదు గాన ఇంద్రియత్వము లేదు గనుక అతివ్యాప్తిలేదు. పోనీ (ఇంద్రియత్వము) ఇంద్రియమగుట మాత్రమే లక్షణముగా చెప్పిన ఇతర రసనాది ఇంద్రియములయందు ఇంద్రియమగుట అను ధర్మము ఉన్నది గాన అతివ్యాప్తి వచ్చును. అందుకని గంధవిషయక ప్రత్యక్షమును కలుగజేయుట అను విశేషణము గూడ అవశ్యకము.

మూ॥ విషయో మృత్పాషాణాదిః.

మట్టి రాళ్ళు మొదలుగా గల పృథివి విషయ పృథివి యని చెప్పబడుచున్నది.

*



దేవపూజకు

★

చిత్రశిల్పి
శ్రీ కె రాజయ్య

★

మృత్యుముఖంలో తుదిరోజు

విక్టర్ హ్యూగో

అనువాదం : శ్రీ రెంటాల గోపాలకృష్ణ

౧

1

ఉరిశిక్ష! అయిదు వారాల పాటు నేను ఇదే ఆలోచనతో ఉండిపోయాను. అహర్నిశలూ ఇది ఒక్కటే ఆలోచన. అనుక్షణం ఇది మనస్సులో మెదిలి, కదిలి, మనిషిని గడ్డకట్టుకపోయాను. ఈ భారంతో ఈ విచారంతో క్రుంగి కృశించి పోయాను.

రోజులు గడిచాయి. కాని వారం గడిస్తే ఒక వత్సరం గడిచినట్లుంది నాకు. అయినా మనుష్యులందరిలాగే ఉన్నాను నేను. ప్రతిరోజు, ప్రతిగంట, ప్రతినిముషం నాలో ఒక్కొక్క భావం మొలకెత్తుతోంది. నడివయస్సులో ఉన్న మనస్సు నాది సంపన్నంగా ఉన్న మనస్సునాది మనస్సునిండా ఎక్కడలేని మోహాలు వచ్చి ముసురుకుంటున్నాయి. వాటికి ఒక వరుస-క్రమమూ లేదు. ఒక అంతూ-పంతూ లేదు. వచ్చిందివచ్చినట్లు ఒక్కొక్కదాన్నే ఒడిసి పట్టుకుంటున్నాను. వాటిని విడతీసి చూచుకోడం నాకొక వినోదంగా ఉంది. వాటితో జీవితంతాలూకు ఒక అంతులేని రంగురంగుల గుడ్డను నేయడం మొదలుపెట్టాను, సాలీడు గూడు నేసినట్లు. ఉల్లిపొరలాంటి ఉడుపులతో అందాలు ఒలికించే అమ్మాయిలు, దీపకాంతులతో కనులు మిరుమిట్లు గొలుపుతూ ఇసుకవేస్తే రాలనిజనంతో కోలాహలంగా ఉన్న నాటకశాలలు, శాఖోపశాఖలుగా విస్తరించిన బాదంచెట్లనీడల్లో, బంగారుపిట్టల్లా శృంగారించుకుని రాత్రిళ్లు రంగేళిగా విహరించే అంగనామణులు; ఓ! అదంతా ఒకలోకం! నేను బాగా బ్రతికిన రోజుల్లో, అడ్డూ-అపూ లేకుండా స్వేచ్ఛగా ఉన్న దినాల్లో గడిపినజీవితం అది. కనిన తీయటికల అది. అప్పటి ఊహాలే వేరు, ఆ ఉనికే వేరు.

మరి ఇప్పుడూ? ఇప్పుడు నేను ఖైదీని. నాదేహం ఒక చెరసాలలో మ్రగ్గుతోంది. పగతో వగతో, భయవిచలితమైన, విషవిషాదభరితమైన ఒకే ఒక భావంతో నా ఆత్మ బంధితమైఉంది గుండెల్లో గాయంవంటి ఒకేఒక ఆలోచన నన్నుతల్లక్రిందులు చేస్తోంది. నిప్పులాంటి ఒకే ఒక్క నిజంతో నామనస్సు భగభగ మండుతోంది; సుళ్ళు తిరుగుతోంది — శిక్ష, ఉరిశిక్ష!

నేను కూచున్నా పడుకున్నా, కన్నుమూసినా కన్ను తెరిచినా, ఎక్కడున్నా ఏంచేస్తున్నా, ఎప్పుడూ ఈ ఆలోచన నా ఎదుట పెనుభూతంలా ప్రత్యక్షమై నన్ను భయపెడుతోంది. విషాదగీతంలా మనస్సును వేయివిధాల చెదరకొడుతోంది. వెంటాడి వేధిస్తోంది. తరిమితరిమి కొట్టి

బాధిస్తోంది. మరొక విషయంపై మనస్సు మళ్లించుకున్నా సరే, పాటకు పల్లవిలా ఇది వెంట పడుతూనే ఉంది. నేను జైలులో ఇనుప కట్టకటాల వెనుక మేల్కొని ఉన్నప్పుడు చుట్టూ ముట్టడి వేస్తోంది. కలత నిద్రలోకూడా నన్నొకకంట కనిపెడుతోంది. కలలో ఒక కత్తిపోటులా కనపడుతోంది.

నేను అప్పుడే నిద్రలో ఉలికిపడి లేచాను. "ఆఁ, ఇదొక కలలే!" అనుకున్నాను. కాని కనులు ఇంతింత చేసుకుని చూద్దునుకదా! కలకాదు, నిలువునా ప్రాణాలు తీసే నిజం! జైలుగది అంతటా ఈనిజం నిప్పులు కక్కుతోంది. చిందులు తొక్కుతోంది. ప్రతిగోడమీద, ప్రతి రాతి మీద ఇదే కనుపించింది. నా ముందున్న దీపకాంతిలోనూ, నేను తొడుక్కున్న ముతకచొక్కా మీదనూ, గదిముందు తుపాకి పట్టుకుని పహరా ఇస్తున్న కాపలావాడి ముఖంమీదనూ, ఈనిజం రక్తంతో రాసిపెట్టిఉంది! నాచెవిలో 'మరణదండన, మరణదండన!' అంటూ ఒకధ్వని మారుమ్రోగింది!

2

అది అగస్టు నెలలో ఒకనాటి ఉదయం. అప్పటికి మూడు రోజులక్రితమే నా విచారణ మొదలయింది. ఆ మూడు రోజులూ ఒకపెద్ద తిరణాల ఉన్నట్లుంది కోర్టు. కోర్టంతా తీర్థప్రజలా జనం-ఎక్కడెక్కడి వాళ్లూ వచ్చి ఎగబడి చూడసాగారు. కుళ్లిపోయిన శవం చుట్టూ మూగిన కాకుల్లా, గద్దల్లా మూగారు. ఆ మూణ్ణాళ్లూ నాఊరూ' పేరూ; నే చేసిన నేరం. ఘోరం; జనమంతా చెవులు దొప్పలు చేసుకుని విన్నారు. జడ్జీలు, సాక్షులు, ప్లీడర్లు, బారిస్టర్లు, ప్రాసిక్యూటర్లు;వీరంతా నాముందు ఒకప్పుడు వికారంగానూ, మరొకప్పుడు విలాసంగానూ- కాని ఎల్లప్పుడూ విషాదంగానూ ఆడిన ఆటలు, పాడిన పాటలు, చేసిన సేదువలు ఒక ఇంద్రజాల విద్య తిలకించినట్లు అంతా తిలకించాను. మొదటి రెండు రాత్రిళ్లూ భయంవల్లా, ఏమవుతుందో అన్న ఆతృతవల్లా విచారంవల్లా నాకు కన్ను మూతపడలేదు. కాని మూడోనాటి రాత్రి కల్లా అలుపూ - ఆయాసం వచ్చి పిచ్చి నిద్ర పట్టింది. అర్ధరాత్రివేళ జూరీలు (పంచాయితీదార్లు)నన్ను వదిలిపెట్టారు తిరిగీ నన్ను జైల్లోపడేసి వెళ్లిపోయారు. గదిలోకి వచ్చీరావడంతోనే అక్కడ అధ్వాన్నంగా ఉన్న గడ్డికుప్పమీద పడి గాఢంగా నిద్రపోయాను ఇన్నాళ్ళకు సెలవుగా నేను కంటినిండా నిద్రపోయింది ఈ కొద్దిగంటలే.

వాళ్ళు వచ్చి లేపేటప్పటికి నేనింకా గాఢనిద్రలోనే ఉన్నాను. ఎప్పుడుబట్టి నా కాపలావాడు పెద్ద తలమేకులు కొట్టిన బూట్లతో టకటక నడిచి వస్తుంటే ఆ ధ్వని చెవిన పడేసరికి ఉలికిపడి లేచేవాణ్ణి. అతని చేతిలో గుప్పెడు తాళాల గుత్తి గలగల లాడేసరికి లేచి కూచునేవాణ్ణి. తలుపు గడియలు తీస్తుంటే ఆ గరగర చప్పుడుకు కొట్టినట్లు లేచేవాణ్ణి. కాని ఈతడవ అవేవీ నాపై పని చెయ్యలేదు. నన్ను లేపడానికి అతను తన కరోరకంఠంతో నా చెవిదగ్గర అరవవలసి వచ్చింది. తన కర్కశ హస్తాలతో నా వీపున తట్టవలసి వచ్చింది

"లేవవయ్యా, లే!" అని అరిచాడు కాపలావాడు.

నేను కళ్ళు తెరిచాను. కలవరపడి లేచి కూచున్నాను. అప్పటికి ఫెల్లున తెల్లవారింది. పొద్దుకూడా పొడిచింది. కిటికీలోనుంచి పచ్చని, వెచ్చని, పలచని ఎండపొడ దూసుకుని వచ్చి జైలుగదిలో పడుతోంది. ఎండ అంటె నాకెంతో ఇష్టం!

"ఎంత బావుంది ఇవాళ!" అన్నాను నేను కాపలావాడితో.

అతను జవాబు చెప్పలేదు ఒకక్షణం సేపు ఆశ్చర్యపోతూ చూశాడు నాతో కబుర్లాడుతూ కూచోవడంవల్ల ప్రయోజనం లేదన్నట్లు ముఖంపెట్టాడు. చివరకు "అవును. బావుంది." అని గొణిగాడు.

నేను కదలకుండా అలాగే కూచున్నాను. నాకింకా నిద్రమత్తుగానే ఉంది, చిరునవ్వు నవ్వుకుంటూ, బంగారం నీరు పోసినట్లున్న ఆ ఎండ పొడవంక తదేకంగా చూస్తూ కూచున్నాను.

"ఎంత చక్కనిరోజు ఇవాళ, ఎంత చల్లనిరోజు ఇవాళ!" అన్నాను నేను మళ్ళీ.

"అవునుగాని, వారు నీకోసం కనిపెట్టుకుని ఉన్నారు." అన్నాడు కాపలామనిషి, అన్యవధానంగా.

ఈ ఒక్క మాటా, ఎగిరిపోతున్న ఈగను సాలీడు తన దారాలతో ఒడిసి పట్టుకుని గూటిలో పడేసుకున్నట్లు, నా ఊహావిహంగాల రెక్కలు విరిచి నన్ను మళ్ళీ వాస్తవజగత్తులో పడేసింది. వెంటనే 'అసైజు కోర్టు'హాలు నా కనులముందు పొడకట్టింది. అక్కడ, గుర్రపునాడాలా, అర్ధవలయాకృతిలో కూచున్న జడ్జీలు, వారు ధరించిన ఎర్రటి ఉడుపులు, మూడు వరుసలుగా తీరి కూచున్న సాక్షులు, వారి తెలివితక్కువ ముఖాలు, నా బెంచీకి ఈ కొసన, ఆ కొసన నిలుచున్న ఇరువురు రక్షకభటులు, కోర్టువెనకాల్ల నీడలో గుంపుకూడిన జన సమూహం, వారు నా వంక సూదులుగుచ్చుతున్నట్లు చూచే చూపులు, పన్నెండుమంది కోర్టుపంచాయితీదార్లు; వీరంతా నా కళ్ళముందు కనుపించారు.

నేను లేచి నిలుచున్నాను నా నోరు తడబడుతోంది. కాళ్ళూ చేతులూ కంపించి పోతున్నాయి నా గుడ్డలు ఎక్కడ పెట్టుకున్నానో తెలీదు వెదకబోయేసరికి మోకాళ్ళు కలకల్లాడాయి. అడుగు పెట్టబోయే టప్పటికి, కొండంత బరువు మీదవేసుకున్న కూలివాడిలాగా ముందుకు తూలిపడ బోయాను. చివరకు ఎలాగో ఒకలా కాపలావాడి వెంట వెళ్ళాను.

ఇద్దరు పోలీసులు జైలువాకిట్లో కనిపెట్టుకుని ఉన్నారు. నేను వెళ్ళీవెళ్ళగానే నా చేతులకు సంకెళ్ళు తగిలించారు. ఆ సంకెళ్ళకు మళ్ళీ ఒక చిక్కుతాళం తగిలించారు; ఒక మరకు ఇంకొక మర !

లోపల నడవదాటి వెళ్ళాంమేము. నిర్మలమైన ప్రభాత వాయువులు నన్ను సేద తీరుస్తున్నాయి. నేను తల ఎత్తి చూచాను మబ్బు-మాయ లేని నిర్మలమైన నీలాకాశం, జగజ్జ్యోతిలా ప్రకాశిస్తున్న సూర్యకాంతి, కళ-కాంతుల్లేని ఆ ఎత్తయిన జైలుగోడలమధ్య కనుపించి, నా మనస్సుకు ముదాన్ని కలిగించాయి. నిజంగా ఎంతచక్కటిరోజు ఇవాళ, ఎంత చల్లటిరోజు ఇవాళ!

మేం చుట్లు చుట్లుగా తిరిగిన ఒక ఎత్తయిన మెట్లవరుస ఎక్కి వెళ్ళాం. తరువాత ఒక నడవగుండా నడిచివెళ్ళాం. తరువాత ఇంకొకటి, పిమ్మట మరొకటి- మూడోనడవ దాటిన తరువాత క్రింద బిలంలా ఉన్న ఒక చిన్న తలుపు తెరుచుకుని వెళ్ళాం. అదే'అసైజు కోర్టు'. వెచ్చని గాలివచ్చి నా వంటికి గుప్పున తాకింది. అంతులేని అలజడి వచ్చి నా చెవుల్లో దూరింది. కోర్టులో గుమికూడిన జన సందడి అది నేను కోర్టులో ప్రవేశించాను.

నేను కంటపడడమే తరవాయి—— కేకలు. చప్పట్లు మిన్నుముట్టాయి. అకస్మాత్తుగా బెంచీలు, కుర్చీలు అటు - ఇటు మార్చారు. బల్లలు సర్దారు. ఇరువైపులా జనం బారుతీరి ఉన్నారు. సోల్జర్లు జనాన్ని అదుపులో పెడుతున్నారు. పొడుగాటి హాలులో గుండా బారులు తీరిన జనంమధ్య నుంచి నడిచి వెడుతున్నాను నేను హాలుమధ్యకు వచ్చి చూదునుకదా, రెండుప్రక్కలా జనానికి అడ్డుగా తీగలుకట్టిఉండడం కనుపించింది.

అప్పుడు చూచుకుంటే నా చేతులకు అరదండాలు లేవు ఎప్పుడు తీసేశారో, ఏమో, నాకు జ్ఞాపకంలేదు

తరువాత కోర్టు హాలంతా నిశ్శబ్దం అలుముకుంది నేను నా స్థానంలోకి వెళ్ళాను. జనంలో ఎక్కడా అలికిడి అన్నమాటలేదు. నా మనస్సులో వేరే ఆలోచనాలేదు.నాఆలోచనలన్నీ కూడా అణగిపోయాయి. అప్పుడు అకస్మాత్తుగా నాకు అవగతమైంది స్పష్టంగా కనుపించింది. ఆక్షణం-ఆఖరుక్షణం రానేవచ్చింది. ఇహ ఇప్పుడు నాకు శిక్ష చెపుతారు. ఆ శిక్ష వినిపించడానికే నన్ను అక్కడికి తీసుకొచ్చారు.

నిజంచెప్పాలంటే, ఆవిషయం అవగతమైనప్పుడు నా కెలాటి భయమూ కలగలేదు అప్పటి తీరూ-తెన్నూ వేరుగా ఉంది. కోర్టుహాలు కిటికీలు, తలుపులూ అన్నీ, బార్లగా తీసిఉన్నాయి బయటినుంచి గాలి రివ్వున దూసుకుని వస్తోంది. నగరంలో సాగే సందళ్ళన్నీ, మోగే శబ్దాలన్నీ స్వేచ్ఛగా వచ్చి లోపల చొరబడుతున్నాయి దీపాలు పెట్టిన పెళ్ళి పందిరిలా హాలంతా కళకళ లాడుతోంది. చక్కని,చిక్కని ఎండపొడ కిటికీల్లోనుంచి దూసుకుని వచ్చి అక్కడక్కడ బల్లలమీద కుర్చీలమీద, ప్లీడర్ల, జడ్జీల తలల మీద మడుగులుకట్టి కనిపిస్తోంది. కిటికీలకు సూటిగా ఉన్న గోడలపై, సూర్యకిరణాలు కుప్పగా వచ్చిపడి చిత్రవిచిత్రమైన ఆకృతులు కల్పిస్తున్నాయి. ఆ కాంతి పుంజం బంగారపు రజను రాలుస్తున్నట్లుగా ఉంది.

హాలులో చిట్టచివర ఉన్నారు జడ్జీలు. వారి వదనాల్లో సంతృప్తి ద్యోతకమవుతోంది తమపని పూర్తికావచ్చిందన్న సంతోషంవల్లకాబోలు, అలా ఉన్నారు! ప్రెసిడెంట్ ముఖం ప్రశాంతంగా ఉంది. యువకుడైన అసెసర్ ఒకాయన మహా ఉల్లాసంగా ఉన్నాడు. ప్రత్యేక అనుమతిపై,తన వెనకాల గులాబీరంగు హేటు పెట్టుకొని కూచున్న ఒక యువతితో ఏదో కబుర్లాడుతున్నాడు.

ఒక్క జూరీలముఖాలుమాత్రమే వెలవెలబోతూ, విసుగు చెందినట్లు కనుపిస్తున్నాయి. రాత్రంతా నిద్రకాచిన బడలికవల్లనే అలా ఉన్నారు పాపం! కొందరు

ఆవలిస్తున్నారు కూడా. వారి వదనాల్లో ఎంత వెదికి చూచినా 'ఉరిశిక్ష విధించమని తీర్పు ఇచ్చినట్లు' ఎక్కడా పొడ గట్టడంలేదు. సహృదయు లయిన ఈ పౌరుల ముఖాల్లో ఎప్పుడు నిద్రపోదామా అన్న ఆతృత ఒక్కటే నాకు అగుపిస్తోంది

నాకు ఎదురుగా ఉన్న ఒక కిటికీ బార్లగా తెరచి ఉంది. ఆ కిటికీలో నుంచి అవతల వీధిలో శబ్దాలన్నీ నాకు వినవస్తున్నాయి వీధిలో పువ్వులమ్మేవాళ్లు పకపక నవ్వుకుంటున్నారు కిటికీ అరగోడ మీద ఏదో ఒక చిన్న పూలమొక్క మొలిచింది. చూడముచ్చటగా ఉంది. పచ్చగా, ఎండపొడలో మిలమిల మెరిసిపోతోంది. గాలికి అటూ ఇటూ ఊగుతోంది.

ఇలాంటి ఆనందపు టూహలలో మధ్య, ఏ అమంగళమైనా వచ్చి ఎలా అంతరాయం గలిగిస్తుంది? వెచ్చనిఎండా, చల్లనిగాలీ, పచ్చనిపృధ్వీ, కళకళలాడే ప్రకృతీ—వీటిలో తేలిపోతూ. సోలిపోతూ స్వేచ్ఛగా తిరిగేమనిషి—అలాంటిమనిషినే నేను నా హృదయంలోనూ ఆశలు రేకులు విచ్చుతున్నాయి, ఆకాంక్షలు పొంగివస్తున్నాయి. ప్రాణంమీద తీపి, బ్రతుకుమీద భ్రమ, స్వేచ్ఛమీద ఇచ్ఛ - వీటితోనే నాకు ఏం తీర్పు చెబుతారో విందామని కనిపెట్టుకుని ఉన్నాను.

ఈలోగా నా పక్షాన వకీలు రానే వచ్చాడు. ఆయనకోసమే వాళ్ళంతా కనిపెట్టుకుని ఉన్నారు. ఆయనగారు అప్పుడే ఉపాహారం పుచ్చుకుని వచ్చాడు. తన స్థానంలోకి వెళ్లి ఆయన చిరునవ్వు నవ్వుతూ నామీదికి వంగి "నాకింకా ఆశ ఉంది" అన్నాడు.

"నాకు కూడా!" అని జవాబు చెప్పాను నేను, కులాసాగా మందహాసం చేస్తూ.

"అవును వాళ్ళ తీర్పును గురించి నాకింకా ఏమీ తెలియలేదు. కాని వాళ్ళు ముందే ఆలోచించుకున్నట్లు కనుపిస్తోంది - సందేహం లేదు అంచాత యావజ్జీవ కారాగారశిక్ష వేస్తారేమో అనుకుంటున్నాను. నీ వేమంటావు మాన్‌షియర్?" అని అడిగాడు. ప్లీడరు.

నాకు షాక్ కొట్టినట్లయింది.

"అంతకంటె మరణం వెయ్యిరెట్లు నయం!" అని చెప్పాను.

అవును, మరణం! అనుకున్నాను నాలో నేను, ఏదో అంతర్వాణి పలికినట్లు. కాని ఒక్క విషయం - కుంభపోతగా జోరున వానకురుస్తూ, చిట్లు - చీకట్లు కమ్ముకున్న ఒక శీతాకాలపు నిశరాత్రివేళ ఉరిశిక్ష చెపితే చెప్పవచ్చు కాని, మంగళప్రదమైన శ్రావణమాసంలో (అగస్టు నెలలో) ఇలాంటి ఒక చక్కటి రోజున, ఉదయం ఎనిమిది గంటలవేళ, బుద్ధిమంతులైన ఈ పంచాయితీదార్ల సమక్షంలో అలాంటి శిక్ష చెప్పడం సాధ్యమేనా? నా చూపులు వెళ్లి కిటికీ అరగోడ మీద మనోహరంగా ఎండపొడలో మిలమిల మెరిసిపోతున్న పూలమొక్కపై వాలాయి.

అప్పటివరకూ నా వకీలు కోసమే వేచిఉన్న ప్రెసిడెంట్, హఠాత్తుగా నన్ను లేచి నిలుచోమన్నాడు. మెరుపు

బిగె తళుక్కుమన్నట్లు తక్షణం సొజె ర్లంతా బందోబస్తులో నిలుచున్నారు. వెంటనేఅందరూకూడాలేచి నిలవబడ్డారు. కోర్టులో దిగువభాగాన ఒక టేబిల్ ముందు అప్రధానంగాను, అతిదీనం గాను అగుపిస్తూ ఒకవ్యక్తి ఉన్నాడు — బహుశా అతను కోర్టుగుమాస్తా అయి ఉంటా డనుకున్నాను. అ త ను మాట్లాడుతూ, నా పరోక్షంలో పంచా యతీదార్లు ఇచ్చిన తీర్పును చదవడం మొదలుపెట్టాడు. నా వళ్ళంతా ముచ్చ మటలు పోశాయి. కాళ్ళు గజగజ వణి కాయి. ప్రాణం తేలిపోయింది. పడిపోతా నన్న భయంతో గోడకు ఆనుకున్నాను.

"ఇహ తీర్పు చెపుతున్నాం. మీ రేమైనా మాట్లాడదలుచు కున్నారా?" అని ప్రెసిడెంట్ నా ప్లీడరును అడిగాడు.

నా అంతట నేను ఎంతో చెప్పాలను కున్నాను. కాని నోటమాట రాలేదు. పళ్ళు ఇనకరుచుక పోయాయి.

నాతరఫు వకీలు లేచాడు. పంచాయితీ దార్ల తీర్పుప్రకారం చెప్పిన శిక్షను కొంత తగ్గించడానికీ, దానిస్థానే ఏదో కొంత అపరాధం చెల్లించడానికి అనుమ తించవలసిందని అర్థించడానికి పూను కున్నాడాయన. అది నా కెంతో కష్టం కలిగించింది. నా అభిమానం దెబ్బతిన్నది.

నాలో ఎన్నెన్నో - వేలకొలదిఉ ద్వే గాలు ఒక్కపెట్టున ఉబికివచ్చాయి. ఆగ్రహంతో ఆపాదమస్తకం దహించుక పోయాను. ఇదివరకు అన్నమాటే మళ్ళీ బిగ్గరగా అనాలనుకున్నాను. 'అంతకంటె మరణం వెయ్యిరెట్లు నయం' అని. కాని నాకు ఊపిరి సలపలేదు. ఏదో గొంతు ను లి మి వే స్తు న్న ట్లు ఉక్కిరి బిక్కిరి అయ్యాను. చివరకు చెయ్యెత్తి చూపు తూ నాప్లీడర్ తో 'వద్దు!' అన్నాను, కంపితస్వరంతో.

పబ్లిక్ ప్రాసిక్యూటరు నా ప్లీడరు చెప్పింది ఖండిస్తూ వాదించాడు. నేను అవివేకంతో చెవులు దొన్నెలు చేసు కుని విన్నాను. ఆయన వాదన సరైనదే అని సంతృప్తి చెందాను. తరువాత జడ్జీలు అవతలికి వెళ్ళి మాట్లాడుకున్నారు. మళ్ళీ తిరిగి వచ్చారు అప్పుడు ప్రెసిడెంట్ నాకు విధించిన శిక్ష బిగ్గరగా చదివాడు.

"ఉరిశిక్ష! ఉరిశిక్ష!" అన్నారు జన మంతా ఒక్కపెట్టున. నన్ను తీసుక పోతుండగా ఒకరి నొకరు తోసుకుంటూ నా వెంట పడ్డారు. ఒక శేమైనగోల—ఒక భవనం ఎక్కడికక్కడ విరిగి, కూలిపో తున్నట్లు ధ్వని! ఏదో మైకంలో నడిచి వెడుతున్నాను నేను - నాకు స్మృహ లేదు అప్పటికప్పుడే నాలో ఏదో విప్లవం చెలరేగింది. నాకు మరణశిక్ష విధించే టంతవరకూ - అందరి మనుష్యుల్లాగానే ఊపిరి పీలుస్తున్నాననీ, నా నాడి ఆడు తున్నదనీ, నేను బ్రతికే ఉన్నాననీ అను కున్నాను. కాని ఇప్పుడు - నాకూ, ప్రపంచానికీ మధ్య ఒక అగాధ మున్నట్లు స్పష్టంగా కనుపించింది. ఇప్పుడేదీ వెను కటిమాదిరిగా కనుపించడంలేదు నాకు. ఈ నిర్మలమైనగాలి, వెచ్చని పచ్చని సూర్యకాంతి, మిలమిల మెరిసే పూల మొక్క, ఇవన్నీ ఇప్పుడు కళ - కాంతు లేక, వెలవెలబోతూ, నిర్జీవంగా కనుపిం చాయి. నా చుట్టూ మూగిఉన్న స్త్రీలు పురుషులు, పిల్లలు - వీరంతా భూతా ల్లాగానూ, ప్రపంచమంతా ఒక మాయ లాగానూ తోచింది.

మెట్లుదిగి ఇవతలికి వచ్చేసరికి వాకిట్లో కటకటాలబండి ఒకటి నాకోసం కని పెట్టుకొని ఉంది. బండిలో ఎక్కబోతూ అనుకోకుండా చౌకులోకి చూచాను. చౌకులోనుంచి వెడుతున్న జనం 'ఉరిశిక్ష, ఉరిశిక్ష!' అని అరుస్తూ నాబండి వెనకాల పరుగెత్తడం మొదలుపెట్టారు. నాకళ్ళు మసకలు కమ్ముతున్నాయి. మసకమసక మబ్బుల్లో నా చూపులు, ఇరువురు అందమైన అమ్మాయిల పైకి మళ్ళాయి. ఆ పిల్లలు నావంక అదేపనిగా, ఆతురతతో చూస్తున్నారు. వారిలో ఒక అమ్మాయి "భలే! మరో ఆరు వారాల్లో అతని తల తీస్తారు!" అన్నది.

3

ఉరిశిక్ష! అవును - ఏం? ఎందుకాకూడదూ? ఏదో పుస్తకంలో చదివిన విషయం నాకు జ్ఞాపకం వచ్చింది. అదే పుస్తకమో నేను చెప్పలేను కాని, అందులో ఉన్న మంచిమాట ఒకే ఒకటి- "కాస్తముందో - వెనకో, మనుష్యులందరికీ మరణశిక్ష తప్పదు!" అలాంటప్పుడు నా ఒక్కడి విషయంలో మార్పు ఎందుకు ఉంటుంది? ఎంతో కాలం హాయిగా బ్రతకవలసిన మనుష్యులు ఎందరు ఇంతకుముందు చనిపోలేదు! నాకు ఉరిశిక్ష విధించిన లగాయతూ, నా కళ్ళఎదుటే ఎంతమంది చనిపోతున్నారు! ఆరోగ్యంగా, హాయిగా, స్వేచ్ఛగా, ఉండే యువకులు ఇహముందు ఎందరు చనిపోనున్నారు! వీరంతా అప్పుడే నూరేండ్లు నిండినట్లు ఆ కసాయి ప్రదేశం 'డ్రీగ్రేవ్'ను (ఉరితీసేచోటు) చూడబోతున్నారే! ఆ పాడుప్రదేశంలో పచ్చపచ్చగా ఉండే తనువులు ఎన్ని ఖాలి పోలేదు! పసిడి నిమ్మపండ్ల లాంటి తలలు ఎన్ని రాలిపోలేదు! ఆశ్చర్యం ఏమీ లేదు- నాతలా అక్కడ తెగి పడుతుంది!

అయినా అంతగా విచారించడానికి ఏముందికనుక? నాబ్రతుకు కిదివరకే చట్టుబండలైపోయింది. చీకటికోనలా ఉన్న ఆ జైలుగదిలో నేను ఎంత నికృష్టమైన జీవితం గడిపాను! నాముఖాన ఇంత రొట్టెముక్క, ఇన్ని చారునీళ్ళు - గొడ్లకు పడేసినట్లు ఒకతొట్టిలో పడేయడం, నావంటివాణ్ణి చూచే తీరు ఇదేనా? అంతో ఇంతో చదువుకున్నవాణ్ణే! నాగరికత కలవాణ్ణే! ఇంత పశుత్వంతో ప్రవర్తిస్తారా? యమభటుల్లా ఉండే కాపలావాళ్లు తప్ప, కంటితో చూడడానికి నోటితో మాట్లాడడానికి అక్కడ మనిషన్నవాడు ఎవడున్నాడు? అంచాత ఉరితీసేవాడు నాదగ్గరనుంచి ఏం పట్టుకపోతాడు, ఈ బాధలు, భయాలు తప్ప? తియ్యనీ, ఉరితియ్యనీ!

అయినా, అయ్యో! తలుచుకుంటే గుండె ఝల్లుమంటున్నదే!

4

"బ్లాక్ మేరియా" లో (ఖైదీలనుకోర్టు నుంచి జైలుకు తీసుకెళ్ళే ఒక వాన్. పైన అంతా నల్లరంగు. చుట్టూ ఎక్కడా సందు లేకుండా మూతవేసి ఉంటుంది) నన్ను, మరుగు ప్రదేశమైన ఈ 'బ్రిస్ట్రీ జైలు'కు తీసుకొచ్చారు.

దూరంనుంచి చూస్తే ఈ చెరసాల భవనం ఏదో గంభీరంగా కనుపిస్తుంది. చాలా దూరంగా ఒక కొండప్రక్కన ఉన్నది. ఇది ఎంతో ఎత్తున పురాతన

కాలపు రాజులు నివసించిన కోటలా ఉంటుంది. కాని దగ్గరికి వెళ్లి చూస్తే భరించలేం. భవనం భూమిలోకి క్రుంగి పోయి ఉంది. కోణాకారంగా ఉన్న భవనం పైకప్పు, శిఖరాలు, శిథిలావస్థలో ఉన్నాయి. వికారంగా, విరూపంగా కనుపిస్తోంది చూచి భరించలేవు మనకళ్ళు. భవనం మొగదల-జాగా పాడు కొట్లాడుతోంది గోడలు కుష్టు పుట్టినట్లున్నాయి. కిటికీలకు ద్వారాలు కాని, అద్దాలు కాని లేవు ఇంతింతలావు ఇనపచువ్వలు అడ్డ-దిడ్డంగా అమర్చిఉన్నాయి చువ్వలు పట్టుకుని వ్రేళ్ళాడే ఖైదీల దీన వదనాలు అక్కడక్కడ అగుపిస్తున్నాయి. ఆరి, భగవంతుడా! పూర్వకాలంలో రాజులు ఇక్కడ ఎట్లాఉన్నారో, ఏమో !

బ్రతుకు కేవలం నగ్నంగా ఉందిక్కడ!

5

చెరసాలలో అడుగుపెట్టానో లేదో, ఇనుపచేతులు నన్ను చిక్కించుకున్నాయి. నా విషయంలో జాగర్తలు మరీ ఎక్కువైనాయి నా పరిస్థితి మరింత అధ్వాన్నమైపోయింది. భోంచే సేటప్పుడు, రొట్టెముక్క చీల్చుకోడానికి ఒక చాకు గాని, చారు తీసుక తాగడానికి ఒక చిన్న గరిటెగాని ఇచ్చిన పాపాన పోలేదు ఎవరూ. బిగుతైన వెయిస్ట్‌కోటు ఒకటి తొడిగారు నాకు. చేతులకు గోనె పట్టా ఒకటి చుట్టారు. నా ప్రాణాల విషయంలో వాళ్లే బాధ్యులు. శిక్ష తీసెయ్యవలసిందని పైకి 'అప్పీల్' చేసుకున్నాను నేను. అంచాత ఆరు ఏడు వారాలపాటు ఇష్టంఉన్నా లేకపోయినా ఈ మోయలేని బాధ్యత మోయవలసిందే వాళ్లు. నన్ను భద్రంగా, ప్రాణాలతో ఉరికంబానికి అప్పచెప్పాలి వాళ్ళు లేకపోతే వాళ్ళ ప్రాణాలమీదికి వస్తుంది! అప్పటిదాకా వాళ్ళు ఈ బరువు-బాధా మోయక తప్పదు.

మొదట్లో వాళ్లు నన్ను చెప్పలేనంత దయతో చూచారు. నాపట్ల ప్రత్యేకత కనుపరిచారు. వధ్యశాలాధికారికి కూడా నా యెడల ఎక్కడలేని శ్రద్ధాసక్తులు పుట్టుకొచ్చాయి వారు తీసుకునే జాగర్తలన్నీ అంతకంతకూ ఉరిత్రాళ్ళయి నాకు ఊపిరి సలపకుండా చేస్తున్నాయి ఏమైతేనేం, కొద్దిరోజులు గడిచేసరికి, తక్కిన అందరు ఖైదీలతో కలిసిపోయాను నేను. ఇహ ఇప్పుడు నా విషయంలో ప్రత్యేక శ్రద్ధాసక్తులు ఎవరికీ లేవు. అందరితో పాటే నిత్య కార్యక్రమాలు సాగిపోతున్నాయి. అందరికిమల్లేనే నన్నూ నీచంగా, ఒక జంతువులా చూడడం మొదలుపెట్టారు. ఇందుకు కొంచెమైనా నేను కించపడలేదు. నన్ను ఉరితీస్తారన్న భయంకూడా క్రమక్రమంగా నా మనస్సులోనుంచి మాయమవుతూ వచ్చింది. అప్పుడప్పుడు నేను జైలుకు చెందిన మత గురువుతో కులాసాగా మాట్లాడుతున్నాను. మధ్యమధ్య జైలు ఛీఫ్ వార్డర్‌తో లాటిన్ భాషలో ఏవేవో కబుర్లు చెపుతున్నాను. కాని పాపం, అతనికి లాటిన్ భాష రాదు నేనేం చెపుతున్నానో తెలీక తికమక పడేవాడు. వారానికొక మాటు ఖైదీలందరితో పాటు నేనూ షికారు వెడుతున్నాను. ఆ సమయంలో నా వంటిమీద బిగుతుగా ఉన్న వెయిస్ట్‌కోటు తీసేస్తూ ఉండడంవల్ల నాకు కొంచెం హాయిగా ఉంటోంది. తరువాత

కొంత ఆలోచించిన మీదట, రాత్రిపూట వ్రాసుకోడానికి నాకు కాగితం, కలం, సిరాబుడ్డి, లాంతరు ఇచ్చారు.

ప్రతి ఆదివారం ప్రార్థనలు జరిగేవి. ప్రార్థనలు అయిన తరువాత, విశ్రాంతి సమయంలో వరండాలోకి వెళ్ళడానికి నాకు అనుమతి ఇచ్చారు. అక్కడికి వెళ్ళి ఖైదీలతో కాసేపు కబుర్లాడడం నాకు అలవాటయిపోయింది పాపం' వాళ్ళంతా నాలాగే దౌర్భాగ్యులు, అయితేనేం, మంచివాళ్ళు. తాము చేసిన ఘనకార్యాలన్నీ నాకు చెప్పేవాళ్ళు. ఎవరినైనా సరే భయవిచలితులను కావించే విషయాలవి. కాని వారిలో ఏదో మహాశక్తి అంతర్లీనమై ఉందని అనుకునేవాణ్ణి 'యాస'గా మాట్లాడడం నేర్పారువాళ్లు నాకు. దీనికి 'అసలైన సిసలైన - భాష' అని పేరుపెట్టారు.

6

నాలో నేను ఇలా అనుకోవడం మొదలుపెట్టాను :

నాకు వ్రాయడానికి అవకాశం ఉన్నప్పుడు ఎందుకు వ్రాయకూడదూ? కాని ఏం వ్రాయను? ఈ నాలుగు రాతి గోడలమధ్య ఒక్కణ్ణీ-పిలిచేవారూ తలిచేవారూ లేక బిక్కుబిక్కుమంటూ ఉన్న నేను ఏమిటి వ్రాసేది? పద-చరణం, బయటికి వెళ్ళే ప్రాప్తం లేదే. నీలాలనింగినయినా కళ్లారా చూచే భాగ్యంలేదే. నా మనస్సంతా 'నేరము - శిక్ష, హత్య, మృత్యువు' అను ఒకే ఒక ఆలోచనలో మునిగిఉందే. జగత్తంతా నిర్జీవంగా నిశ్శబ్దంగా ఉందే. అస్వతంత్రుణ్ణి, అసమర్థుణ్ణి - ఇటువంటి స్థితిలో ఏమిటి నేను వ్రాసేది? ఈ లోకానికి నాకూ ఏనాడో ఋణం తీరిపోయింది ఇహ నే చెప్పేదేముంది ? నా మెదడంతా శూన్యమైపోయింది. శుష్కించిపోయింది ఇహ అక్కడ ఏముంది కనుక చెప్పడానికి వ్రాయడానికి?

ఎందుకులేదూ?—ఉంది! నా చుట్టూ చిట్లు - చీకట్లు కమ్ముకొస్తున్నా, వికృతాకారాలు తలలు విరియబోసుకుని చిందులు త్రొక్కుతున్నా, కొండలు కోట్లగా పెరిగివస్తున్న మబ్బులమూటున నా జీవనజ్యోతి మరుగుపడి పోతున్నా, నా అంతరాంతరాలలో ఏవో అంధశక్తులు మేల్కొంటున్నాయి. ప్రచండమైన తుఫాను చెలరేగుతోంది. బ్రహ్మాండమైనపోరాటం సాగుతోంది. విషవిషాదం వెల్లువలై పారుతోంది కాలం దగ్గరికి వస్తున్న కొద్దీ, ప్రతిగంట, ప్రతినిమిషం - నాలో ఏవేవో ఉద్వేగాలు తీవ్రంగా పొంగి - పొర్లి వస్తున్నాయి. అంతకంతకూ ప్రపంచం దూరమైపోతోంది. కనులముందు మృత్యుదేవత ప్రత్యక్షమవుతోంది కనుక ఎందుకు వ్రాయకూడదూ? - ఇదే వ్రాస్తాను బ్రతుకు ముగియ వస్తున్నప్పటికీ, జీవన గ్రంథం మూసివేసే తరుణం ఆసన్నమయినప్పటికీ, ఈ నా తుదిఘడియల్లో ఆవరించిన అంతులేని ఆవేదన, ఆందోళన, భయం, బాధ-ఇవన్నీ, ముత్యాలకూర్పు కూరిస్తే, అదొక మహాకావ్యంగా పరిఢవిల్లుతుంది. ఈ కలం, కాగితం, సిరాబుడ్డి - ఈ పరికరాలన్నింటికీ ప్రయోజనం చేకూరుతుంది.

అంతేకాదు. మనస్సుకు ముసురుకున్న ఆవేదనలు, ఆందోళనలు ఉపశమనం కావాలంటే నా బుద్ధిని వాటినుంచి మళ్ళించుకోవాలి. వాటిని పరిశీలిస్తూ రమణీయంగా చిత్రించడం ప్రారంభించాలి. అదొక్కటే మార్గం పైగా నేను వ్రాసేది వ్యర్థం కాబోదు ఒక మనిషి తన తుది ఘడియల్లో క్షణ క్షణం పొందిన ఆరాటం, ఆవేదన, ఒక చిన్న గ్రంథంగా వ్రాస్తే, లోకంలో అది ఒకగొప్ప ప్రయోజనాన్ని సాధించకుండా ఉంటుందా? మానవకోటికి ఒక పాఠంగా పనికిరాక పోతుందా? ఒక అపరాధి తన అంతిమఘడియల్లో రాల్చిన కన్నీటిబొట్లే ఈ గ్రంథంగా రూపొందాయని అంతా అవగతం చేసుకోక పోతారా?

అంతేకాదు. ఈ గ్రంథం చదవడం వల్ల అంత చులాగ్గా ఒక మనిషి తల తీసెయ్యడం మంచిదికాదని మరోమాటు అయినా గ్రహిస్తారు ధర్మదేవత పేరుతో ఒక నిండు ప్రాణాన్ని తీయడం క్షేమం అవునో కాదో ఆలోచిస్తారు. ఉరిశిక్షలు విధించడంవల్ల ఎన్ని ఆత్మలు క్షోభించి పోతున్నాయో, పచ్చని కుటుంబాలు ఎన్ని కూలిపోతున్నాయో ఆలోచిం చారా? తాము ఒక మనిషితల నరికితే, ఆ మనిషికి ఒక మనస్సు ఉన్నదనీ, ఒక సుందరమైన ఆత్మ ఉన్నదనీ, ఆ మనిషి బ్రతకాలని కోరుకుంటాడుగాని, బలాత్కారంగా చావుకు సిద్ధపడడనీ ఎన్నడైనా యోచించారా? లేదు! వాళ్ళు ఎన్నడూ ఈ విషయాలు ఆలోచించరు, అవగతం చేసుకోరు, అసలు ఈ దృష్టితో చూడనే చూడరు! ఒక నేరస్థుడు తాను చేసిన తప్పుకు ప్రాణాలు బలి ఇవ్వవలసిందే అతనికి ముందూ వెనుకా ఏమీ ఉండదు ఇదే వాళ్ళ నిర్వచన.

నేను వ్రాసే ఈ కొద్ది పంక్తులు వాళ్ళను ముందు ముందు అయినా ఆలోచించేటట్లు చెయ్యవచ్చు అవును. వాళ్ళు ఎన్నడూ – పుట్టి బుద్ధెరిగి ఆలోచించని విషయాలు, అనుకోని విషయాలు ఇక్కడ ఉన్నాయి మానవుడు దైహికంగా పడే బాధకంటె మానసికంగా పడే బాధ ఎప్పుడూ చెప్పనలవి కానిది. ఆత్మను చిత్రహింసచేస్తే అంతకన్నా దుర్భరమైన విషయం మరొకటి ఉండబోదు చట్టాలు,న్యాయసూత్రాలు, ఈ చిత్రహింసకు త్రోవ తీశాయి మానవులు పరస్పరం ద్వేషించు కోవడమే దీనికి మూలం! అవును. ఒక అదృష్టహీనుడు తన తుది క్షణాలలో నివేదించుకుంటున్న ఈ విషయాలను లోకంలో అందరూ మరీ మరీ మననం చేసుకునే రోజు రాకపోదు నేను వ్రాసిపెట్టిన ఈ కాగితపు పుటలు, నేను మరణించిన పిమ్మట ఏ సుడిగాలికో కొట్టుకపోతే తప్ప, ఏ వానజల్లుకో తడిసిపోతే తప్ప, ఏ బురదలోనో పడి పూడిపోతే తప్ప... లేకపోతే ఇవి అందరి హృదయాలనూ ఆస్పత్రిలా అల్లకల్లోలం చేస్తాయి!

అక్టోబరు 10 వ తేదీన విడుదల

అనుపమ చిత్రం

అత్తా ఒకింటి కోడలే!



నిర్మాత — దర్శకుడు

తిలక్

జగ్గయ్య, రమణమూర్తి, కుటుంబరావు, రమణారెడ్డి, గిరిజ,
ప్రమీల, సూర్యకాంతం, మొదలగువారు నటించిన
ఉత్తమ సాంఘిక, హాస్య చిత్రరాజము

హారా రిలీజ్

అల్లసాని వాని అల్లిక జిగిబిగి*

కవి సమ్రాట్, శ్రీ విశ్వనాథ సత్యనారాయణ

౨

మనుచరిత్రలోని ద్వితీయాశ్వాసములో నున్నవి కథా సందర్భమైనవి డెబ్బదియాఱు పద్యములు. వరూధిని ప్రవకుని చూచినది ఇరువది యెనిమిదవ పద్యములో అనఁగా నిది యేఁబది పద్యముల కథ ముప్పది యెనిమిది పద్యముల వఱకు వరూధిని ప్రవరుని చూచిపడిన యవస్థావర్ణనము వీరి యిరువురి సంభాషణ ముప్పదియాఱు పద్యములు అందులో ప్రవరుని నోటవచ్చిన మాటలు తొమ్మిది పద్యములలో నున్నవి. ఈ తొమ్మిది పద్యముల నుండి ప్రవరుని శీలము నిర్ణయించవలయును. ఇరువురి సంభాషణయు ముప్పదియాఱు పద్యములు మాత్రమే చెప్పిన ప్రవరుఁడు ఎంత బిగువు కలవాడు ఎంత తక్కువ మాటలు కలవాఁడు ఆ సన్నివేశమునం దెంత అనభిముఖుఁడు - విచారించ వలయును.

ప్రవరుని గూర్చి పది విధములుగా చెప్పుకోఁబడు చున్నది అతఁడు అలౌకికుడని, ఎట్లు మాటాడ వలయునో తెలియదని యనెడు వారున్నారు. ప్రవరుఁడు హిమాలయమునకుఁ బోవునప్పుఁ డెట్టి వేషముతో నుండెను. అతఁడెట్లుండెను? ఈ సంగతి మనకు తృతీయశ్వాసములోఁ గాని తెలియదు. మాయాప్రవరుని వేషమును కట్టినాడు. ఆ కట్టిన వేషమును పెద్దన్నగారు వర్ణించిరి.

అర్ధచంద్రునితేట నవఘళించు లలాట
  పట్టిఁ దీర్చిన గంగ మట్టితోడఁ,
జెక్కుటద్దములందు జిగివెల్లువలు చిందు
  రమణీయ మణి కుండలములతోడఁ,
బసిఁడిత్రాఁత చెఱంగు మిసిమిదోఁపఁ జెలంగు
  నరుణాంశుకోత్తరీయంబు తోడ
సరిలేని రాకట్టు జాళువా మొలకట్టు
  బెడఁగారు నీర్కావి పింజెతోడ.
  ధవళ ధవళమ్ములగు జన్నిదములతోడఁ
  గాశికా ముద్రయిడిన యుంగరముతోడ
  శాంత రసమొల్కు బ్రహ్మతేజంబుతోడఁ
  బ్రవరుఁడయ్యె వియచ్చర ప్రవరుఁడపుడు

ఈ వేసముతో ప్రవరుఁడు హిమాలయమునకు వచ్చెను వరూధిని చూచిన ప్రవరుఁ డీ వేసముతో నుండెను, అందు చేత ఆ వేసమునే గంధర్వుఁడు కట్టెను.

ఇట్టి వేసముతో ప్రవరుఁడు హిమాలయమునకు బయలుదేఱెనని పెద్దన్న మొదటనే వ్రాయవచ్చునుగదా! సామాన్యుఁడైన కవియట్లు చేయును శిల్పియైన కవి యిట్లు చేయును. అతని యీ రూపవర్ణనము చేయఁదగిన స్థలమిది. ఇచ్చట వర్ణించుటలో నొక ప్రయోజనమున్నది మొదట వ్రాసినచో నది నిష్ప్రయోజనము కథలో ప్రధానమైన పాత్ర కంటికి కట్టినట్లుండును కదా - అన్న యొక విషయమును చెప్పినచో ఆకంటికి కట్టినట్లు వ్రాయుట ఒక తక్కువ విషయము మనసునకు దీపించునట్లు వ్రాయుట ఎక్కువ విషయము.

ఈ పద్యములో రెండు సంగతులు జ్ఞాపక ముంచుకొనవలయును లలాట పట్టి దీర్చిన గంగమట్టితో ప్రవరుఁ డుండెను. అతఁ డానాడు గంగాస్నానము

చేసి బయలుదేఱెనను కొనవలయునా? గంగాస్నానము చేసినను, సిద్ధుఁడు రాచిన పాదలేపము చెడిపోలేదన్న మాట. కరగిపోలేదన్నమాట అట్లు గంగా స్నానము చేసినను కరగిపోని పాదలేపము 'నీహారవారి చెరసి కరగి' పోయెను కరగి పోవుట యెఱుఁగ డద్ధరణి సురుఁడు. దైవకృతమున కిలనసాధ్యంబు కలదె? అది కరగిపోయిన మాట యతనికి దెలియదు. అనఁగా కడచినరాత్రి స్నానము చేసినాఁడు ఆపాదలేపము కరగిపోలేదు. ఇప్పుడు కరగిపోయినది. అది కరగి పోవునని యతఁ డనుకొనలేదు ఇప్పుడెందుకు కరగిపోయినది? ఇది దైవకృతమని కవి చెప్పుచున్నాడు అసలా పాదలేపము కరగియేపోదా? లేదా, కొన్ని గంటలు మాత్రముండునా? ఇది యంతయు నొక విచిత్రమైన సమస్య. ఇది దైవకృతముగా కవి కల్పన. ఇచటి దైవకృత మెట్టిది? భవిష్యత్తులో స్వారోచిష మనువు జన్మించుటకు ఈ సన్నివేశము జరిగెను ఇది దైవకృతము. ఆ యౌషధమును గూర్చిన తక్కిన విచారణ యంతయు చాలస్వల్పమైనది వంద యూహాలలో నేదైనను కావచ్చును ప్రధానమైనది అట్లు జరుగుట ఈ జరుగుటను గుర్తించినవాఁడు పెద్దన్న. ఒకఁడు పరమ మహాకవియగుట యిటువంటి చోటులందు.

ఈ కథలో నున్న అన్ని చిక్కులు ఒక యెత్తు. ఈ 'దైవకృత'మన్న మాట వ్రాయుట యొక యెత్తు

దైవకృతమున కిలనసాధ్యంబు కలదె? అన్నమాట ఏదో కథాధోరణిలో చెప్పినమాట కాదు. విశిష్టమైన యర్థముతో చెప్పినమాట, అందుచేత పెద్దన్న వ్రాసిన మాటలలోని గాంభీర్యము విచారణచేసి తెలిసికొనవలయును.

ఈ పద్యములోని రెండవ విషయము అరుణాంశుకోత్తరీయము, ఎఱ్ఱని రంగు వేసిన ఉత్తరీయము. దీనికి బంగారపు తీగతో అక్షరపంక్తివలె వ్రాసిన అంచు కలదు. జరీ ఉత్తరీయము. ఎఱ్ఱని రంగు ఉత్తరీయము. ఒకటి యతఁడు ధనవంతుఁడు, భోగి అని చెప్పుచున్నది రెండవది ఆ యుత్తరీయ మెఱ్ఱరంగుకలదనుట చేత అది అద్దిన రంగా, నీర్కావి రంగా? నీర్కావి రంగైనచో నీర్కావి రంగని చెప్పవచ్చును అట్లని చెప్పక అరుణాంశుక మనుటచేత అద్దిన రంగనియే దృఢమగుచున్నది అద్దిన రంగనినచో తప్పేమి? అతఁ డగ్నిహోత్రి, బ్రాహ్మణుఁడు, సోమయాజి. అట్టివా రెఱ్ఱని గుడ్డలు కట్టుకొనఁగూడదు. తెల్లని యుడుపులే ధరించవలయును దీనిచేత ప్రవరుని మనస్సులో ఎచ్చటనో లీలగా భోగలక్షణ మున్నదని తెలియుచున్నది. ఈ భోగలక్షణమును-ఇది భోగలక్షణము కాదు, కాకపోయినను జీవలక్షణము- దీనిని పెద్దన్నగారొకటి రెండు స్థలములయందు చమత్కారముగా సూచించినారు.

"ఆనందో బ్రహ్మ" అని వరూధిని యుపనిషద్వాక్యమును చెప్పిన తర్వాత పద్యమిది.

అనుచుఁ దన్నొడఁ బఱచునయ్యమరకాంత
తత్తరము చూచి

తన్నొడఁ బఱచుచున్నదట అనఁగా ఆమె చెప్పిన మాటలలో ఎదో దూరముగా తన యంతరాత్మలో నొకానొక యాభిముఖ్యమును కలిగినదన్న మాట

యేనా? ఆ యాభిముఖ్య మెందుకు చెడి పోయినది. ఆమె తత్తరము పడినది ఆ తత్తరము అతనికి సిగ్గును వెగటును పొడమించినవి. అప్పుడామె మాటలకు ప్రత్యాఖ్యానము చేసినాడు

ఇది ప్రవరుని శీలమునకు భంజకమా? ఒకవ్యక్తి శీలమును నిర్ణయించుట యెట్లు? జీవుని యందలి సంస్కార మొకటి. అది మనస్సునకు స్ఫురించుట యొకటి ఈ స్ఫురించిన దానిని తనంతట తాను విచారణ చేత తొలఁగఁద్రోసికొనుటయో, బహిః పరిస్థితులను బట్టి దానియందు వైముఖ్యము కాంచుటయో - ఈ రెండువిధములుగా శీలరక్షణ కలదు, రెండవదానికంటె మొదటిది యుత్తమము. రెండవది క్రియా జగత్తు యొక్క దృష్టితో ప్రశంసనీయము భావమును భావముగానే త్రుంచవచ్చును. ఇది యట్టిది. క్రియాభిముఖ మైనపుడు కూడ దాని నదుపులో పెట్టవచ్చును. అది మనుష్య ప్రయత్నాధిక్యము వలన లోకమున కెక్కువ యాదరణీయ మగును ఈ యన్ని దశలయందు శీలరక్షణ జరిగినదనియే అర్థము.

మాయా గంధర్వుఁడు తత్ప్రవర దేహసమిద్ధ శిఖదీప్తిని శాంబరీమహిమ చేత సంగ్రహించుకొన్నాడు. ఆ శాంబరీ మహిమచేత సంగ్రహించుకొనుట యీ జీవసంస్కార గతాభిముఖ్యము చేతనేమో? ప్రవరునియొక్క ఆత్మ, జీవ సంస్కారము పరమానభిముఖములైనచో అతని శాంబరీమహిమకు ఇచ్చట నాకర్షణ కలుగదు. లోకమునందు కూడ ఆవతలివానిని ఇంద్రజాలికుఁడు వశపఱచుకొనును. అది అందఱను చేయలేఁడు ఒక మంత్రగాఁడు తన మంత్రమును మఱియొక మంత్రగానిమీఁద ప్రయోగించలేఁడు ఇది యంతయు వేఱే విషయము శాంబరీమహిమకు మాత్రము ఇట్టి యొకానొక యాభిముఖ్యము కావలయునేమో! ఈ సంగతిని ప్రపంచించి వ్రాసినచో సాహిత్యవిమర్శ వెనుక పట్టునని వదలుచున్నాను

ప్రవరుఁడు హిమవత్పర్వతమును చూచెను పోదమనుకొనెను కాలిపాద లేపము కరగిపోయెను కాలెత్తఁబోయెను కాలు రాలేదు. వెంటనే సిద్ధాపదేశమువలన తనకీ యాపద వచ్చెనను కొనెను దుఃఖపడుచు పోవుచుండెను ఆ పోవుచున్న వానికి కూడ అచ్చటి పార్వతికసౌందర్యము పొడకట్టక పోలేదు వజ్రాయుధముతో నఱికినట్లున్న కొండయిడుపు జేవురుపట్టులు, గంగ ప్రవహించుట, క్రముకాది వృక్షములు, ప్రతిధ్వనులు - వీనిని చూచెను చూచెననఁగా ఆ సౌందర్యమును గ్రహించెనని కావ్యమునందర్థము.

అది ముని యాశ్రమ మనుకొనెను. గంగ కాలువ లోయకు తలక్రిందుగా మలకలై దిగుచున్నది ఆలోనికి మెట్లవలె త్రోవయున్నది. ప్రక్కనున్న మల్లె తీగలను పట్టుకొని లోనికి దిగవలయును. అట్టిచోట ఋషి వాటికయుండు నను కొనెనా? అది నిస్సందేహముగా నొక కేళికా ప్రదేశమై యుండవలయును. మఱి యెందుకు పోయెను? ప్రవరుఁడు కాక మఱి యొక్కఁడైనచో వెనుదిరిగి పోయెడు వాఁడు. అతనిలో నున్న తీర్థ సందర్శనాభిలాష చెప్పరానంతది అది వట్టి తీర్థ సందర్శనాభి లాషయుఁగాదు.

అడవులు, కొండలు, నదులు గుహాలు-వీని నన్నిటిని జూడవలయు నన్న యభిలాషకూడఁగలదు. లేనిచో—

'తొండముల్ సాచి'... మొదలైన పద్యముల ప్రసక్తియుండదు

మఱియు నతఁడు "అగ్గిరి కటక తట నిరంతర తరు గహనగుహా విహార తత్పర మతి" యునై యుండెను.

ఇంటికి పోవుటకు వీలులేదని తెలిసెను కాని ఈ తరుగహనాది దర్శన తత్పరత్వ మతని జీవములోనుండి పోవునది కాదు అందుచేత నట్టి ప్రదేశమునకు దిగిపోయెను. అచటఁగనిపించిన భవనమెటువంటిది? అది గారుడోత్కీర్ణము, పందిరి, ద్రాక్ష తీగలు, పూఁదీవలు అచ్చట ఋషులుండి రనుకొనఁడు. వెనుదిరిగి పోలేదు. అచ్చటి సౌభాగ్యగరిమ కచ్చెరు వడినాడు ఇంతలో మగువపొలుపుదెలుపు మారుతము వచ్చినది మఱియును దగ్గరకు వెళ్లినాడు వరూధిని కనిపించినది ఇతనిని చూచుటతోడనే ఆమె స్థితి పది పద్యములలో వర్ణింపఁబడెను ఆమెస్థితియంతయు మన్మథ లక్షణముగా కన్పించునే కాని, మఱియొక రీతిగా కనిపించి యుండదుగదా! తొలఁగిపోడేమి?

దారి ఎవరినో యొకరినడిగి తెలిసికొనవలయునని కదా? మఱియు నా కొండ మీద నుండి అరుణాస్పదమునకు ఎంతదవ్వు? దారి యెట్లుండును? తాను నడువగలఁడా? ఎన్నాళ్లు నడచును? ఇంకొక గతిలేదు గనుక అట్లే అనుకొందము.

"ఎక్కడి యరుణాస్పదపుర మెక్కడి తుహినాద్రి"....

ఈ పరిశీలన యంతయు చేయలేనంతటి మూర్ఖుఁడందమా ప్రవరుఁడు? లేదా ఆ సమయమట్టి దందమా?

ఈ సంగతి నట్లుంచి ఆమె "అంఘ్రి కటకంబుల్ మ్రోయనడ్డంబు" నిల్చినది ఇతఁడామె చేఱఁజని విభ్రాంతుఁడై యన్నాడు ఈ విభ్రాంతిదేనికి? ఆమె సౌందర్యమును జూచియా? ఆమె తనదారి నడ్డగించి నిలుచుటకు తనకొక దారియున్నదా? కాదు ఎవరినో యొకరిని మార్గము కనుగొన వలయును. ఈమె కనిపించినది.

"నేను ప్రవరుఁడను త్రోవ తప్పి పోతిని ఈ కొండమీఁదికి వచ్చినాను మాయూరెట్లు పోదునా? దారిచెప్పుము" ఇవి మాటలు

"తమ యూరేది?" వెనుకటికి మావారికి ఉత్తరము వచ్చినదాఁగున్నదట. అట్లున్నది కాని ఈ యడవి దాటినచో జనపదము. దాటుట యెట్లా అని అడిగినాడు పద్యము మొదలు పెట్టుచునే—

"ఎవ్వతె వీవు భీతహరి
ణేక్షణ, యొంటిఁజరించె
దోటలే కివ్వనభూమిః"

ఆవిడ భీతహరిణేక్షణయైన నితని కేమి? కాకపోయిన నితనికేమి? భయము లేక ఒఁటరిగా తిరుగుచున్నావనెను ఈ మూఁడు మాటలు నిస్సందేహముగా వరూధినికి ఆశ కల్గించును. మఱి ఇతఁడిట్లనవచ్చునా? ఇక్కడ నున్నది రహస్యము ఆమె సహజముగా భీతహరిణేక్షణ ఇతఁడామె స్థితిని వర్ణించినాడు భయములేక ఆ యడవిలో తిరుగుట సాధ్యమైన పనికాదు, తన స్థితి నామె మీఁద నారోపించినాడు.

కాని గారుడోత్కీర్ణమైన భవనమును చూచినాడు. ఆ ప్రక్కన నీమెయున్నది. ఈమెను "ఒంటిఁజరించె దోటలేక" అనరాదు

ఇవి యన్నియు ప్రవరుఁ డూహించినాడో, లేదో! ఈమాట లతని నోటివెంట వచ్చినవి అతని హృదయాంతరాంతరములోని సౌందర్యాభిజ్ఞానము, సౌందర్యమును మెచ్చుకొనుట, జీవలక్షణమై భోగాభి ముఖత్వము ఇట్లు వచ్చినవి.

మఱియు నింకొక కారణమున్నది. ఆమె ఇట్లడిగిన ప్రవరుని స్వాభిలాషానుకూలునిగా భావించి మరికొన్ని మాటలన్నది అప్పు డతఁడిట్లనెను,

"అండజయాన నీ వొసఁగునట్టి
సపర్యలు మాకు వచ్చె నిం
దుండఁగ రాదు పోవలయు నారికి
నింటికి నిప్పుడేను రా
కుండ నొకండు వచ్చి మఱి
యొండునె భక్తియ చాలు సత్క్రియా
కాండముఁ దీర్ప వేగ చనఁగా
వలయుం గరుణింపు నాపయిన్"

మరల 'నండజయాన' యని సంబోధన ఇదికూడ ఆమె కాశాజనకమైనది. ఇందాకటి భీతహరిణేక్షణ వంటిదే.

ఇచ్చుట నున్నాడు పెద్దన్నగారి వైష్ణవ బ్రాహ్మణ యువకుఁడు. శిష్యులు శిష్యురాండ్రు - వారితో మాటాడెడి మాటలు-ఇది ప్రవరుని వాగ్రూపమైన సృష్టి. ఈ సపర్యలు మాకు వచ్చినవి నేను వచ్చిన నొకటియు, రాకపోయిన నొకటియా? నీ భక్తియే చాలును నాకు సత్క్రియా కాండము కలదు. ఈ మాటలు ఎవరనునవి? నిర్మముఁడై లోకమునందలి భోగములు తెలిసి, సౌందర్యముయొక్క యభిజ్ఞ కలిగి, సౌందర్యమును సౌందర్యముగా భావించి చూచి మాటాడఁగలిగిన యొక గొప్ప లౌకికుఁడైన పురుషుని లక్షణమిది. సౌందర్యమును సౌందర్యముగాచూచును. చూచిన సౌందర్యమును నోటితోచెప్పును. అతని సౌందర్యోపాసన అంతవఱకే ఇది ఇతరులకు దురభిప్రాయములను కలిగించును

ప్రవరుని శీలమిది.

మఱియు నామె దేవతాస్త్రీ యని తెలిసెను. 'మీమహత్త్వములు దివ్యములు. మీకసాధ్యములు లేవు.' మొదలైన ప్రసక్తి చేసినాడు. ఆమె తన మనస్సును చెప్పివేసినది. అతఁడు 'వ్రతులై దినములు గడపెడి విప్రులఁజనునే కామింప మదివిచారమువలదే!' "నేఁడు నే నిలు సేరకుండినచో సమస్త ధర్మములు తూలు" ననినాడు వెంటనే ఆమె మొగమున విన్నబాటు కనిపించినది. ఆమెకీ సంగతులు తెలిసినవియే. అతనిని వశపరచు కొనుటకు మఱియొక మార్గము త్రొక్కినది. తనతోడి భోగము సశరీర స్వర్గమన్నది

ప్రవరుఁడు "నీవన్నయర్థమెల్ల కాముకుఁడైన వాని నిజము" అనినాడు. తా నకాముడు గనుక దీనిని గణించనన్నాడు ప్రవరుని రహస్యమిచ్చుట నున్నది. అతఁడుభోగవిముఖుఁడు గాడు; అధర్మ విముఖుఁడు సౌందర్యము నెఱుంగనివాడుకాడు, అదియున్నదని యథర్మము చేయఁడు. రసహీనుఁడు కాఁడు, అగ్నిహోత్రి, అతని లక్ష్యము

" బ్రాహ్మణుఁ డింద్రియవశగతి " చెడిపోవునని. తానింద్రియ వశుఁడు

కాదు వచ్చెడు నూహాలు వేఱు. వాని నింద్రియ దశకు తెచ్చుట వేఱు ఊహ లువచ్చును. అవి వట్టియూహాలు. ఆయూ హాలు ఊహాలుగా నుండుట యొక స్థితి క్రియాభిముఖములై యుండుట మఱియొక స్థితి రెండవది దోషము, మొదటిది వివేకము

ఇప్పటికి వరూధిని యొక్క సర్వా శలు తునిగి పోయినవి అతఁడు బ్రహ్మా నందాధి రాజ్యపదవిని గూర్చి మాటా డుచున్నాడు. అత డగ్ని హోత్రియ గుట క్రతువులు చేయుట, స్వర్గభోగ ములయందలి వాంఛచేతఁగాదు నిష్కా మముగా చేయుచున్నాడని తేలినది. అతఁడు వాంఛించునది బ్రహ్మపదము.

అపుడు వరూధిని ఉపనిషద్వాక్యము నకు దుర్వ్యాఖ్యానము చేసినది. కాని ఆనిముసములో ఒడఁబఱచు చున్నదా యన్నట్లున్నది. ఆమెచేసిన తెలివితక్కువ తత్తరపడుట. ఆతత్తరములో ఇంద్రియ వశత్వము గోచరించినది. ఇతనికి జాగ్ర త్తవచ్చినది

'ఇవియా మీ సంప్రదాయార్థముల్ ?" అన్నాడు.

ఈ ఒక్కమాటతో పెద్దన్నగారు భారతీయ మతముయొక్క ఆయువు పట్టును పట్టుకొన్నాడు సంప్రదాయా ర్థము వేఱు వివేకముచేత కల్పించు నర్థమువేఱు. లోకములోని అన్ని వాక్య ములకు పెడయర్థములు చెప్పవచ్చును. సందర్భశుద్ధిగల యర్థ మొక్కటియె యుండును అట్లే వేదోపనిషదాదివాక్య ములకు భిన్నార్థములు చెప్పవచ్చును. నేడు జరుగుచునే యున్నది గదా! సంప్ర దాయార్థమొక్కటియే యీ మహావిష యమును పెద్దన్నగారు రూఢిపఱిచిరి

తరువాత నామె యాతనిని కౌగి లింపఁబోయినది వ్యాస విశ్వామిత్ర మాండకర్ణి మొదలైన ఋషుల కథలు చెప్పినది అతఁడు ఏమియు ననక తన శరీరము కడిగికొని, గార్హపత్యాగ్నిని పొగడి, వెడలిపోయెను. అతఁడెంత గడుసువాఁడో, పరిస్థితి నెంత చక్కగా నర్థము చేసికొనఁగలవాఁడో, ఎప్పుడు మాటాడునో, ఎప్పుడు మాట్లాడడో, ఎంత కొద్దిగా మాటాడునో, మాటాడు టలో ఆయన యూరి పరిస్థితి, ఆయన పరిస్థితియు కనుపించుట యొక్కటియే యున్నది.

ఇది యంతయు మానవ ధర్మశాస్త్ర మునకు పునాది.

★

శ్రీ భరతముని ప్రణీత
నాట్యశాస్త్రమ్
★
ఆంధ్రభారతి
డాక్టర్ శ్రీ పోతుకూచి సుబ్రహ్మణ్యశాస్త్రి
ఎం. ఏ., ఎం. లిట్., పిహెచ్. డి

★

తృతీయాధ్యాయము
రంగదైవతపూజ

★

సర్వలక్షణ సంపన్నే కృతే నాట్యగృహే శుభే
గావో వసేయుః సప్తాహం సహజప్యపరైర్ద్విజైః ౧

తతో ఽధివాసయే ద్వేశ్మ రఙ్గపీఠం తథైవచ
మంత్రపూతేన తోయేన ప్రోక్షితాంగో నిశాగమే ౨

యథా స్థానాంతరగతో దీక్షితః ప్రయతః శుచిః
త్రిరాత్రో పోషితో భూత్వా నాయకో ఽహతవస్త్రధృక్ ౩

నాట్యమండప నిర్మాణమైన తర్వాత రంగదైవత పూజనము చేయవలెను. అందుకై సమస్త లక్షణములతో కూడిన శుభనుగు నాట్యగృహమున జపములను చేయుచున్న ద్విజులతోబాటు ఆవులుకూడ ఏడు దినములు నివసించవలెను. అప్పుడు మంత్రముచే పవిత్రమైన ఉదకములను శరీరముపై ప్రోక్షించుకొని రంగపీఠమును నాట్యాచారుడు ప్రవేశించవలెను తన నివాస గృహమునుండి వచ్చి, శుచియై, నియమబద్ధుడై, మూడు రాత్రు లుపవసించినవాడై, నిర్మలమైన వస్త్రములను ధరించి, దీక్షితుడైన నాట్యాచారుడు నాట్యమండపమును ప్రవేశించి దేవతా నమస్కారము చేయ నారంభింపవలెను

నమస్కృత్య మహాదేవం సర్వలోకోద్భవం భవమ్
జగత్పితామహంచైవ విష్ణు మింద్రం గుహం తథా, ౪

సరస్వతీంచ లక్ష్మీంచ సిద్ధిం మేధాం ధృతిం మతిమ్
సోమం సూర్యంచ మరుతో లోకపాలాం స్తథాశ్వినౌ. ౫

మిత్రమగ్నిం సురాన్ వర్ణాన్ రుద్రాన్ కాలం కలింతథా
మృత్యుంచ నియతించైవ కాలదండం తథైవచ, ౬

విష్ణుప్రహరణంచైవ నాగరాజంచ వాసుకిమ్
వజ్రం విద్యు త్సముద్రాంశ్చ గంధర్వాప్సరసో మునీన్, ౭

తథా నాట్యకుమారీశ్చ మహాగ్రామణ్యమేవచ
యక్షాంశ్చ గుహ్యకాంశ్చైవ భూతసంఘాం స్తథైవచ, ౮

ఏతా నన్యాంశ్చవై సర్వాన్ ప్రణిపత్య కృతాంజలిః
యథా స్థానాంతరగతాన్ సమావాహ్య తతో వదేత్ ౯

సకల లోకములను సృష్టించిన శివుని, లోకపితామహుడగు బ్రహ్మను, విష్ణువును, ఇంద్రుని, గుహుని, సరస్వతిని, లక్ష్మిని, సిద్ధిని, మేధను, ధృతిని, మతిని, సోమును, సూర్యుని, మరుత్తులను, లోకపాలురను, అశ్వినులను, మిత్రుని, అగ్నిని, దేవతలను, బ్రాహ్మణాది వర్ణముల అధిష్ఠాన దేవతలను, రుద్రులను, కాలమును, కలిని, మృత్యువును, నియతిని, కాలదండమును, విష్ణువాహనమును, నాగరాజగు వాసుకిని, వజ్రమును, విద్యుత్తును, సముద్రములను, గంధర్వులను, అప్సరసలను, మునులను, నాట్యమాతృకలను, విఘ్నేశ్వరుని, యక్షులను, గుహ్యకులను, భూత సంఘములను, తదితరులగు రాక్షసపిశాచ మహోరగములను కృతాంజలియై నమస్కరించి, వారిని ఆవాహన జేసి ఈక్రిందివిధముగా పలుకవలెను.

'భవద్భి ర్నో నిశాయాంతు నః కర్తవ్యః సంపరిగ్రహః
సాహాయ్యం చైవ దాతవ్య మస్మి న్నాట్యే సహానుగైః ౧౦

"ఈ రాత్రివేళ ఆవాహనాది పూజాకృత్యమును స్వీకరించి, మీఅనుచరులతో నాట్యగృహమున నాకు మీరు సహాయ పడవలెను"

సంపూజ్య సర్వానేకత్ర కుతపం సంప్రయుజ్యచ
జర్జరాయ ప్రయుఞ్జీత పూజాం నాట్యప్రసిద్ధయే ౧౧
'త్వం మహేంద్ర ప్రహరణ సర్వదానవ సూదన
నిర్మిత స్త్వం సర్వదేవైః సర్వవిఘ్న నిబర్హణ. ౧౨
నృపస్య విజయం శంస రిపూణాంచ పరాజయమ్
గోబ్రాహ్మణ శివం చైవ నాట్యస్యచ వివర్ధనమ్'. ౧౩
ఏవం కృత్వా యథాన్యాయ ముపాస్యం నాట్యమండపే
నిశాయాంతు ప్రభాతాయాం పూజనం ప్రక్రమేదిహ. ౧౪
ఆర్ద్రాయాంవా మఘాయాంవా యామ్యే పూర్వేషుచ త్రిషు
ఆశ్లేషా మూలయో ర్వాపి కర్తవ్యం రఙ్గపూజనమ్. ౧౫

దేవతల నందరను ఒకచో పూజించి, మంగళ వాద్యముల నొకభాండముతో దెచ్చి, నాట్యము ప్రసిద్ధి నొందుటకు జర్జరపూజ నారభించవలెను. జర్జర మనబడు ఇంద్రధ్వజము నాట్య గృహమున కున్న తూర్పు ద్వారమువద్ద ఉండును. "మహేంద్రుని ఆయుధము, సకల రాక్షసులను చంపునదియు నగు జర్జరమా! సమస్త విఘ్నములను పారద్రోలుటకు నీవు దేవతలందరచేత నిర్మింపబడినావు రాజునకు విజయమును, శత్రువుల ఓటమినీ, గోబ్రాహ్మణుల శుభమును, నాట్యాభివృద్ధిని ఆ శంసన

చేయుము" అని ధ్వజమును ప్రార్థించి విధియుక్తముగా నాట్యమండపమున పూజ చేయవలెను రాత్రివేళ ఈప్రక్రియను సాగించి, ప్రాతఃకాలమురాగానె ఆర్ద్ర, మఘ, భరణి, పూర్వఫల్గుని, పూర్వాషాఢ, పూర్వాభాద్ర, ఆశ్లేష, మూల నక్షత్రములలో నొకనక్షత్రమున చంద్రుడుండగా రంగపూజను చేయవలెను

ఆచార్యేణతు యుక్తేన శుచినా దీక్షితేనచ
రఙ్గ స్యోద్యోతనం కార్యం దేవతానాంచ పూజనమ్ ౧౬
దినాంతే దారుణే ఘోరే ముహూర్తే భూతదైవతే
ఆచమ్యతు యథాన్యాయం దేవాతా వై నివేశయేత్ ౧౭
రక్తాః ప్రతిసరాః సూత్రం రక్తగంధాశ్చ పూజితాః
రక్తాః సుమనసశ్చైవ యచ్చ రక్తం ఫలం భవేత్ ౧౮
యవై స్సిద్ధార్థకై ర్లాజై రక్షతైః శాలితండులైః
నాగపుష్పస్య మూలేన వితుషాభిః ప్రియఙ్గుభిః ౧౯
ఏతై ర్ద్రవ్యై ర్యుతం కుర్యా ద్దేవతానాం నివేశనమ్

శుచి, దీక్షితుడు నగు నాట్యాచారుడు రంగమండపము నధిరోహించి దేవతా పూజ కుపక్రమించుచు దారుణము, ఘోరమునగు రౌద్రముహూర్తమున యథా శాస్త్ర మాచమన మాచరించి దేవతల నాహ్వానించ వలెను. ఎర్రని దారములతో చేయబడిన కంకణములతోను, ఎర్రని గంధములతోను, ఎర్రని పూవులతోను దేవతలను పూజించిన అనురక్తమగు ఫలము కలుగగలదు నాగదంతముయొక్క క్రింద భాగమున యవలు, పేలాలు, బియ్యపు అక్షతలు, పై బెరడు తీసివేయబడ్డ ప్రియంగు కాయలు అను ద్రవ్యములతో దేవతలను ఆవాహనచేసి అధివసింపజేయ వలెను.

ఆలిఖేన్మండలం పూర్వం యథాస్థానం యథావిధి ౨౦
సమంతతశ్చ కర్తవ్యం హస్తాః షోడశ మండలమ్
ద్వారాణి చాత్ర కుర్వీత విధానేన చతుర్దిశమ్ ౨౧
మధ్యే చైవాత్ర కర్తవ్యే ద్వే రేఖే తిర్యనూర్ధ్వశే
తయోః కక్ష్యావిభాగేన దైవతాని నివేశయేత్ ౨౨

మొట్టమొదటనే పన్నెండు గజముల వ్యాసముగల వర్తులమగు మండలమును విధిపూర్వకముగా నేర్పరచి, అందు నలుదిక్కుల నాలుగు ద్వారముల నమర్చి, ఈ మండలములో అడ్డముగాను నిలువుగాను రెండు రేఖలను గీయవలెను. ఇట్టి మండల భాగములలో ఆయా దేవతలను వినివేశింప చేయవలెను.

పద్మోపవిష్టం బ్రహ్మాణం తస్య మధ్యే నివేశయేత్
ఆదౌ నివేశ్యో భగవాన్ సార్ధం భూతగణై ర్భవః ౨౩
నారాయణో మహేంద్రశ్చ స్కందః సూర్యోఽశ్వినౌ శశీ
సరస్వతీచ లక్ష్మీశ్చ శ్రద్ధా మేధా చ పూర్వతః. ౨౪

ఈమండల మధ్యభాగమున తొమ్మిది దళాలుగల పద్మమున బ్రహ్మను ప్రతిష్ఠించి ఈశాన్యమునుంచి వరుసగా భూతగణములతో నున్న శివుని, నారాయణుని, ఇంద్రుని, స్కందుని, సూర్యుని, అశ్వినులను చంద్రుని సరస్వతిని లక్ష్మిని, శ్రద్ధను, మేధాదేవతను ప్రతిష్ఠించవలెను.

పూర్వదక్షిణతో వహ్ని ర్నివేశ్యః స్వాహయాసహ,
విశ్వేదేవాః సగంధర్వా రుద్రాః సర్వగణా స్తథా ౨౫

దక్షిణేన నివేశ్యస్తు యమో మిత్రశ్చ సానుగః
పితౄన్ పిశాచా నురగాన్ సహ్యాకాంశ్చైవ నివేశయేత్. ౨౬

ఆగ్నేయ దిక్కున స్వాహాతో గూడిన అగ్నిని ప్రతిష్ఠించి, దక్షిణదిశన క్రమముగా విశ్వేదేవతలు, గంధర్వులు, రుద్రులు మొదలుగాగల సకలగణములు, యముడు, అనుచరునితోనున్న మిత్రుడు, పితృదేవతలు పిశాచములు, నాగములు గుహ్యకులు అను వారిని స్థాపించవలెను.

నైరృత్యాం రాక్షసాంశ్చైవ భూతానిచ నివేశయేత్.
పశ్చిమాయాం సముద్రాంశ్చ వరుణం యాదసాం పతిమ్. ౨౭

వాయవ్యాం వై దిశితథా సప్తవాయూ న్నివేశయేత్
తత్రైవ వినివేశ్యస్తు గరుడః పక్షిభిఃసహ, ౨౮

ఉత్తరస్యాంం దిశి తథా ధనదం సంనివేశయేత్
నాధ్యస్య మాతౄశ్చతథా యక్షా నథగుహ్యకాన్ ౨౯

తథై వోత్తర పూర్వాయాం నంద్యాద్యాంశ్చ గణేశ్వరాన్
బ్రహ్మర్షి భూతసంఘాంశ్చ యథాభాగం నివేశయేత్ ౩౦

నైఋతి మూలన రాక్షసులను, భూతములను స్థాపన చేయవలెను. పడమర దిక్కున సముద్రములను, ఉదకములకధిపతియగు వరుణుని ప్రతిష్ఠించవలెను వాయవ్యమున సప్తవాయువులను, పక్షులతో గరుడుని ఉంచవలెను. ఉత్తరమున కుబేరుని, సప్త నాట్య మాతృకలను, యక్షులను, గుహ్యకులను ఆవాహన చేయవలెను. ఈశాన్యమున నంది మొదలుగాగల ప్రమథ గణములను, బ్రహ్మర్షులను, భూత సంఘములను ప్రతిష్ఠించవలెను.

స్తంభే సనత్కుమారంతు దక్షిణే దక్షమేవచ
గ్రామణ్య ముత్తరే స్తంభే పశ్చిమే స్కందమేవచ ౩౧

అనేనైవ విధానేన యథాస్థానం యథావిధి
సుప్రసాదాని సర్వాణి దైవతాని నివేశయేత్ ౩౨

స్థానేస్థానే యథాన్యాయం వినివేశ్యతు దేవతాః
తాసాం ప్రకుర్వీత తతః పూజనంతు యథార్హతః ౩౩

తూర్పున గల స్తంభమందు సనత్కుమారుని, దక్షిణ స్తంభమున దక్షుని, ఉత్తర స్తంభమున విఘ్నేశ్వరుని, పశ్చిమ స్తంభమున స్కందుని ప్రతిష్ఠించవలెను.

ఇదే క్రమముననుసరించి, తత్తదుచిత స్థానములలోనుండి, అనుగ్రహముకలిగి యున్న దేవతలను ప్రతిష్ఠించి, విధిపూర్వకముగా యథార్హమగు పూజాక్రమము నారంభించవలెను

దేవతాభ్యస్తు దాతవ్యం సితమాల్యాను లేపనమ్
వహ్ని గంధర్వ సూర్యేభ్యో రక్తమాల్యాను లేపనమ్ ౩౪
గంధ మాల్యాంశ్చ ధూపంచ యథావ దనుపూర్వశః
దత్త్వా తతః ప్రకుర్వీత బలిం పూజాం యథావిధి ౩౫

దేవతలకు తెల్లని పూలదండను గంధమును ఇవ్వవలెను. వహ్ని, గంధర్వ, సూర్యులకు ఎఱ్ఱని పూలదండను, గంధమును అర్పించవలెను. ముందు గంధము, తర్వాత పూలదండ, ఆపై ధూపము అనుక్రమము ననుసరించి ఇవియైన తర్వాత యథావిధిగా బలులను, పూజను చేయవలెను.

బ్రహ్మాణం మధుపర్కేణ పాయసేన సరస్వతీమ్
శివ విష్ణు మహేంద్రాద్యాః సంపూజ్యా మోదకైరథ ౩౬
ఘృతౌదనేన హుతభుక్ సోమార్కౌతు గుడౌదనైః
విశ్వేదేవాః సగంధర్వా మునయో మధుపాయసైః ౩౭
యమ మిత్రౌచ సంపూజ్యౌ వపూపై ర్మోదకై స్తథా
పితౄన్ పిశాచా నురగాన్ సర్పిః క్షీరేణ తర్పయేత్ ౩౮
పక్వాన్నేనతు మాంసేన సురా సీధు ఫలాసవైః
అర్చయే ద్భూతసంఘాశ్చ చణకైః పలలాప్లుతైః ౩౯
అనేనైవ విధానేన సంపూజ్యా మత్తవారణీ
పక్వాన్నేనతు మాత్స్యేన సంపూజ్యా రక్షసాంగణాః ౪౦

మధుపర్కముతో బ్రహ్మను, పాయసముచే సరస్వతిని, మోదకములతో శివవిష్ణు మహేంద్రాది దేవతలను, అగ్నిని నేయి కలపిన అన్నముతోను, రవిచంద్రులను బెల్లము కలిపిన అన్నముతోను, మధుపాయసములతో మునులను, గంధర్వులను, విశ్వేదేవతలను, గారెలతోను మోదకములతోను మిత్రుని, యముని, నేతితోను పాలతోను పితృదేవతలను, పిశాచోరగములను, బాగుగా ఉడికిన అన్నములో మాంసము కలిపి కల్లుతో, పండ్లరసముతో, శనగలతో భూతసంఘములను, అర్చించవలెను. ఇదేవిధముగా మదపుటేనుగును కూడ పూజించవలెను బాగుగా ఉడికిన అన్నములో చేపలను కలిపి రాక్షస గణములకు పూజ చేయవలెను.

సురా మాంస ప్రదానేన దానవాన్ ప్రతి పూజయేత్
శేషాన్ దేవగణాం స్తజ్ఞః సాపూపోత్కారికౌదనైః ౪౧
మత్స్యైశ్చ పిష్టభక్ష్యైశ్చ సాగరాన్ సరితస్తథా
సంపూజ్య వరుణంచాపి దాతవ్యో ఘృతపాయసః ౪౨

నానామూల ఫలైశ్చాపి మునీన్ సంప్రతి పూజయేత్
వాయూంశ్చ పక్షిణశ్చైవ విచిత్రై ర్భక్ష్య భోజనైః ౪౩
మాతౄ ర్నాట్యస్య సర్వాస్తా ధనదంచ సహానుగైః
అపూపై ర్లిపికామిశ్రై ర్భక్ష్య భోజ్యైః ప్రయత్నతః. ౪౪
ఏవ మేషాం బలిః కార్యో నానాభోజన సంశ్రయః
పున ర్మంత్ర విధానేన బలికర్మచ వక్ష్యతే, ౪౫

కల్లుతోను, మాంసముతోను దానవులను, శేషించిన దేవగణములను గారెల తోను, భోజనములతోను, నదీసముద్రములను చేపలతోను, పిండివంటలతోను, వరుణుని నేతితో కలసినపాయసముతోను, నానా మూలఫలాదులతో మునులను, విచిత్రము లగు భక్ష్యభోజనములతో వాయువులను, పక్షులను అనుచరులతో కూడిన కుబే రుని, నాట్యమాతృకలను గారెలతోను, భక్ష్యభోజ్యములతోను; పూజించి ఈరీతిగా భోజనముతో కలసిన బలులను చేయవలెను ఇక మంత్రపూర్వకమగు బలుల నెట్లు చేయవలెనో చెప్పదలచి దేవతాస్తుతి శ్లోకములను చెప్పుచున్నాడు.

"దేవదేవ మహాదేవ సర్వలోక పితామహ
మంత్రపూత మిదం సర్వం ప్రతిగృహ్ణీష్వ మే బలిమ్, ౪౬
పురందరామరపతే వజ్రపాణే శతక్రతో
ప్రగృహ్యతాం బలిర్దేవ విధిమంత్ర పురస్కృతః ౪౭
దేవసేనాపతే స్కంద భగవన్ శంకరప్రియ
బలిః ప్రీతేన మనసా షణ్ముఖ ప్రతి గృహ్యతామ్ ౪౮
నారాయణా మితగతే పద్మనాభ సురోత్తమ
ప్రగృహ్యతాం బలిర్దేవ మంత్రపూతో మయార్పితః ౪౯
దేవదేవ మహాదేవ గణేశ త్రిపురాంతక
ప్రగృహ్యతాం బలిర్దేవ మంత్రపూతో మయోద్యతః ౫౦
దేవదేవ మహాయోగిన్ దేవదేవ సురోత్తమ
సంప్రగృహ్య బలిం దేవ రక్ష విఘ్నా త్సదోత్థితాత్ ౫౧
దేవదేవి మహాభాగే సరస్వతి హరిప్రియే
ప్రగృహ్యతాం బలి ర్మాత ర్మయా భక్త్యా సమర్పితః ౫౨
నానా నిమిత్త సంభూతాః పౌలస్త్యాః సర్వఏవ తే
రాక్షసేంద్రా మహాసత్త్వాః ప్రతిగృహ్ణీత మే బలిమ్ ౫౩
లక్ష్మీః సిద్ధి ర్మతి ర్మేధా సర్వలోక నమస్కృతాః
మంత్రపూత మిమం దేవ్యః ప్రతిగృహ్ణంతు మే బలిమ్ ౫౪

"దేవతలకు దేవుడవు, మహాదేవుడవు, సకల జగత్తుకు పితామహుడవగు బ్రహ్మా! ఈ బలి మంత్రముచే పవిత్రము చేయబడినది. దీనిని స్వీకరించుము.

"పురందర, అమరపతి, వజ్రపాణి, శతక్రతుడవునగు ఇంద్రుడా! విధిపూర్వకముగా మంత్రములచే పరిష్కరింపబడిన ఈ బలిని గ్రహించుము.

"శంకరునకు ప్రియుడవు దేవసేనాపతి, భగవానుడవు, షణ్ముఖుడవు నగు కుమారస్వామీ! ప్రీతిపూర్వకమగు మనస్సుతో నీ బలిని గైకొనుము

"త్రివిక్రముడవు, పద్మనాభుడవు, దేవతలలో శ్రేష్ఠుడవునగు విష్ణుదేవా! మంత్రపూతమై నాచే ఇవ్వబడు బలిని గ్రహించుము

దేవదేవుడవు, మహాదేవుడవు, త్రిపురాంతకుడవు ప్రమథగణనాయకుడవు నగు నో శివా! మంత్రపూతమై నాచే అర్పింపబడు బలిని స్వీకరింపుము.

"దేవదేవ! మహా యోగి! సురోత్తమ! బలిని స్వీకరించి, విఘ్నములనుండి నాట్యగృహమును రక్షింపుము.

"దవదేవి, హరిప్రియ, సౌభాగ్యవతి, మాతృదేవియునగు ఓ సరస్వతీ! నాచే భక్తితో సమర్పింపబడిన బలిని గైకొనుము.

"వివిధ కారణములచే పులస్త్యబ్రహ్మ వంశమున జన్మించి అమితబలము గలిగిన సమస్త రాక్షసులారా! నా బలులను గ్రహింపుడు.

"సమస్త జగత్తుచేత నమస్కరింపబడు లక్ష్మి, సిద్ధి, మతి, మేధా యను దేవతలారా! మంత్రపూతమైన ఈ బలిని స్వీకరింపుడు"

✱

భారతీయ శస్త్ర చికిత్స

శ్రీ గూడూరి నమశ్శివాయ

పరబ్రహ్మ ఆయుర్వేద వైద్యశాస్త్రాన్ని అధర్వణ వేదానికి ఉపాంగముగ సృష్టించాడు. మానవులకు సంభవించు శారీరక ఆగంతుక వ్యాధుల బారినుండి కాపాడుతూ మన ప్రాచీనులు క్రమముగా దీనిని అభివృద్ధి పరచారు మహర్షులు దీనిని ఎనిమిది విధములగు చికిత్సలుగ విభాగించారు అందు శస్త్రచికిత్స ప్రధానాంగముగ పరిగణింపబడింది.

మన ప్రాచీనులు యితర వ్యాపృత్తులకన్న శరీర రక్షణమనే లక్షించెడివారు అందువల్ల రోగములు విచ్చలవిడిగా వృద్ధి చెందలేదు ఎక్కడో ఒకరు రోగములకు గురి అయ్యేది వారు, అందువలన కాయ చికిత్సతో అవసరం లేకుండా పోయింది. దేవాసుర యుద్ధమున అభిఘాత వ్రణములను చికిత్సించుట చేతను ఆనాటికి జ్వరమూ మొదలగు రోగము లుత్పన్నము కాకపోవుట చేతను శస్త్రచికిత్సయే మొట్టమొదటిది అయినదని భగవత్ స్వరూపులైన దివోదాస ధన్వంతరులు చెప్పారు యుద్ధములు మిక్కిలిగా పెచ్చుపెరుగుటవల్ల ఆయుర్వేదములో శస్త్రచికిత్స ముఖ్యమైనదిగా పరిగణింప బడినది భారతీయ శస్త్ర చికిత్సను గురించి మన వేదములలో చిత్రవిచిత్రములైన గాధలు అనేకం వున్నాయి అధర్వణవేదమునకు అధిపతులైన అశ్వినీదేవతలు చేసిన శస్త్ర చికిత్సను పురస్కరించుకొని చాలా గాధలున్నాయి. అశ్వనీదేవతలు యజ్ఞపురుషునకు తెగిన శిరస్సును తిరిగి అతికించినట్లు ఋగ్వేదము చెపుతోంది. ఖేలరాజు భార్యా సమేతుడై యుద్ధమునకు వెళ్ళగా విస్పలయొక్క కాలి పిక్కన్ను శత్రువులు ఛేదించారు అశ్వనీ దేవతలు ఆమెకు కుంటితనము లేకుండా ఇనప కాలు ఏర్పాటు చేసినట్లు ఒకగాధ కలదు. అత్రి మహర్షికి అంగ విచ్ఛేదము కలిగినపుడు తిరిగి అంగములు చేకూర్చినట్లు, శావాస్యుడు అనే రాజునకు అంగములు మూడుగా ఖండించి నష్టు వాటిని సంధాన పరచి పునర్జీవితుని చేసినట్లు కూడ కలదు. మధువిద్యా పండితుడగు దధీచుడు మధువిద్యా రహస్యమును అశ్వనీ దేవతలకు చెప్పక గుప్తముగా నుంచెనట. అపుడు దధీచుని శిరస్సు ఖండించి ఒక గుర్రపు తల తెచ్చి వానికంటించి వాని తల దాచిపెట్టిరట అంతట దధీచుడు ప్రాధేయపడి మధు విద్యను అశ్వినులకు బోధించినట్లు అప్పుడు దధీచుని తల దధీచునకు, గుర్రపు తల గుర్రమునకు అంటించినట్లు కూడా ఒక కధ అధర్వణ వేదమున కలదు. ఇలా అశ్వినుల శస్త్రచికిత్సను గురించి అనేకగాధ లున్నాయి. వైదిక యుగంలో శస్త్ర చికిత్స అధిక వ్యాపకములో నున్నట్లు యీ గాధలవల్ల తెలుస్తోంది.

ఇట్లే పురాణాలలో కూడా యీ శస్త్ర చికిత్సా విశేషాలను ఉగ్గడించే గాధలున్నాయి. భోజరాజుకు తలపోటు వచ్చింది. ఏవైద్యుడూ కుదర్చలేకపోయాడు. ఆ తలబాధకు భోజరాజు విసిగి వైద్యులను, వైద్యశాస్త్రాన్ని బహిష్కరించాడు ఈవిషయమును విన్న అశ్వినీదేవతలు భోజరాజ్యానికి వచ్చి భోజుని తల పుర్రెను విడదీసి అందున్న రెండు చేపలను దీసి మామూలుగా పుర్రెను అంటించినారట, భోజుడు ఆశ్చర్యపడి తన వైద్య బహిష్కారమునకు సిగ్గు చెందినని ఒక గాధ కలదు

సమస్తవిద్యలకు ఉనికిపట్టని విఖ్యాతి గాంచిన కాశీపట్టణమున రాజర్షి, దేవసముడు, రాజ్యాధినేత అయిన దివోదాసధన్వంతరి శస్త్ర చికిత్సకుడుగా ప్రసిద్ధిగాంచాడు కాశీలో యీయన ఆయుర్వేద విశ్వవిద్యాలయమును స్థాపించాడు కాశీరాజు కుమారుడైన యీతడు అపరధన్వంతరి అని ప్రఖ్యాతి నందాడు నేడు మనము పూజించేది యీయననే. తన ప్రజలు రోగముల వల్ల బాధపడుచుండుట చూచి ఇంద్రుని వద్దకు వెళ్ళి శస్త్రచికిత్సా ప్రధానంగా ఆయుర్వేదమును అభ్యసించి ఆ విద్యను సుశ్రుతునకు బోధించాడు సుశ్రుతుడు [illegible]

కములో వ్యాప్తి చేశాడు. ఈ దివోదాసధన్వంతరి శస్త్రచికిత్సా మహిమలను గురించి పురాణాలు పలువిధాలుగా చెపుతున్నాయి దివోదాసుని శిష్యుడుం సుశ్రుతాచార్యుడు శల్యతంత్ర ప్రవర్తకుడుగా ప్రఖ్యాతిగాంచాడు దివోదాసుడు స్థాపించిన ఆయుర్వేద విశ్వవిద్యాలయములో ప్రధానచికిత్సకుడు (Cheif physician and Surgeon) గా పనిచేశాడు సుశ్రుతాచార్యుడు రామాయణ కాలమునాటివాడు. రాజర్షి విశ్వామిత్రుని కుమారుడు. మహాభారత రచనకు పూర్వమే సుశ్రుతసంహితను రచించాడు. సుశ్రుతుడు శారీరక ఆగంతుక మానసిక వ్యాధులతోబాటు శస్త్రచికిత్సా ప్రావీణ్యాన్ని కూడా సంపాదించిన ఉభయసాంప్రదాయ ప్రవర్తకుడని శృంగార నైషధంలో శ్రీహర్షుడు పేర్కొన్నాడు. ఈసుశ్రుతాచార్యుడు నేటి పెద్ద ఆపరేషనులు అనబడే పొట్టను చీల్చి చేయు చికిత్సలను."నిర్లక్ష్యముగా నిమిషాలలో పూర్తి చేసేవాడట ఒక కవీశ్వరుడు సుశ్రుతుని కీర్తిస్తూ

"కమలగర్భుని సత్యసంకల్ప వశత
ప్రాణికోటుల దేహ నిర్మాణమగును
అతడె యెఱుగడు దాని రహస్య వృత్తి
చోద్యమెట్లు గ్రహించెనో సుశ్రుతుండు

మనుజ వైద్యులకా మహామహుండె మొదటి
భిక్షపెట్టిన గురుడు, తద్విద్య నేడు
వివిధ ఖండాంతరమ్ముల వెలుగుచుండె
చండభానుని కరసహస్రమ్ము వోలె."

అని వ్రాశాడు

సుశ్రుతా చార్యుని శస్త్రచికిత్సా విశేషాలను గూర్చి చెప్పే గాధలు కొన్ని వినవేడుక కల్గిస్తాయి. "యీయన ఒకని పొట్ట చీల్చి చిన్న ప్రేవులలోని రాళ్ళను తీసివేశాడు. ఒకామె, కడుపుకోసి బిడ్డను బయలు పరచాడు. పుఱ్ఱెకు రంధ్రమువేసి మెదడులోనున్న శల్యాన్ని తీసివైచాడు. ఒక అందగత్తెకు ముక్కు వంకరగా వుందని ఆమె ముక్కుతీసి కొత్తముక్కు అతికించాడు. మూఢగర్భ చికిత్సలయందు, అస్థిభగ్న చికిత్సలందును ఉదరపాటనాది శస్త్ర చికిత్సలలోను వింత గొల్పునట్లు అనేక శస్త్ర చికిత్సలు యీయన ఆచరించాడు

శస్త్రచికిత్సకు నూటొక్క యంత్రాలను యిరవై శస్త్రాలను సృష్టించాడు శస్త్రచికిత్సలను ఎనిమిది భాగములుగా విభజించాడు. శస్త్రములు వాడిగలవి యంత్రములు వాడిలేనివి. సాధారణముగా యివి అన్నీ ఇనుముతో చేయ చేయబడేవి జంతువుల ముఖాకారాలవలెను, పక్షుల ముక్కులవలెను యీ పనిముట్లుతయారు చేయబడ్డవి. పెద్దపులి తలనుబోలినపటకారులు సింహముఖాన్ని బోలిన యంత్రాలు కూడా వున్నాయి సుశ్రుతుడు కనిపెట్టిన సింహముఖ యంత్రము యీనాటి పాశ్చాత్య శస్త్రచికిత్సలలో Lion's Forceps గా వ్యవహరింపబడు తోంది ఈనాటి శస్త్రయంత్రాలకు సుశ్రుతుడు కనిపెట్టిన యంత్రశస్త్రాలకు పోలిక ఒక్కటే. యోని, గుదమార్గములను శోధించటానికి యేర్పడిన 'యోని ప్రణేక్షణయంత్రాన్ని నేటి పాశ్చాత్య శస్త్ర చికిత్సకులు Allinghams-speculam అని వ్యవహరిస్తున్నారు శస్త్ర చికిత్స యందలి భేదముల ననుసరించి కొత్త కొత్త యంత్రాలను శస్త్రాలను కనిపెట్టినట్లు "స్వబుద్ధ్యాచాపి విభజేత్" అనే ప్రమాణవ్యాక్యమును బట్టి తెలుస్తోంది.

శస్త్రవైద్యున కుండవలసిన లక్షణాలను కూడా వివరిస్తూ హస్తలాఘవమే ప్రధానమని పేర్కొన్నాడు శస్త్రచికిత్స పొందిన రోగుల వద్ద ఉపచారం చేయుటకు స్త్రీలను నిషేధించాడు. (ఆడ నర్సులు) పురుషులే నియోగింపబడాలని నిర్ణయించాడు. ఇంతేగాక శస్త్ర చికిత్సకు పూర్వకర్మలను కొన్నిటిని పేర్కొన్నాడు. బాధ తెలియకుండా వుండటము కోసమని ఆహారములు యివ్వడము మత్తుపదార్థములను తొలగించడము మొదలయినవాటిని ఆచరణలో పెట్టాడు. 1872 లో డాక్టర్ సర్ జేమ్సు, క్లోరోఫారం కనిపెట్టుటకు పూర్వము అలోపతీ వైద్యులు గూడా యీ విధానాన్నే అవలంబించారు. సుశ్రుతుడు యీ శస్త్రచికిత్సాంగములో మరొక మహనీయమైన ప్రయోగమును కూడా

పేర్కొన్నాడు. అపచి అని ఒకరోగం ఉంది. కంఠము ఉరఃప్రదేశముల మధ్య కురుపులులేచి చీమూ రక్తమూ కారుతూంటుంది దానికి కాలి పిక్క వెనకభాగం చీల్చి అచటవున్న మేదో గ్రంథి తీసివేసి కట్టాలి పిల్లలకువచ్చు కురంటకమనే అండవృద్ధి వ్యాధిని నివారించుటకు చెవి కట్టాలని కంటి జబ్బులకు బొటన వ్రేలి క్రింద చురక వేయాలని చెప్పాడు దూరతమములైన అవయవాలకు కల నాడీసంబంధాన్ని గుర్తించి చికిత్స చేసే పద్ధతి యిది. దీనినే కీలెరిగివాత పెట్టడము అనే సామెతగా మనం వ్యవహరిస్తున్నాము.

శరీర నిర్మాణంలో అతి సున్నితములైన మర్మస్థానముల గురించి చెపుతూ సుశ్రుతుడు ప్రాణాపాయమును కల్గించు 107 మర్మ సంధులు కలవని విషలీకరించాడు శిలమండ కణతలు, నొసలు మొదలైనవాటినే మర్మ సంధులంటారు. ఈ మర్మస్థానాల మర్మము తెలుసుకొని ఆయుధప్రయోగం చేయుటం ప్రాచీనుల యద్ధకౌశలములో ఒక ముఖ్య విశేషంగా పరిగణించేవారు

రామాయణయుద్ధము నందు ఇంద్రజిత్తు లక్ష్మణుని విశల్యఘ్న మర్మస్థానమున అనగా నొసలయందు బాణముపెట్టి కొట్టాడు ఆ దెబ్బకు లక్ష్మణుడు మూర్ఛచెందాడు. ఆ అంబుతీసిన లక్ష్మణుడు మృతిచెందటము తథ్యము. కాని సుషేణుడు మర్మముఎరిగి వుండటమువల్ల వెంటనే సంజీవకరణిని తెప్పించి పుండు మాన్పుతూ అంబు తీసివైచినట్లు రామాయణము చెప్తతోంది. సుశ్రుత శస్త్రవైద్యంలో మరొక్క మహద్విశేషము సవర్ణీకరణ మనేదికూడా వున్నది. శస్త్రము చేసినచోట అతుకు స్పష్టంగా కన్పడుతూంటుంది అచట వెంట్రుకలుకూడా మొలవవు. కాని సుశ్రుతుడు చెప్పిన సవర్ణీకరణ విధానమువల్ల ఆ అతుకుచర్మంలో కలిసిపోవటం, అచట వెంట్రుకలు మొలవటం రెండూ జరుగుతాయి.

శస్త్రచికిత్స పొందిన రోగికి క్రిమిదోషము రాకుండా వుండటానికి సుశ్రుతుడు కొన్ని విధానాలను పేర్కొన్నాడు. నేటి శస్త్రచికిత్సకులు బాహ్య క్రిమిదోష విషయమున శ్రద్ధ వహిస్తున్నారే కాని అంతర్గతమైన క్రిమిదోషానికికారణాలను గణించటములేదు. శస్త్రచికిత్సచేయుటకు పూర్వమే రోగికి పంచకర్మలద్వారా దోషములను శాంతపరచి శస్త్రచికిత్సచేసిన, క్రిమిమిశితమైన చీము మొదలగునవి బయలుదేరవు

బాహ్య క్రిమిదోష నివారణకుకూడా కొన్ని ధూపములను వివరించాడు గుగ్గిలం, వస, ఆవాలు, సైంధవలవణం నేతిలో ముంచినవేపాకులు కలిపి చూర్ణముచేసి శస్త్ర చికిత్స పొందిన రోగి గదిలో పొగవేసిన క్రిమికీటకాదులు దరిజేరవు

సుశ్రుతాచార్యుని తర్వాత ఆయనతో సమానమైన కీర్తిని పొందినవాడు వాగ్భటాచార్యుడు. అష్టాంగ హృదయమును ఒక మహాకావ్యంగా రచించాడు వాగ్భటుడు శస్త్రచికిత్సకుడు, రసవాది బౌద్ధధర్మావలంబకుడు సుశ్రుతుని కాలమునకన్న వీరి కాలములో క్రమానుగతమగు జ్ఞానగరిమవల్ల శస్త్రచికిత్స బహుళ ప్రచారంలోకి వచ్చింది.

సుశ్రుత వాగ్భటులతరువాత శస్త్ర వైద్య చికిత్సా పటిమను పోషించి పెంపుచేసినవాడు జీవకుడు బౌద్ధవాఙ్మయములో జీవకుని ప్రతిభనుగురించి అనేక గాథలున్నాయి బింబిసారుని ఆస్థాన వైద్యుడుగావుండి జీవకుడు బాల వైద్య శస్త్ర చికిత్సలయందు ప్రఖ్యాతి గాంచి మగధ సామ్రాజ్యమునకు అపర ధన్వంతరిగా ప్రవర్తిల్లాడు. బింబిసారునకు భగంధర వ్యాధి శస్త్రచికిత్సలో కుదిర్చాడు కాశీలో ఒక వర్తక శ్రేష్ఠుని కుమారుడు వ్యాయామము చేయుచుండగా పేగు మెలికపడగా జీవకుని తీసుకవెళ్ళి శస్త్రముచేసి మెలికపడిన పేగును సరిజేసి ఉదర కుహరమును యథాప్రకారము కుట్టగా ఆ బాలునకు ఆరోగ్యం కల్గిన గాథ చాలా విచిత్రమైనది. జీవకుని కీర్తిచంద్రికలు యావద్భారతము ప్రసరించుట చూచి ప్రద్యోతమహారాజు జీవకుని పిలిపించుకొని తన తలబాధను శస్త్రచికిత్సవల్ల నయము చేయించుకొనెనట ప్రద్యోతుడు అతి

విలువైన రెండు శాలువలు చతురంగబలము, ధనరాసులు యిచ్చి పంపెనట యీ సంపదను బింబిసారునకు యివ్వబోగా ఆయన పుచ్చుకొనలేదు ఆ శాలువలు అతివిలువైనవి. బెలూచి స్థానములో తయారు చేయబడినవి దైవాంశ సంభూతులే వాటిని ధరించుచుండెడివారు అందువలన ఆ శాలువలు తాను ధరించక వాటిని తీసుకొని వెళ్ళి బుద్ధదేవునకు సమర్పించెనట. అందుకు ప్రతిఫలముగా బుద్ధదేవుడు జీవకుని బౌద్ధధర్మావలంబకునిగా జేసెనట బుద్ధునకు చివరదినము మేహవ్రణము పుట్టెనని అందునకు శస్త్రచికిత్స చేసి మాన్పెనని అప్పుడు లోపలకు మందు యిచ్చి బుద్ధునిశరీరము మలిన పరచరాదని తామరపూవులో మందు ఉంచి వాసన చూడమనగా అంతట బుద్ధునకు ఆరోగ్యము కలిగినట్లు ఛుల్లయగ్గ మహాయగ్గ అను బౌద్ధగ్రంధములు చెపుతున్నాయి జీవకునివద్ద మూడుఓషధులు కలవట.రాజౌషధి,సమ్మోహిని సంజీవకరణి అని రాజౌషధి తలమీద ఉంచిన ముకురేలో చూచినట్లు శరీరతత్వము దృగ్గోచరమయ్యెడిదట శస్త్రచికిత్స చేసిన రోగులకు సంజీవకరణి వెంటనే ఆనవాలుకూడా లేకుండా పుండును మాన్పెడిదని, సమ్మోహిని శస్త్రబాధ తెలియకుండా మత్తువచ్చెడిదని తెలియుచున్నది జీవకుని కాలములోఆయుర్వేదాంగ శస్త్రచికిత్స ప్రపంచ పరివ్యాప్తి నందినది చరిత్రకారులు ఆకాలాన్నివర్ణించుచూ స్వర్ణయుగమని పేర్కొన్నారు. అశోకచక్రవర్తి కూడా శస్త్రవైద్యమును చాలాఅభివృద్ధి పరిచాడు అశోకుడు బౌద్ధమత స్వీకారం చేసినపిమ్మట శస్త్రవైద్య మహావృక్షాన్ని కూకటి వేళ్ళతో పెళ్ళగించి సర్వనాశనంచేసివైచాడు శస్త్ర చికిత్సను హింసా చర్యగా పేర్కొని దానిని పూర్తిగా నిషేధించాడు మానవులకు జంతువునకు శస్త్రము చేయరాదు, శవమును కోయరాదు అని రాజశాసనము చేశాడు. శస్త్రవైద్యమును అశోకుడు చేజేతుల సర్వనాశనము చేశాడు. దీని పరిణామంగా రానురాను కాలము గడచినకొలదీ శస్త్రవిద్యా విశేష వివేకములన్నీ కాలగర్భంలో కలిసిపోయి కథలు గాధలు మాత్రమే నిలిచిపోయాయి బౌద్ధయుగ పాలనలో విద్యార్థులకు శరీర శాస్త్రము నేర్పుటకు శవములే దొరకలేదుట శవస్పర్శ దోష భూయిష్టమై శస్త్ర వైద్యుడు అపాంక్తేయుడుగా పరిగణింపబడి శస్త్ర వైద్యుని చేతితో వండిన వంటకము తినరాదనియు, సంఘము కూడా హీనముగా చూచి బహిష్కరించి వెలివేసెను. ఈవిధంగా శస్త్ర చికిత్స మనదేశంలో రూపు మాసిపోయి ది శస్త్రమునకు బదులు అగ్ని క్షార జలూక చికిత్సలు అమలులోకి వచ్చెను. తర్వాత హూణులు సింధియనులు గజని మొదలైనవారిదండయాత్రలతో భారతీయవాఙ్మయము కాలగర్భంలో కలిసిపోయింది.

ఈ సందర్భంలో మన వైద్య శాస్త్రానికి సంబంధించిన కొన్నిశాసనాలు దొరకటము గత చరిత్రకు ప్రబల నిదర్శనం. 1326 ప్రాంతమున కొండవీటి రెడ్డి కోమటి పెదవేమారెడ్డి, పరహిత వంశజులగు భట్టభాస్కరుని పౌత్రునకు పొన్నపల్లి గ్రామము దానంఇస్తూ రచించిన శాసనంలో ఆయుర్వేద శస్త్రచికిత్సకు సంబంధించిన భోగట్టా కొంతకలదు. భూలోక ధన్వంతరి అని ప్రఖ్యాతి గడించిన పరహితాచార్యుడు ఒకనాడు త్రోవను పోవుచూ ఒక తాచుపాము దవడలో కప్పఎముక గుచ్చుకొని బాధపడుటచూచి దయామయుడై ఆ పామునుబట్టి ఎముకనులాగి గాయమును మాన్పి సర్పమును వదలి వైచెనని ఒక గాధ ఆసర్పమునకు హితముగూర్చి నందున ఆ వంశమునకు పరహిత వంశమని పేరువచ్చెను. ఈ వంశమునకు చెందిన శ్రీనాథ వైద్యపండితుడు శస్త్రచికిత్సా ప్రాధాన్యంగా 'పరహిత సంహిత' అను గ్రంధమును వ్రాసెను, అదే నేటికి మనకు సాక్షీభూతమైనది.

ఈవిధంగా విస్మృతి పథమునకు లోగి చరిత్రగతమైపోయిన ప్రాచీన శస్త్ర వైద్యమును గురించి పాశ్చాత్యులు చెప్పిన కొన్ని వాక్యాలే నేటికిని మనకు పరమ ప్రమాణాలుగా నిలిచి వున్నాయి.

డాక్టర్ సౌరస్బర్గు అను బర్లిన్ డాక్టర్ ఇలా అన్నాడు. సుశ్రుతుడు చెప్పిన సింహముఖయంత్రము మనముపయోగించే లైయ

న్స్–పార్శ్వపువలెనే ఉంటుంది వెల్కం చారిత్రిక మ్యూజియంలో పూర్వపు హిందూవైద్య లుపయోగించిన శస్త్రయంత్రములను చూడవచ్చు వాటిని చూస్తూంటే నేటి నవీన శాస్త్రజ్ఞులు యీపరికరాలను ప్రదర్శన నిమిత్తం యిచట వుంచారా అనిపిస్తుంది. పాంపే నగర ధ్వంసముతో చాలా శస్త్రయంత్రములు అగ్నిభస్మములో పూడిపోయినవి అనేక శతాబ్దములు గడిచిన పిమ్మట త్రవ్వగా దొరికినవే నేటి నేపిల్సుమ్యూజియంలో భద్రపరచబడ్డాయి ప్రాచీన హిందూ శస్త్రవైద్యులు కృత్రిమ దంతాలను కట్టుటలో నిపుణులు నేటి ఐరోపీయ వైద్యానికి జనకుడైన డాక్టర్ హిపోక్రటీసు హిందూదేశమునకు వచ్చి చూచి యిలా ఉగ్గడించాడు గ్రీకుదేశము నవీన శస్త్రవైద్యశాస్త్రానికి తండ్రివంటిదని చెపుతారు అది సరికాదు పోషకురాలో లేక దాదో అని చెప్పవచ్చు అది పుట్టి పెరిగినది హిందూదేశములోనే. మాక్డోనాల్డు పండితుడు Sanskrit literature లో యిలా వ్రాశాడు: భారతదేశంలో పెట్టుముక్కు అతికించేపద్ధతిని గత శతాబ్దిలో గ్రహించి ఐరోపీయ వైద్యులు ఆప్రక్రియను తమ శస్త్రచికిత్సలో చేర్చుకొనిరి హిందూ శస్త్రవైద్య లుపయోగించిన ఉపకరణాలు తల వెంట్రుకలను కూడా చీల్చగలుగునంతవాడిగలవి. "జెన్నరు పుట్టుకకు పూర్వమే హిందూదేశంలో పశువులకాపరులు స్ఫోటకజ్వరము రాకుండా టీకాలు వేయటం ఎరుగుదురు ఎండుపొక్కులపొట్టును తీసి ముంజేతిమీదపెట్టి సూదితో పొడుచుకొనటం వారి టీకాలపద్ధతి" అని హ్యూలెట్ అను డాక్టరు నుడివెను

అవనిపుడాదరించిన భటాళిభటత్వము
వైద్య వైద్యమున్
కవికవితా మహత్వమును గాయకుగానము
కోటిసేయున
య్యవనిపు డాదరింపని భటాళిభటత్వము
వైదువైద్యమున్
గవికవితా మహత్వమును గాయకుగానము
గవ్వసేయునే.

★

భాస్కరభట్టవిరచితము
ఉన్మత్తరాఘవము

శ్రీ జూలూరి హనుమంతరావు.

బృందగీతి :- వచ్చెనిదే మలయగంధ వాహామధు వసంతము
విపుల కళాలలిత కుసుమ వీధికా ప్రశాంతము
మలయ పవనడోలికా ప్రచలిత సుమాకందము
కుసుమ మంజరీ మరంద స్నాత భృంగబృందము
సమస్త శాఖికా కళాప్రసూన సుమద శోకము
మత్తకోకిలాపంచమరావలోల లోకము ॥వచ్చె॥

స్త్రీకంఠము : చైత్రుఁడు మాత్యుఁడు దక్షిణపవనుఁడు
సైన్యాధిపుఁడయి సేవింపన్
మధుకరులను చరమండలిరైయె మధు
మాస ప్రపంచము రాజ్యమై శ్రీ
శిశిరుని గర్వము కిసలయ విశిఖపు
శిఖలం జల్లఁగ వ్రేల్చంగన్
విజయుండౌ మా మన్మధ భూపతి
విజయం సేయుత మెల్లపుడున్,

పురుషకంఠము: అదె కుసుమ మంజరుల వదలి కడుమోహాముున
లతాంతమున భృంగతతి చిక్కెన్
దూరాన గల పూవులకు లోభమును పొంది
ఘోరాపదను సీతపొందిన విధానన్

మధురిక : ఎదురుగా నున్నవే ఇంపైన కుసుమాలు
నీదృష్టి యెచటనో నిలచెనే సీతా !

జానకి : ఇంతింతలై కన్నులంతగా విరిసెనే
ఎదుటగల వనములో మధుపూర కుసుమాలు
మధురికా ! సౌగంధ మంజులతర కుసుమాల
పొంద నభిలాషచే పోవుచున్నానే !

మధురిక : ఈ ప్రదేశము మనల కెఱుకలేదమ్మా !
ఋష్యాశ్రమములు కలవీ కాననములందు
ఆశ్రమములందుఁ గల అలరులను జిదుముచో
తాపసులు కుపితులై శపియింతురమ్మా !
ప్రియముఁ గూర్పఁగ నీకు రామభద్రుఁడు కనక

మృగముఁగొని వేఁట విరమించు వేళాయె
చిదిమినవిచాలు నీ చిన్నె వన్నెలపూలు
పర్ణశాలకుఁ బోదమమ్మా! సీతమ్మా!

జానకి వనలతా తరు పుష్పవాహినీ జలములన
సర్వజనులకుఁ జెందఁ జాలినవి చెలియా!
తాపసులు శపియింపఁ దలఁతురే కోపించి
యీ పూలఁ గోయుచో నెవరైనఁ జెలియా!
రామభద్రుని దేవతార్చన నిమిత్తమై
యెదుటి కాననమందు రమ్య ప్రసూనాలు
గ్రహియించి పర్ణశాలకుఁ బోదమోసకియ!
అదె చూడు మధురికా ఆ తుమ్మెదను గనుము
ఏలనో దొరలిపడి యింతలోనే లేచి
భ్రమియించు నీకుసుమ వల్లరీ భూజముల

మధురిక. పూలతేనెలలోన మునిఁగి త్రాఁగెడు వేళ
తడిసి ఱెక్కలు విడక పడె చిక్కులో భ్రమరి
అదె కనుము ఆభ్రమరి నా చిగురు గుంపులో
సహచరినిఁ గనలేక స్వాంతమున బాధతో
భ్రమరుఁ డున్మత్తుఁడై భ్రమియించు జానకీ!
(ఆశ్చర్యంతో)
ఆశ్చర్యమగును సూ అతిసమీపమునందె
తిరుగుచును సహచరినిఁ దెలిసికొనకుండెనే!

జానకి. ఆలోచనము సేయు మా సఖి! ఏలనో!

మధురిక: (ఆలోచించి)
కదలలేని మధువాని భ్రమరి సహకారదండమున లేపుదు నా?
సహచరుండు భ్రమరుండు చెలియతోసంతసింపఁగాఁ జేయుదునా?
(అటులే యొనర్చి – సంతోషంతో)
ఱెక్కలార్చి విదలించి యెగిరి తనప్రియుని భ్రమరి కని చేరెనదే!
భ్రమరదంపతులు మధురమాధవీ మధువులాని సుఖయింతురదే!
(తిరిగిచూచి విషాదంతో)

ఎటకేగెనహో జానకి? ఏదిక్కున కనుపింపదే!
అంతులేని యీ అరణ్యమందు వెదుకఁ గనఁబడదే!
ఏదిక్కునఁ జూడగలనో ఏదిక్కున కేగినదో?

(ఆశతో) అదె చక్కని లేడియొకటి అరుదెంచెడు నావైపుకు
రెప్పపాటు లేక చూపు లప్పగించు నన్నుఁజూచి.
నా హృదయము చిరపరిచితమౌ హేలను దెలియఁబఱచు
ఈ కురంగి చూపులచే సఖీస్నేహమును జూపును !
ఏ జన్మాంతర సఖియో ఈ కురంగి తెలియలేను
నా హృదయము చిరపరిచిత మౌ హేలను దెలియఁబఱచు.

(ఆశ్చర్యంతో) ఇట ఋష్యాశ్రమ మహిమన నే క్రూరమృగాలు లేవె !
అగుచో ఎటకేగెను జానకి ? ఆశ్చర్యమ్మాయెడు.

(విషాదంతో) వేటమాని వచ్చు రామ విభునకు నేమని తెలుపుదు ?
రామభద్రుఁ డిదివిని తానేమి అవస్థలపాలగు !
సీతాప్రస్థాన కథయ శిథిలించెను నాహృదయము ॥ఎట॥

(నేపథ్యమందు కలకలము)

(సంభ్రమంతో) మునిజనములు అతిసంభ్రమమున కనఁబడు చుండిరదే!
వచ్చుచుండెనేమి రామభద్రుఁడు మృగయా విజయుఁడు!

(తిరిగి నేపథ్యమందు)

దారుల్ శుభ్రము సేసి, హస్తగతపాత్రల్ వంచి నిండారవాః
పూరమ్ముల్ వెదజల్లుడీ, తెరువులం బుష్పాలతో నింపుడీ!
రారే వేగ, మహీసుతాప్రియము గూర్పన్ వేటచాలించి యే
తేరెన్ హేమమృగమ్ముతో విపినవీథిన్ రామభద్రుండదే!
ప్రియమున లక్ష్మణుం డనుసరింపఁగ వెన్కనె సాధుదృక్కళా
నయనయుగమ్ము లాదరమునన్ బలుకారుగ స్వేదబిందు సం
చయ లలితాస్యుఁడై భుజమునన్ శిథిలీకృత శింజినీశరుం
డయి యతి శోభతో దశరథాత్మజుఁ డల్లదె వచ్చుచూడుడీ!

మధురిక : (సంభ్రమంతో)
కనకమృగము గైకొని లక్ష్మణసహితుండయి రాముఁడు
ఏతెంచెనిదే – పిలచుట కెవరినో – ఆలోచించెడు
నే నీమార్గము తొలఁగుచు నిలచెద నెటనైన నిపుడు

(రామలక్ష్మణుల ప్రవేశము)

రాముడు : కనకమృగమ్ము చూచి పులకల్ పొడ సూపఁగ సీత సంతస
మ్మును సవిశేష రీతిఁగొను మోమెల నవ్వులు నవ్వ లక్ష్మణా !

లక్ష్మణుడు జనకజ మాటమాత్రమున సంతసమందును మీ ప్రసాదమౌ
కనకమృగమ్ము చేకొనుచు కాంచుమహోంతము దమ్ము, నిక్కమౌ.

రాముడు : వరముని అగస్త్యుతపమున భయములేని యీ అడవిని
మధురికతోఁగూడి సీత మరలివచ్చుచున్నె—కనుము
క్రొత్తదేశమగుట మనసు కొందలమందును శంకల

లక్ష్మణుఁడు : తలఁచు నెప్పటికిని ప్రమాదమును మొదల
ప్రియజనులపైనఁ బెంచిన ప్రేమ శక్తి.

మధురిక : (నిశ్వాసతో) ఈ వృత్తాంతమునే నేదో విధి తెలుపవలెను.

లక్ష్మణుఁడు (మధురికను జూచి తనలో)
ఒంటరిగా దీనముగానుండి వచ్చు మధురిక అదె;
జానకి కేదో ఆపద నంభవించెనేమొ కదా!

మధురిక : (వచ్చి) జయతు జయతు మహారాజ!

రాముడు : జానకి యెటమధురికా?

మధురిక : (గద్గదస్వనంతో)
స్వామి దేవార్చనకు కుసుమాల్ సంతరింపగ నరిగె జానకి
కాన నాంతరమందు వెదకినఁ గానబడదయ్యెన్.

రాముఁడు : హా! హతోస్మి!
సీత కనుపింపలేదని చెప్పు నక్ష
రములు దుష్టంబులౌచు కర్ణముల నిలచి
మండుమంచు నిప్పుకలౌచు మనసు వేల్చి
అధికతాపమ్ము పెంచు సర్వాంగకముల
అతి దారుణమీ దైవ దుర్విపాకము!
తల్లులను, దండ్రినిన్ సహోదరుల, రాజ్య
మును, భవనముల, బాంధవులను త్యజించి
దైవవిధిచేత కాననాంతర నివాసు
లమగు మాకతి దుఃఖతాపములు కలిగె.
హా! జానకీ!
ఓ కురంగనయన! ఈ మహోగ్రవిరహ
బాధ సహియింపలే, నెడబాయకుండ
కాననములందుఁ జరియించుదాన, నెచట
నుంటివో! తెల్పు మపరాధమున్న సయిచి.

లక్ష్మణుఁడు : అతి దుఃఖితుఁడయ్యె రాముఁ డపనయింప జేయుదునిఁక
ఈ హరిణముఁ గొనిచనుమా ఉటజమునకు మధురికా!

(మధురికా నిష్క్రమతి)

రాముఁడు : (నిస్పృహతో)

త్రైలోక్య లావణ్యా నారీలలామన్ ప్రాణాధిక ప్రాణసఖిఁజూడలేనా?
ఈనూత్న కారిన్యమార్గాలచన్నే? ఏచోటునన్ గందునే జానకీ! నిన్?

లక్ష్మణుఁడు . ఎందుకన్నా దుఃఖపడుదురు? ఈ వనమ్మున వెదకి వత్తము

రాముఁడు . ఇంక పైనీ మందభాగ్యున కేడ సీతాదర్శనమ్మగు?
పోయి వెదకుద మన్నిచోటుల ముందు నడువుము లక్ష్మణా!

లక్ష్మణుఁడు . దేవ! యీ సికతా తలమ్మున దేవి పదచిహ్నములు చూడుడు

రాముఁడు . (చూచి, ఆశతో)
అవును లక్ష్మణ! జానకీ చరణాంచితమ్ములె యీ పదమ్ములు
అదే అంగుళివిలస నమ్మదె అదే చరణక్రమము — అల్ప
ప్రదేశత్వమ్మదియె — అదియే యానచాతురి — అదే — జానకి
(నిశ్వాసంతో)
ప్రణయకుపితకాలమ్ములోఁ బ్రణతులిడఁగ
శిరసుపైనుండి వ్రాలెను విరులతోడఁ
బూజచేసెడు హరిణాక్షి పూతచరణ
ముద్రలివె కానుపించు నీపుడమిపైన.
ప్రణయకోపా విష్కృతమ్మల కనుల కజ్జలబాష్పధారల
విడచి వినమిత పాటలానన ప్రియమహీసుత కనబడెన్.
ప్రియామన్ననసేయవే! ఇఁక విడవె కోపమ్మేలనే?
చంద్రజితముఖ పద్మమందు! ప్రసన్నతం ధరియింపవే!
నను దయామతిఁ జూడవేమి! ప్రణామముల నర్పింతునే!
రమణి! నీచరణాబ్జలాక్షా రసము శిరమున దాల్తునే

లక్ష్మణుడు . ఆర్యపుత్రుని యున్మాదమధికమయ్యె, దేవ! జానకి కాదది.

రాముఁడు : తెలిసెఁదేనె త్రాగమూగిన భ్రమరసంతతులతోడి
యరుణ భూపద్మమదియ మూఢాత్మునైతి

లక్ష్మణుఁడు . కొన్నిమాటల నయుక్తంబుగ కొన్ని యాదార్థ్యముగఁ బలుకుచు
తెలిసి తెలియక సంకరమ్ముగ పలుకుబడులను పలుకురాముఁడు

రాముఁడు : పద్మమా! నిన్ను జేరిన పాదముద్ర
లివియె; చూపుము సీత, లేదేని యెచట
కరిగెనో చూపుమిటనుండి కాలియడుగు
గురుతులను నాకు, అవె చూడు గురుతులనుచు
మోము కదపిన దీపూలముద్దరాలు.

లక్ష్మణుఁడు : (తనలో)
పాదముద్రలు సహకారవనము జేరె

త్రిప్పుదును రామభద్రుని హృదయమితర
విషయమునకు-

అన్న ! కిసలయావృతమదాళి
బృందములు పూలమధువాహరించునవియె
ప్రతిపదమ్మున భేదింప వానిక్రమ
మలయజ సమీరమే తెంచె మందగతిని.

రాముఁడు విరహిజన దావానలములీ వీచు శీతసమీరణమ్ములు!
సర్వజగత్ప్రాణమీ సమీకరణమనుటెల్ల వృథా
ప్రపంచమంత నిండిన నిది ప్రాణహారకమ్ము నాకు.
పవన! ప్రియామృదులాంగము స్పృష్టమౌచు కనఁబడునో,
కౌగలించుకొనుము నన్ను కాదా - విడువేగ నన్ను!
కాంతారసీమలో భ్రమియించు నాప్రాణ
కాంత కనబడునదే హంసయానమ్ముతో.
నా ప్రియాముఖ మారుతమ్మున నవ్యసురభిళములు జనించుచు
నిను తిరస్కృతి సేయవైరము కొనుదువే పవనా?
మాకందపాళీ మకరందమందున్ మధురతాల్ మజ్జనమాడుచుండెన్
మనస్వినీమానము దొంగిలింపన్ మనోభవున్ ప్రేరణసేయుచుండెన్.
మధువుత్రాగిన మత్తులీ మధుకరాలు
పలుకు పలికిననవి నీవు నాపలుకులేవి
చక్క తెలియదు ప్రియురాలు చన్న తెరువు.

(కోకిలకూత వినఁబడును)

ఈ సహకారవీధి జలజేక్షణ నాప్రియయేదొ తీయనౌ
జాస ప్రవాళమంజరుల చాటుల దాగుచుఁ బల్కుమానసో
ల్లాసము లూగ ....

లక్ష్మణుడు · .. ..భ్రాంతిఁగనె రాముఁడు కోకిలకూజితమ్ముచే

రాముఁడు నాసతి పల్కువిందును గనంబడదాకృతి వేడికొందికన్.
మానసమ్మునకు జీవనౌషధము లోచనామృతావర్తికాంజనము
మన్మథజ్వరమహా రసాయనము చూపు ప్రేయసీ నీశుభాకృతిన్.
పలనో ప్రియా! ఉదాసీనురాలవైతి ? రమ్ము వికచాసితోత్పల రమ్యనేత్ర!
నీదు భుజవల్లరుల చేత నాదు కంఠబంధనము సేయుమ, వినీతపదవి నవియె.

అర్పణముసేయు తదుపరి — అరుణ కిసల
యాంగుళుల నేత్రములఁ గప్పు మటులకాక-

లక్ష్మణుఁడు (స్వగతం) ఏమిసేయుదు మిఁక కష్టమీ ప్రతీప
మగు ప్రతీకార దుస్థితియందు?

రాముఁడు చెలియ! ఆలసించెదవేల నీలీల? ఏక
సరణిఁ జేయుమ యుభయపక్షముల నీవు

లక్ష్మణుఁడు . పరభృతాలాపమది వినంబడెడు పలుకు— ఆర్య! జానకి లేదట—

రాముఁడు ఆ రవమ్ము శ్రావ్యవీణా నినాదప్రశాంత మతికి
కఠిన ఢక్కారవము వోలె కలచుహృదిని

(సంభ్రమంతో)

చూడువత్సా! కొందఱెవరో చోరు లరుగో! చూడువత్సా!
జానకీప్రియ హేమభూషణ జాలముల నవె దొంగిలించిరి.
నెత్తిపై నిడికొనుచుఁ జేతులనెత్తిచాచుచు వచ్చుచుండిరి
ఎదురుగా యుద్ధమ్ము సేయగ నేగుదెంచుచు నుండిరరుగో
చూడువత్సా! కొందఱెవరో చోరులరుగో! చూడువత్సా!
ఒకడు ముక్తాహారముల నింకొకం డెఱ్ఱని పద్మరాగా
లొకఁడు జానకి కనకభూషల నొలిచికొని యదె వచ్చుచుండిరి.
చూడువత్సా! కొందఱెవరో చోరులరుగో! చూడువత్సా!

లక్ష్మణుఁడు ఆర్యపుత్రుని యున్మాదమ మధికమయ్యె మఱల

రాముఁడు నిలుడు నిలుడు చోరులార! నాయెదుటనె యెటుపోదురు?
ఒక్కొకబాణముతో మి మ్మొక్కొక్కరి సంహరింతు
నిలుడు నిలుడు చోరులార!

(వింటినారి శబ్దము)

లక్ష్మణుఁడు ఆటోపమ్మేల నన్న? అతిశాంతము పొందుమన్న!

రాముఁడు : (కోపంతో)
విడుము విడుము లక్ష్మణా! వింటినడ్డుపెట్టవలదు
శరసంధానము చోరుల శిరముల ఛేదింపవలయు
విడుము విడుము లక్ష్మణా! వింటి నడ్డుపెట్టవలదు
నిర్భయముగ నిశ్చలముగ నిలచినారు చోరులటనె
విడుము విడుము లక్ష్మణా! వింటి నడ్డుపెట్టవలదు.

(తిరిగి వింటినారి శబ్దము)

లక్ష్మణుఁడు . రామభద్ర! తూణీరనిర్గత శరమ్ము
కాదువృథ పరప్రాణ నిర్గమము కాక
తెలియుమా దేవ! శరము సంధింప నేమి
ఫలము? విడుము, అంబు చోరు లెవ్వారులేరు

రాముఁడు : మూఢమతి నాది లక్ష్మణా! మోసపోతి
కెంపులై యలర శోకంపు మొగ్గలుగాని
అవి పద్మరాగంపుఁ జిపులుగావు
నవకర్ణికారంపు ననలు విచ్చెనుగాని
అదిస్వర్ణ భూషాచయమ్ము కాదు
స్వచ్ఛమౌ సితసిందువార సంతతిగాని
అది ముత్యముల సమూహమ్ము కాదు
తరుల విద్యోత విస్తారశాఖలుగాని
తస్కరోద్యద్భుజా తతులు గావు
లక్ష్మణుఁడు వెదకుదుమ యీలతాకుంజ వీథులందు?
రాముఁడు . అటులనే వత్స!
(క్షణమాగి)
లక్ష్మణ! ఆగు మిచట
కనుపించునదే జానకి స్తనభరనతమూర్తి పాణిచలనమ్ము ననన్
గనిపిలచుచు కర్ణరసాయనముల వచనాల హృదయమదిడోలికగా,
లక్ష్మణుఁడు : అధికమగుచుండె నున్మాద మవధిలేక
రాముఁడు : జానకీ! యింతకాల మెచ్చటకుఁబోతి?
"వార్యపుత్ర! ప్రేమపరీక్షకై లతాని
కుంజములలోన నిటు దాగికొంటి" ననెదో!
లక్ష్మణుఁడు : ఎచట నీదేవి జానకి యెచట నిచట?
రాముఁడు . కాంత! త్వదీయ భాషణలు కర్ణసుధామధుశీకరాలు · హే
మంత సుశీత చందనసమానము మానిని నీదుస్పర్శ, అ
శ్రాంతము నాదు కన్నులకు శారద సుందరచంద్రికా కళా
క్రాంత శరీర, వెట్లు క్షణకాలమెయౌ విరహమ్ము సైతువే?
లక్ష్మణుఁడు . ఎచట నీదేవి జానకి యెచట? దేవ!
రాముఁడు : అదె యెదుట సీత ఏమి మోహమ్ము నాది!
చిగురుటాకుల సంపదచే మనోజ్ఞమై సుమస్తబకానతమై విలోల
మై మధుస్రవంతుల మనోహరమునైన
భ్రమరఝుంకారసంకులవల్లరి యిది!
చెలియ యీలతి కాసుమమ్ముల జిదిమెనేమో లక్ష్మణా!
పూలు చిదిమిన గురుతులివిగో ప్రోడులైనవి తోడిపులివిగో
నేలరాలిన యాకులివిగో పూలుచిదిమిన గురుతులివిగో
లక్ష్మణుఁడు : అవును దేవా! కనుడు జానకి అడుగులివె యీ తీవదగ్గఱ

రాముఁడు · తిరిగి యేదెసకరిగెనో సతి అరయుమా ఇటనుండి వత్సా!

లక్ష్మణుఁడు : (తీగచుట్టూతిరిగి - తనలో)
జానకీ మణికంకణమ్మిది జారిపడె నీ తీవదగ్గఱ
ఆర్యపుత్రుని హృదయమానందాతిరేకముగాగ జూపుదు

(రామునితో) - దేవ! ఇంతకుమీద నెచ్చట తెలియఁబడ వీపాదముద్రలు
ఏదొ ఒకమృగపాదముద్రిక లిచటనుండియె కానబడుని వె

రాముఁడు . హా! నిరాశుఁడ నైతి జానకి! ఆయతేక్షణ! స్నిగ్ధకురులను
పక్వబింబాధరము నీ ముఖ పద్మమును నాకనులకెప్పుడు
చూపుదో! ఓ మంజుభాషిణి చూపుదో! నా కనులకెప్పుడు!
(లక్ష్మణునితో) వత్స కనఁబడదెచట_జానకి వస్తువేని మనస్సు నిల్పఁగ

లక్ష్మణుఁడు , దేవ! ఇదిగో చేయిజారిన దేవిమణికంకణము — కొనుమా!

రాముఁడు : (సంతోషంతో)
నా హృదయ ప్రాణమిది నా విరహతాపరుజ
స్వల్పముగ తొలచి తొలగించెన్
ప్రాణసఖి కరపల్లవము వీడిపడి నాదు
ప్రాణమై నేడు నను జేరెన్.—
ఇదే మణివలయమ్ము పూర్వము నాదుకంఠము నొరసి కొన్నది
బహుశః పరిరంభణములందున ప్రాణసఖి బింబాధరమ్మున
రసము గ్రోలగ చేయినడ్డగ రవళిగోలాహలము చేయుచు
ఇదే మణివలయమ్ము పూర్వము నాదుకంఠము నొరసికొని భి
న్నమ్ముగా నిటలబ్ధమైనది.
వత్స! జానకి నెచటఁ జూతుము వనములో నెట వెదకుచుందుము
ఏ లతాకుంజముల నొకపరియేని చూతము మఱల వత్సా!
అన్నివిధముల నాశలుడిగితి మన్న! లక్ష్మణ యీ ప్రయాసల
అగ్నికీలల తోడనిండిన యటులు దిక్కులఁ జూచుచుంటిని
నేడు నా ప్రియలేని జగమిది గాఢమై కఠినముగ దోచును.

లక్ష్మణుఁడు : ఆర్యపుత్రుని దశ కష్టమౌచుఁ దోచు

రాముఁడు : లక్ష్మణా! ఏల నిచ్చట? రమ్మువత్స!

రాముఁడు : అరుగుదమా గృహమ్మునకు?

లక్ష్మణుఁడు . అన్న గృహమ్మిదికాదు

రాముఁడు : ఏలనో?

లక్ష్మణుఁడు : అరుగుచునుంటి మీ యడవియందు

రాముడు. ఎటులబ్బెను?
లక్ష్మణుడు తండ్రియాజ్ఞ
రాముడు ఎందఱ మిటకేగుదెంచితిమి?
లక్ష్మణుడు దైవమ! ముగ్గురము
రాముడు ఎవ్వరెవ్వరో?
లక్ష్మణుడు అరయుము నీవు, నేను, జనకాత్మజ
రాముడు హా! సతి యేడనుంటివో?
(నేపథ్యంలో) భయపడకుమ వత్సా! మిము వనముననే వెదకుచుంటి
లక్ష్మణుడు (సంతోషంతో)
జానకీమధురికలతో నేగుదెంచునదె
కుంభసంభవుడదే కుతుకమ్ముతో దేవ!
అగస్త్యుడు (వచ్చి) భయపడకును వత్సా! మిము వనముననే వెదకుచుంటి
జానకి (రామునిజూచి సిగ్గుతో దనలో)
నేత్రయుగ్మము కఱవుదీరగ నేడు కంటిని రామభద్రుని
ఏమి నాహృద్భాగ్యమిది కుసుమించి హసియించెన్.
రాముడు భద్రమూర్తి కగస్త్య ఋషికభి వందనమ్ము లివే!
అగస్త్యుడు ఆయుష్మంతుడవౌదు దాశరధి!
లక్ష్మణుడు భద్రమూర్తి కగస్త్య ఋషికభి వందనమ్ము లివే!
అగస్త్యుడు వత్సా! చిరంజీవివౌ!
జానకి జయతు జయతు ఆర్యపుత్ర!
మధురిక జయతు జయతు మహారాజ!
రాముడు (జానకినిజూచి)
వత్స! ప్రమోదుపైబడు సుధావర్ష సదృశమగును జానకీదర్శనము—
లక్ష్మణుడు అవును దేవ! ఈ లతామండపమునందు నీ సుఖాస
నముల నాసీనులగుదు క్షణమ్ముదాక.
ఎటుల కాన్పించె మునివరా! ఈ జనకజ మీకు?
అగస్త్యుడు: వినుడు తెల్పెద పూర్వ మీవనాన తపము చేసెను
దుర్వాస తాపసుండు కొన్ని దినములు.
మధురిక అతి సులభకోపి యనుచు విందుమీ ముని
రాముడు: ఉపరి విన్పింపు దేవ!

అగస్త్యుడు ఆశ్రమములందు నియమిత ధ్యానబుధుల
తీవ్రతపమును శంకించి దేవవిభుఁడు
భంగమొనరింప దేవతా భామినులను
గామినులఁబంపె, హరిణి నాకాంతయతని
వనమునందునఁ జేరి పుష్పాలు చిదిమె.

రాముఁడు : ఘోరమగు ప్రమాదము కోరికొనెను హరిణి.

అగస్త్యుఁడు అపుడు దైవాభిషేకమై యరుగుదెంచి
కనుచుహరిణిని దుర్వాసముని మహోగ్ర
కోపమున "దేవతార్చన కుసుమములను
జిదిమితివి గాన నీ పేరఁ జెలఁగు మృగమ
వౌదువు హరిణి పోపొమ్మ" యని శపించి
యీ వనమ్మును విడి యెటకేని వెడలె.

మధురిక , అతినిష్ఠురు లీ తాపసు లనినమాట కాదువృథా

లక్ష్మణుఁడు · హరిణి యటనుండి లేడిగా నయ్యెనేమి ?

అగస్త్యుఁడు హరిణి లేడిగా మారిన నామె చెలులు
నన్నుగని ప్రార్థనలు సేయ నా మనస్సు
కరుణతో నిండ లేడిని హరిణిఁ జేయఁ
దలఁచి దర్భాంకురమ్ములఁ దనుపుచుండి
యపుడ యభిమంత్రణము సేయు హరిణియయ్యె.

రాముఁడు కారుచిచ్చులఁ గాలు కాంతారశోభ
నమ్ముల పునర్నవీకరణమ్ము సేయు
నఖిల జగముల కుపకారులైన ఘనుల
కది స్వభావగుణమ్మోట అబ్బురంబె?

అగస్త్యుఁడు ఆదినమునుండి యీనాటికైన నీ వ
నాన పూలుకోసిన నెవ్వరైన హరిణ
రూపమయ్యెడి శాపము మాపుకాక
యీ ప్రమాదము నిటస్పృశియించె సీత.

రాముఁడు ఇంతకాలము లేడిరూపేమిసీత?

అగస్త్యుడు ఆశ్రమమునందు నేకాకినైన నేను
జ్ఞానదృష్టిని నిటనట సంచరించు
హరిణి జానకిగా నిశ్చయమ్ముచేసి
క్షణములో శాపమును విమోచనమొనర్చి
అంతికమునకు దెచ్చితినయ్యా రామ !

రాముఁడు : పరహిత శీలత్వమును
పరదుఃఖా సహనబుద్ధి పరజనకరుణా
భరభావము, దాక్షిణ్యము
నరయ స్వభావములు సజ్జనావళి కెందున్

అగస్త్యుఁడు . నరులమహోగ్రపాపము లనంబడు చీకటు లెల్లఁద్రోలి, సుం
దరజగమెల్ల సంతసముదాల్పఁగఁజేసి, చిరమ్ము శారదా
స్ఫురదురు చంద్రికాధవళశోభల కీర్తివహించి జానకీ
వరసతి, తోడఁగూడి కడువర్ధిలుమా రఘురామ భూవరా!

రాముఁడు : మహాప్రసాదము భగవాన్

అగస్త్యుఁడు . ఏమిప్రియ మాచరింతు మీకింక వత్స!

రాముఁడు ఇంతకన్నను మనః ప్రియమేమికలదు?
మఘవు ప్రేరణమున మేఘమాలికాప్రవాసములై
సమయవిహితవర్ష సౌమ్యశాంత జీవనద్యుతులై
ఈవసుంధరా ప్రపూర్ణ హేమికళలు నిత్యములై
పాళులై సమృద్ధసస్యజాల కళాపూర్ణములై
ఆచంద్రార్కముగా భువిప్రాణికోటి చెలగుగాత!
పునర్జన్మ జలధిమధ్య మునుగు సజ్జనావళికై
తరణి రూపమగు సద్గతి ధరణియందే కలుగుగాత!

★

ఆభాసము - వాస్తవము

బెర్ట్రండ్ రసెల్

★

అనువాదం : జి ఎస్ ఎన్.

ప్రపంచమున నాలోచనాశక్తి గల యెట్టివాని కైనను సందేహము కలుగుటకు వీలులేని నిశ్చితజ్ఞానముగలదా? మొదట చూచుటకీ ప్రశ్నమంత కష్టమన్పింపదు కాని నిజముగా నడుగవలసిన యతి క్లిష్టమైన ప్రశ్నములలో నిదియొకటి దీనివిషయమున డొంకతిరుగుడులకుగాని పందియములకుగాని తావులేని సమాధానము చెప్పుట కనేక యవాంతరములు గలవు వీనిని గ్రహించినపుడేమనము లెస్సగా తత్వశాస్త్రాను శీలనమునకుపక్రమించగలము ఏలన తత్వశాస్త్రమనగా నట్టిచరమ ప్రశ్నములకు సమాధానము చెప్పుటకుజేయుయత్నములోకమునను ఒక్కొక్కప్పుడు ప్రకృతిశాస్త్రము లందును అట్టి ప్రశ్నములకు విచక్షణా రహితము గను, తర్కరహితముగను సమాధానమిచ్చుటగలదు. కాని తత్వశాస్త్రమున నట్లుగాదు. మరియట్టిప్రశ్నములను కలవరపరచునవిగ చేయు సర్వవిషయములను పరిశోధించి, మన సామాన్యభావములలో నున్న అస్పష్టతను, తికమకను గ్రహించిన పిమ్మటనే సమాధాన మీయబడును

దైనందిన జీవితమున, మనమనేక విషయములు నిక్కములని యెంతుము. కాని ఒకింత జాగ్రత్తగా పరిశీలించిన పిమ్మట నవి యనేక స్వవచోవ్యాఘాతములతో నిండియున్నట్లు తెలియనగును. అందుచే మనకు నిజముగ నేది నమ్ముటకు వీలుగలదో తెలుసుకొనగల్గుట కెంతయో యాలోచన యవసరము. కాని మనకు వెంటనే కలుగు ననుభవములు మనకెట్టి జ్ఞానము సమకూర్చునను విషయమై మనమేమి చెప్పినను అందు దోషముండుటకుతావుగలదు. ఇప్పుడు నేనొక ఆకారముగల బల్లకు దగ్గరగా కురిచీలో కూర్చున్నట్లును, దానిపై లిఖితాక్షరములుగాని ముద్రితాక్షరములు గాని పంక్తులు దీర్చియున్న పెద్దకాగితపు బొత్తులను చూచుచున్నట్లును నాకనిపించును. తల త్రిప్పగనే కిటికీ లోనుండి కట్టడములును, మబ్బులును, సూర్యమండలమును గన్పట్టును సూర్యమండలము, భూమికి తొంబదిమూడు మిలియన్ల మైళ్ళదూరమున గలదనియు, అది భూమికంటె ననేకరెట్లు పెద్దదైన యొకయుష్ణగోళమనియు, భూభ్రమణమువలనప్రతియుదయము నది యుదయమొందుననియు మున్ముందు అనంతకాలమువరకు నీ విధానము ఇట్లే సాగుచుండుననియు నా విశ్వాసము మరి యే ఇతర వ్యక్తియైన నా గదిలోకి వచ్చినచో, నేను చూచిన కురిచీలనే, బల్లలనే, పుస్తకములనే యాతడు జూచుననియు, నా చేతికి ఒత్తుచున్నట్లనిపించెడి బల్లయును, నేను కంటిద్వారము ననుభవ గోచరము చేసికొను బల్లయును ఒక్కటేయని నా విశ్వాసము దీనిని నిరూపించు నావశ్యకత యేమియులేనంత స్పష్టముగ నిది కన్పించును. అయినను హేతువాదము నూతగా గొని వీని నన్నింటిని శంకింప నవకాశముగలదు దానిని నిర్దుష్టమగు రూపములో వ్యక్తము చేయగలిగితిమని దృఢముగ విశ్వసించుటకు మున్ను, ఆ విషయమై జాగ్రత్తగ విచారణ యొనర్పవలయును

మన చిక్కుల నొకింత స్పష్టముచేయవలయుననిన బల్లపై మన మనస్సును లగ్నమొనరింపవలయును. కంటికి అది దీర్ఘచతురస్రాకారముతో గూడినదిగను గోధుమరంగుగలదిగను, మెరపుతో గూడినదిగను గోచరించును స్పర్శకది నున్నగా చల్లగా గట్టిగా నుండును నేను దానిని చేతితోగొట్టునపుడది కొయ్యచప్పుడునే వెలువరించును బల్లను కండ్లతోజూచి, చేతితోదడిమి చెవులతోవిను నెవ్వడైనను పైవర్ణనముతో నేకీభవించును కాని యొకింత నిర్దుష్టముగ జెప్ప బ్రయత్నించునపుడే చిక్కులు ప్రారంభమగును బల్లకంతకును నొకేరంగు గలదని నేను విశ్వసింతును. కాని వెలుతురును ప్రతిబింబించు భాగములు తక్కిన భాగము

కన్న చాల కాంతిమంతములుగ గన్పట్టును. కాంతి ప్రతిబింబిత మగుటచే కొన్నిభాగములు తెల్లగ గాన్పించును నేను కదలినచో, కాంతిని ప్రతిబింబించు భాగముపే వేర్వేరుగ నుండును తత్ఫలితముగ స్థూలదృష్టికి గోచరమగు బల్లపైని. వర్ణముల విభజనము మార్పునొందును

దీనినిబట్టి అనేక లేకకాలమున బల్లవైపు జూచుచున్నచో వారిలో నేయిర్వురును ఒకే వర్ణముల విభజనమును జూడరనియు, కారణమేమన ఏ యిర్వురును దానిని ఒకేదృక్పథము నుండి చూడజాలరనియు దృక్పథములో నేర్పడు ఎట్టి మార్పైనను వెలుగు ప్రతిబింబించు మార్గమున మార్పు కలుగుటకు కారణ మగుననియు తెల్లమైనది

అనేక లౌకిక ప్రయోజనములకీ భేదము లప్రధానములు కాని శిల్పికివి యత్యంతప్రధానములు లోకము, వస్తువులకు నిజముగా నున్నదని చెప్పెడిరంగే వానికున్నట్లు కన్పించుచున్నదని యనుకొను అలవాటును శిల్పి మాన్పుకొనవలయును అంతియేకాక తనకు కన్పించు తీరుగనే వస్తువులను జూచునలవాటు నాతడలవరచుకొనవలయును. ఇచట తత్త్వశాస్త్రంలో మిగుల క్లిష్టమైన భేదములను గూర్చిన వివేచనమొకటి యారంభ మగుచున్నది. ఇదియే - ఆభాసమునకును, వాస్తవమునకును-అనగా వస్తువులున్నట్లు కన్పించు తీరునకును-దాని యధార్ధ స్వరూపమునకును నడుమనున్న భేదమును గూర్చిన వివేచనము. శిల్పి వస్తువులు కన్పించు తీరుననే వానిని దెలిసికొనగోరును కాని తత్త్వశాస్త్రజ్ఞుడు వాని నున్నదున్నట్లు తెలిసికొనగోరును కాని తత్త్వశాస్త్రజ్ఞుని జిజ్ఞాస లౌకికుని జిజ్ఞాసకన్న బలీయమైనది ఆసమస్యకు సంబంధించిన చిక్కులను విడదీయుటకు వలయు జ్ఞానము కొఱకాతడు సతమత పడుచుండును

తిరిగి బల్లవిషయమై పర్యాలోచనలనుసల్పుదము మనమిప్పుడు గ్రహించిన దానినిబట్టి మొత్తముమీద బల్లకంతకునుగాని అందులో నొక భాగమునకుగాని ప్రత్యేకముగ చెందునట్లు కన్పించురంగేమియు లేదనియు, వేర్వేరుదృక్పథములనుబట్టి యది వేర్వేరు రీతులుగ గన్పించుననియు, వానిలో కొన్ని రంగులు మిగిలిన రంగులకన్న ఎక్కువ యధార్ధమైనవని చెప్పుటకేమియు నుపపత్తిలేదనియు తెల్లమైనది ఒక నిర్దిష్టదృక్పథమునుండి జూచినను కృత్రిమ కాంతివలన రంగు వేరుగ కన్పట్టును. రంగే తెలియనివానికిని నీలికండ్లజోడు పెట్టుకొనిన వానికిని వేర్వేరు రీతుల కన్పించును. చీకటిలో నసలురంగే యుండదు కానిస్పర్శజ్ఞానమును బట్టిజూచినను, శ్రవణమునుబట్టి పరీక్షించినను, బల్లయేమియు మార్పులేనిదిగ నుండును ఈ రంగు బల్లలో స్వతస్సిద్ధముగనున్నది కాదు. కాని బల్లయనగా - చూచువాడు దానిపై వెలుతురు ప్రసరించుమార్గముపై నాధారపడిన యొక పదార్థము

లోకమున బల్లకు ఒక రంగు ఉన్నదని చెప్పుచున్నా మనగా సామాన్య తేజః ప్రసార పరిస్థితుల ననుసరించి సామాన్య దృక్పథమును బట్టి యొక సామాన్య ప్రేక్షకునకు గోచరించు రంగువంటిదని యర్థము కాని తదితర పరిస్థితుల మూలమున గన్పించు తదితర వర్ణముల యధార్థ మనిపించుకొనుటకు సమానయోగ్యత గలిగి యున్నవి. కాన పక్షపాతబుద్ధి విడనాడి చెప్పవలెనన్న, బల్లకు ప్రత్యేకముగ నొకరంగు గలదని నిరూపింప వలను పడదు.

ఇదియే దాని నిర్మాణమైఖరికిని అన్వయించును. స్థూలదృష్టికది నున్నగా సమముగా గన్పట్టును. సూక్ష్మదర్శినితో దానిని జూచినచో, మనకనేక గఱుకుతనములు, నిమ్నోన్నతలు మానవ దృష్టికి గోచరముకాని సర్వవిధ భేదములు గోచరమగును. వీనిలో నేది యసలు బల్ల? సూక్ష్మదర్శినిద్వారా మనము చూచినదే యధార్థమైన బల్లయని సహజముగ మనకు చెప్పవలెననిపించును. కాని అంతకన్న శక్తిమంతమైన సూక్ష్మదర్శిని ద్వారా దానిని జూచినచో వెనుకటి సూక్ష్మదర్శినిద్వారా కల్గిన జ్ఞానమునకు గూడ మోసము గల్గును. మానవ దృష్టితో చూచినదానిని మనమునమ్మజాలనిచో సూక్ష్మదర్శినిద్వారా మనము చూచినదానిని మన మేల విశ్వసింపవలెను? కాని దేనిపై మనము

విశ్వాస మూనియుంటిమో, ఆ యింద్రియముల యందలి విశ్వాసము మనలను వీడుచున్నది. బల్ల ఆకారమునుగురించికూడ మన కింతకన్న నెక్కువ యేమియు తెలియదు మన కందర కును వస్తువుల యథార్థరూపమును గురించి యిదమిద్ధమని నిర్ణయించు సలవాటు గలదు మనము దేనిని నిజముగ జూచుచున్నామో అదియే దాని యథార్థమైన యాకారమని అనాలోచితమగు నిర్ణయము చేసికొందుము. కాని నిజముగ ఒక వస్తువు ప్రతిదృక్పథమునుండియు వేర్వేరుగ కన్పట్టును ఒకింత తెలిసికొన యత్నించినచో, నిదియంతయు మన కవగతమగును మనబల్ల నిజముగ దీర్ఘచతురస్రముగ నున్నచో అన్ని దృక్పథములనుండియు దానికి రెండు లఘుకోణములును, రెండు గురుకోణములున్నట్లును కన్పించును ఎదురుబొదురుగ నున్న భుజములు సమాంతరముగ నుండుచో ప్రేక్షకునినుండి దూరమున నొక బిందువునొద్ద కలసినట్లు కన్పించును. అవి సమానమైన పొడవును గలిగియున్నచో,దగ్గరగా నున్న భుజము మిగులపొడవైనదిగ గన్పట్టును ఇవిఅన్నియు బల్లను జూచునపుడు మనస్సునకు బట్టవు కారణమేమన, పైకి కన్పించు ఆకారమునుబట్టి నిజమైన యాకారమును అనుమితిద్వారా యూహించుట యెట్లో అనుభవముమనకు నేర్పినది. ఈ నిజమైన యాకారమే లౌకికులమగు మన కభిలాష గొల్పునది అది మనము చూచు దానిని బట్టి అనుమానముద్వారా యూహించునది మనము చూచునది మనము గదిచుట్టూ తిరుగు కొలది, యాకారమున మార్పుచెందును కావున నిచ్చటగూడ ఇంద్రియములు అసలు బల్లను గురించిన యథార్థ జ్ఞానమును సమకూర్చునట్లు గన్పట్టుటలేదు.

స్పర్శజ్ఞానమును గురించి మనము పర్యాలోచన చేయనపుడు ఇవేసందియములు బయలుదేరును బల్ల ఎల్లప్పుడు గట్టితనమనెడి జ్ఞానమును గల్గించుననుటయు,అదిపీడనమును ప్రతిఘటించునట్లు మన కన్పించుచున్న దనుటయు నిజమే కాని ఈవిషయముమనకు గలుగునింద్రియజ్ఞానము మనము బల్లను ఎంత గట్టిగా ఒత్తుచున్నామనుదానిపైనను,శరీరమునసేభాగముపై ఒత్తుచున్నామను దాని పైనను ఆధారపడియుండును కావున వివిధ పీడనములవలనను, శరీరమునందలివివిధావయవములవలన గలుగు వేర్వేరుఇంద్రియజ్ఞానములుబల్లకుసంబంధించిన ఎట్టినిర్దిష్టమైన లక్షణమును వెలువరించునట్లును కొనుటకు వీలులేదు కాని ఈయింద్రియజ్ఞానములకు కారణమై వానిలో నెందును కన్పింపని (గోచరింపని) ఒక లక్షణమునకు చిహ్నములని యంగీకరింపవచ్చును బల్లను గొట్టుటచే గలుగు ధ్వనివలన మనకెట్టి జ్ఞానము గల్గుచున్నదను విషయమునగూడ నిదియేయన్వయించును కావుననిజమైనబల్ల యనునది అట్టిదొకటి యున్నచో - మనము వెంటనే చూచుటవలన గాని స్పృశించుటవలనగాని వినుటవలనగాని మన కనుభూతమగు నదియును ఒక్కటిగాదని తెల్లమగుచున్నది అసలు బల్ల - అట్టిదొకటి యున్నచో వెంటనే మన కెఱుకపడునదిగాదు. మరి వెంటనే తెలిసినదానిని బట్టి యనుమితమగునది కాన రెండు విషమమైన ప్రశ్నములు వెంటనే బయలుదేరును అసలు బల్లయను నదేమైన గలదా? ఉండుటయే సంభవించుచో, నది యెట్టిదై యుండవలయును?

ఈ ప్రశ్నములను విచారించుటకు కొన్ని శబ్దముల యర్థములను పరిశీలింపవలయును. వీని యర్థము నిర్దిష్టమై యున్నది ఇంద్రియ గ్రహణమునందు వెంటనే జ్ఞాతమగువాని కింద్రియార్థములని నామకరణము సేయుదము. ఇది వెంటనే ఎఱుకలో తెచ్చుకొను ననుభవమునే మనమింద్రియ గ్రహణమని వ్యవహరింతము. కావున మనమొక రంగును జూచినపుడు రంగును గూర్చిన గ్రహణము మనకు గల్గును. కాని రంగుమాత్రము ఇంద్రియార్థము. మరి యింద్రియ గ్రహణముగాదు దేనినిగురించి మనకు వెంటనే ఎఱుక గలుగునో అదియే రంగు, ఈ ఎఱుకయే ఇంద్రియ గ్రహణము. బల్లను గురించి మనకేమైన తెలియవలయు ననిన, బల్లతో కలసి యున్నట్లు మనము భావించెడి గోధుమరంగు, దీర్ఘచతురస్రాకారము, నునుపువంటి ఇంద్రియార్థముల వల

ననే అట్టిజ్ఞానము సాధ్యపడుననుట స్పష్టము. కాని పూర్వోక్తములగు కారణములవలన బల్లయే ఇంద్రియార్థమని గాని లేక ఇంద్రియార్థములే బల్లకు సంబంధించిన సాక్షిల్లక్షణమని గాని చెప్పజాలము. కావున ఇంద్రియార్థమునకును-అసలు బల్లకును - అట్టిదొకటియున్నచో నడుమగల సంబంధమును గూర్చిన సమస్య బయలుదేరును.

నిజమైన బల్లను - అట్టిదొకటి యున్నచో మనము భౌతికవస్తువని వ్యవహరింతము సర్వభౌతిక వస్తుజాతమునుమనము ద్రవ్యమని వ్యవహరింతము కాన మన రెండుప్రశ్నముల నీరీతిగ నపరింపవచ్చును. ద్రవ్యమనునదియున్నదా! ఉన్నచో దాని స్వభావమేమి?

మన ఇంద్రియములకు వెనువెంటనే గ్రాహ్యమగు వస్తువులు మనకంటెవేరుగా లేవనుటకు ప్రధానముగ కారణములను సమకూర్చిన తత్వవేత్త బెర్క్లీ. హైలాస్‌కు, ఫిలానస్‌కు, జరిగిన యతని మూడు సంభాషణలు ద్రవ్యమనునది యసలు లేనేలేదనియు, ప్రపంచమనగా మనస్సులు, వాని భావములు తప్ప మరియేమియు కాదనియు నిరూపింప బూనుకొనును ఇంతవరకును హైలాస్ ద్రవ్యమొకటి యున్నదని నమ్మినాడు, కాని యతడు ఫిలానస్ కేమాత్రమును సరిపడు ఉజ్జీ కాడు అతడు ఫిలానస్ ననేక స్వవచో వ్యాఘాతములలోనికి దింపి, తాను నమ్మిన ద్రవ్యమును తానే నిరాకరించుట విజ్ఞతయేమో యని తన కనిపించునంత నిపుణముగ వాదించును ఇందుకుపయోగించినయుపపత్తు లొక్కతీరుగ లేవు కొన్ని ప్రముఖములును సమంజసములునై యున్నవి మరికొన్ని తికమక పెట్టునవిగను, పిడివాదముతో గూడినవిగను ఉన్నవి కాని బెర్క్లీ యెట్టియసంబద్ధ తయునులేక, ద్రవ్యాస్తిత్వమును నిరాకరింపవీలగుననియు, మనకంటె వేరుగ వస్తువులుండుట సంభవమైనను అవి వెంటనే మన ఇంద్రియములకు గ్రాహ్యములు కావనియును నిరూపించిన ఘనతను గడించినాడు.

ద్రవ్యమనునది యున్నదా యని మనమడిగినప్పుడు రెండు వేర్వేరు ప్రశ్నము లిమిడియున్నవి వానిని విశదీకరించుట చాలయవసరము ద్రవ్యమనగానే మనస్సునకు విరుద్ధమై ఎట్టియాలోచనమునకుగాని చైతన్యమునకుగాని యవకాశము లేక యొక పరిమితమగు ప్రదేశమునావరించి యున్నట్లు మనము భావించెడి యొక పదార్థమని మనము సామాన్యముగా ననుకొందుము

ముఖ్యముగా నీయర్థములోనే బెర్క్లీ ద్రవ్యము కాదనును అనగా మనము బల్ల ఉనికికి చిహ్నములుగ భావించెడి యింద్రియార్థములు, మనకంటె వేరుగానున్న ఒకానొక పదార్థపు టునికి నిజముగా చిహ్నములన్న విషయము నాతడు కాదనడు కాని ఈ యేదోఒక పదార్థము అమానసమను విషయమును, అది మనస్సుగాని మనోగోచరమగు భావములు గాని కాదన్న విషయము నాతడు నిరాకరించును. మనము గదివెలుపలకు వెడలునపుడు, కన్నులను మూసికొనునపుడు, ఉనికిలో నెట్టి విచ్ఛేదములేని పదార్థ మొకటి యుండవలెననియు, మనము బల్లయని వ్యవహరించెడి యీ పదార్థము మనము దానిని చూచుచుండనపుడుగూడ నెట్టి విచ్ఛేదములేక యుండు పదార్థ మొకటి యున్నదని మనము నమ్ముటకు తగిన యుపపత్తిని సమకూర్చుననియు ఆతడు అంగీకరించును కాని ఈ పదార్థము మనము చూచుదాని నుండి స్వభావతః విభిన్నమైనది గాదనియు మన చూపుకది యతిరిక్తముగా నున్నను, పూర్తిగా మనుష్యుల చూపుకే అది యతిరిక్తముగా నుండవలెననుట పొసగదు దీనినిబట్టి యాతడు అసలైన బల్లను భగవంతుని మనస్సులోని భావమని యనుకొనవలసి వచ్చినది. అట్టి భావము నొకదాని నంగీకరింపవలయుననిన దానికి మన కతిరిక్తమైన యునికి యుండుటయే గాక యాపదార్థమునకు స్థిరత్వముగూడ నుండవలయును కానివిషయమింకొక తీరుగ నుండగా నది యనుమితి సిద్ధము. వెంటనే సూటిగ మన ఇంద్రియగ్రహణమున తేటపడున

దిగాద నుసర్ధములో నట్టి పదార్థమువిజ్ఞేయమై యుండరాదు

బెర్క్లీ కాలమునుండియు, తదితర తత్త్వవేత్తలు బల్లఉనికికి నాచే దృష్టమగుటపై నాధారపడి యుండదనుట నిజమైనను అది మరియొక మనస్సునకు గోచరమగుటకై దాని యునికి యాధారపడి యున్నదనియు అది కేవలము భగవంతునిమనస్సే కానక్కరలేదనియు కాని ప్రపంచమునకు సంబంధించిన సమష్టి మనస్సుకై దాని యునికి ఎక్కువగా నాధారపడి యున్నదనియు వాదించిరి. బెర్క్లీవలెనే వారట్లు వాదించుటకు కొక కారణముగలదు, మనస్సులు, వానిభావములు, హృదయానుభవములు తప్ప మరేవియు యధార్థము కావని భావించుటయే దీనికి కారణము వారి దృక్పథము నీరీతిగ నుపపాదింపవచ్చును. ఆలోచనకందునేదియైనను, దానిని గూర్చి ఆలోచించు వ్యక్తి మనస్సులోని భావమై యుండును కావున మనస్సులోనున్న భావమునుదప్ప మరి దేనిని గురించియు ఆలోచింప వీలులేదు తదితరమైనదెల్ల ఊహకు అందరానిది. కాన ఊహకు అందని దేదియైన నుండుటకు వీలులేదు

నాయభిప్రాయమున, నట్టివాదము హేత్వాభాసముతో గూడియున్నది. దానిని నవలంబించువారుగూడ దానినింత సంగ్రహముగను, నగ్నముగను ప్రతిపాదింపరు సమంజసమైనను కాకున్నను, ఏదోయొక రూపములో నీవాద మనేకచోట్ల నుపపాదింపబడుచున్నది. అట్టి తత్త్వవేత్తలనే విజ్ఞానవాదులనియందురు ద్రవ్యమును వివరింపబూనుకొను నప్పుడు వారు బెర్క్లీవలె, ద్రవ్యమనగా వాస్తవమునకు భావసంఘాతము దప్ప మరేదియు గాదనియో లేక లీబ్నిజ్‌వలె ద్రవ్యరూపములో కన్పించునదెల్ల నిజముగా కొన్నిమూలభూతములైన మనస్సుల సమాహారమనియో యందురు.

కాని ఈ తత్త్వవేత్తలు మనసునకు విరుద్ధమగు ద్రవ్య మొకటి కలదన్న విషయము నంగీకరింపకపోయినను ఇంకొక యర్థములో ద్రవ్యము నంగీకరింతురు. మనము రెండుప్రశ్నల నడిగితిమని జ్ఞప్తి యుంచుకొన వలెను. అసలు బల్లయనునది ఏమైన గలదా? ఉన్నచో దానిస్వభావమేమెయుండును? ఇందుకు సమాధానముగబెర్క్లీ, లీబ్నిజ్లిరువురున్నుబల్లయొక్కటి గలదని యంగీకరింతురు కాని బెర్క్లీ అది భగవంతుని మనస్సులోని కొన్ని భావములని చెప్పును లీబ్నిజ్ - అది మనస్సమాహారమని చెప్పును కాబట్టి ఇద్దరును మనమొదటి ప్రశ్నమున కనుకూలమైన సమాధానము నిత్తురు. కాని రెండవ ప్రశ్నమునకు వారిచ్చు సమాధానము సామాన్యమానవుని యభిప్రాయముల నుండి విశేషముగ భేదించును. వాస్తవముగ, తత్త్వవేత్తలందరును అసలు బల్లయొకటి యున్నదని యంగీకరించినట్లు గన్పింతురు. రంగు, రూపు నునుపు, వంటి యింద్రియార్థములు మనపై నెంత యాధారపడి యున్నను అవి మనకు గోచరమగుట యనునది మనము నిజమైనబల్ల కనుగుణమగు సంబంధమున నున్నపుడెల్ల నీయింద్రియార్థములకు కారణభూతమైనదిగ భావింపబడెడి యొక పదార్థమునకు చిహ్నమని వారెల్లరు నంగీకరించినట్లు కన్పింతురు

తత్త్వవేత్తలకు నంగీకారము కుదిరిన యీ యంశము - నిజమైనబల్లయొకటి గలదను నంశము - దానిస్వభావ మెట్లున్నను - చాలముఖ్యమైనది బల్ల స్వభావమును గురించిన రెండవ ప్రశ్నమును విచారించుటకు పూర్వము-ఈయభిప్రాయము నంగీకరించుటకు గల కారణములను పర్యాలోచించుట యవసరము

కావున మన రెండవయధ్యాయమున నిజమైన బల్లయొకటి గలదని యంగీకరించుటకు గల హేతువులు ప్రతిపాదింపబడును

ఒకింత ముందుకు పోకపూర్వము, మనమింతవరకు తెలిసికొనినదేమో విచారించుట మంచిది ఇంద్రియ గ్రాహ్యములని భావింపబడెడి తెగకు చెందిన ఏ సామాన్యవస్తువును గూర్చి విచారణము చేసినను, ఇంద్రియములు మనకు వెనువెంటనే తెలుపునది మనకంటె వేరుగానున్న వస్తువును గూర్చిన సత్యముగాదనియు, మనకు దెలిసినంతవరకు మనకును, వస్తువునకును నడుమగల సంబంధముపై నాధా

రపడియుండెడి కొన్ని యింద్రియార్థములను గూర్చిన సత్యమేయనియు తెల్లమైనది కావున మనకంటికి గోచరమగు నదియును, మన స్పర్శకు జ్ఞాతమగునదియును కేవలమాభాసము దీని కధిష్ఠానముగ వాస్తవమైన దొకటి యుండవలయును. కాని వాస్తవమైనది కన్పించునది కానిచో అసలు వాస్తవమైనది కలదా? ఉన్నచో దానిని తెలిసికొనుటకు సాధన మేమైనగలదా? ఉన్నచోదానిస్వభావమేమో తెలిసికొనుమార్గము గలదా? ఇట్టిప్రశ్నములుదిగ్భ్రాంతి గొల్పునవిగ నుండును అత్యద్భుతమైన ఊహలుగూడ యధార్థముకావని తెలిసికొనుట కష్టము కావున మనలో కొలదిగ ఊహలు ప్రేరేచిన బల్లఅద్భుతావకాశముఃతో నిండిన పెద్ద సమస్యగా పరిణమించినది. దానినిగురించి మనకు తెలిసిన దొక్కటి. కన్పించునదిమాత్ర మసలు వస్తువు కాదని ఇంతకంటె నెట్టి యూహాగానములు సేయుటకై మనకు సర్వస్వాతంత్ర్యముగలదు లీబ్నిజ్ అదిమనస్సమాహారమనిచెప్పును బెర్క్లీ అది భగవంతుని మనస్సులోని భావమనిచెప్పును ప్రకృతిశాస్త్రము ఇంతకన్న గంభీరముగ నది తీవ్రసంచలనములతో గూడిన విద్యుదాఘాతము లవిస్తారసంఘాతమని చెప్పినవి

ఈ యద్భుతావకాశములలో అసలు బల్లయే హుళక్కి యగునేమో యను శంకమిగిలియే యుండును. మనమనుకొనిన ప్రశ్న లన్నిటికిని సమాధానము రాకపోయినను, ప్రపంచాభిలాషనినుమడింపజేసి, దైనందిన జీవితమునందలి సామాన్యవస్తువుల మాటుననున్న యద్భుతత్వమును వ్యక్తపరచు ప్రశ్నముల నడుగగల్గిన శక్తి తత్వశాస్త్రమునకు గలదు

★

దేవీ ప్రణవ శ్లోక స్తుతి

★

చేటీభవన్నిఖిల ఖేటీకదంబవన వాటీషునాకపటలీ
కోటీరచారుతర కోటీమణీకిరణ కోటీకరంబితపదా
పాటీరగంధికుచ శాటీకవిత్వపరి పాటీమగాధిపసుతా
ఘోటీకులాదధిక ధాటీముదారముఖ వీటీరసేన తనుతామ్

ద్వైపాయన ప్రభృతి శాపాయుధత్రిదివ సోపానధూళి చరణా
పాపాపహస్వమను జాపానలీనజన తాపాపనోదనిపుణా
నీపాలయాసురభి ధూపాలకాదురిత కూపాదుదంచయతుమాం
రూపాధికాశిఖరి భూపాలవంశమణి దీపాయితాభగవతీ

యాళీభిరాత్తతను లాలీలసత్ప్రియక పాళీషుఖేలతిభవ
వ్యాళీనకుల్యసిత చూళీభగాచరణ ధూళీలసన్మునిగణా
పాళీభృతిశ్రవసి తాళీదళంవహతి యాళీకశోభతిలకా
సాళీకరోతుమమ కాళీమనఃస్వపద నాళీకసేవనవిధౌ

విశ్వనాథ మధ్యాక్కఱలు

మున్నంగి శతకము

శ్రీ విశ్వనాథ సత్యనారాయణ

ప్రకటమగా నీ నిద్రలోన నొక సుఖ స్వప్నంబు వచ్చి
యొక కాళిదాసు కావ్యంబు వోలెనో యొక త్యాగరాజ
సుకృతి కృతిం బోలెనో తద్భ్రాంతి స్ఫురియించు చుండు
వికృతి వికృతి కాని యట్లు మున్నంగి వేణు గోపాల!

అల తటాకములకు నొక్కచో సాగ రాభిధల్ కలిమి
వలె నొక్కఁ డొక్కఁడు మధ్య మధ్య గోపాల తా నీవె
యిలకు వచ్చితి నంచు నాడు నిద్రలో నెవ్వఁడో నడక
వెలయించుకొను వ్యాధి వోలె మున్నంగి వేణు గోపాల!

ఇన్ని విధాలుగా నిదుర కవధి లేనేలేద యనగ
తిన్నగా మేల్కను వేళ కేదియో తెచ్చి పెట్టెదవు
మిన్నును మన్నును గలిపి పాలించు మేలు చూపెదవు
పిన్నగాఁ దోచు జాగ్రత్త మున్నంగి వేణు గోపాల!

అర నిద్ర పావు నిద్రంబుగ మేలుకో వద్దు రయ్యా నా స్వామి
తెఱచిన కనులుగా మత్తు వదలిన దేహంబు గాక
వరలిన జాగ్రత్త పడగ విప్పిన పాముగా నెల్ల
వెఱపటి మేలుకో వయ్య మున్నంగి వేణు గోపాల!

తల మీఁది నెమ్మి పింఛియును సురగంగ తరగల తనుకు
కలితమగా పిల్లనగ్రోవి పేడిన ఖట్వాంగ శకలి
గళ ముందు రత్న హారములు పాఁకెడు గండు సర్పములు
విలసిల్ల మేలుకో వయ్య మున్నంగి వేణు గోపాల!

నీవు మేల్కొన్న బోవు చుంటి వన్న చిన్నెలు చాల కలవు
నీ వెంత దొంగవో చెప్పలేన చిన్నెలు మానివేసి
నీవు మాగు నిదురకుం బడను వచ్చు నిన్నప్డుఁ నెత్తుఁ
పీవగా గిల్లగా వలయు .మున్నంగి వేణు గోపాల!

వెడ కల్లు త్రావుచు నడి సముద్రాల వెడ మాట నేర్చి
వడి సోమరసముపైఁ బ్రాంత చదువులపైఁ బగ గొన్న
బడుగు రక్కసి తేని చేప మొగ మోడపైఁ నేగి తునిమి
విడిపించి తంకిలి త్రయికి మున్నంగి వేణు గోపాల!

తమ తమ సాహిత్యములయు నుత్తమత్వములు చర్చించు
నమరుల నమరారులయును జర్చా సభాధ్యక్ష్య మూని
యమరంగ వీపున యందు నమృత మన్నట్టి రసంబు
విమలంబు నిర్ణయించితివి మున్నంగి వేణు గోపాల!

చెప్పగా రా నంత ధనము గుట్టలు చేర్చి దేశాల
కప్పా లప్పాలు వెట్టి చాపచుట్టగా నవని ధరించి
యప్పులు రాక వనాళిఁ దిరిగెడు నసురను పంది
విప్పిన కోఱగాఁ దునిమి మున్నంగి వేణు గోపాల!

అనుభవించడు, భార్య కీయ డాత్మజు డన్నది కాదు,
ధనము బిందెలు నిండ నింపి సైన్యముల్ దండయాత్రలును
మనిసి కాడు పశువు కాదు తన సభామంటప స్తంభ
వినిపాత మయ్యె నృసింహ మున్నంగి వేణు గోపాల!

పర లోకములు లేవు సంఘ మర్యాద పాటింపె కలదు
ధరణి మానవ సేవ మించి ధర్మమ్ము దైవమ్ము లేదు
మఱుగుజ్జువా డేమి బాగుపడు నేల మట్టమై పోయి
విరచిత వామనాకార! మున్నంగి వేణు గోపాల!

ఇట్టి తా నధికార మున్న దంచు నే యితరుల సొమ్ము
లట్టె కోరిక మాత్ర వచ్చి పడవలె న్యాయమ్ము లేదు
మిట్టి పాటున కంతు పంతు లేదఁయె మీఁది గొడ్డంటి
పెట్టుగాఁ ద్రుంచెదు వారి మున్నంగి వేణు గోపాల!

పది విధాలుగ వెట్టి తలలు వేసి యధర్మంబు పెరుగ
పొదివి పుచ్చిన మేర చెక్కి సరిచేసి భూ భాగ మెల్ల
నదుపు లోనికి తెచ్చి నావు మానవం బైన ధర్మంబు
విదితంబుగా రఘువీర మున్నంగి వేణు గోపాల!

పని తౌషధ క్రియా సుష్ఠు వినిమయ వ్యవహార భూమి
ఖన నాత్త ధనరాశి యుద్ధ పరిహార ఘటన, దుష్ప్రాపి
జన సంఖ్య పెరుగగా సాధు హాలవృత్తి చండాహవముల
బెంచిచి త్రుంచితి భూమి ప్రజల మున్నంగి వేణు గోపాల!

ఆస్తికత్వము నాస్తికత్వము భయమ్ము నది యుష్మదీయ
మొత్తు! నాస్తికత యొక్కఁష్టు నీ వేలా హెచ్చరించెదవు
నిస్తులంబుగ నంత హెచ్చరించవు నీవు సిద్ధార్థ
విస్తు పోవుచు నుంటి మేము మున్నంగి వేణు గోపాల!

ఎప్పుడో యొక నాడు నీవు గుఱ్ఱమ్ము నెక్కి వచ్చెదవు
నప్ప! చేతను గత్తి బూని యపుడు మా యాయుధ శ్రేణి
చప్పబడి మహాణు వహ్ను లన్నియుఁ జల్లనో నేమి
విప్పి చెప్పఁ గదయ్య సామి మున్నంగి వేణు గోపాల!

మేలుకో నా స్వామి క్రింది నుంచి యా మీఁదికి నీ సు
ధా లాస్య శైవాలి నీ కథం జెప్పెదను కృష్ణదేవ
కాలి వ్రే లాడింపఁ బండుకొన నాడు కాంతార వీధి
వ్రేలఁ గొట్టెఁ గిరాత్కరాజు మున్నంగి వేణు గోపాల!

ఆ నాడు నీ రాక సరసి నంత బ్రహ్మానంద మయ్యె
మా నాథ వైకుంఠ నగరిలోన బ్రహ్మర్షి సంతతికి
మానసం బున్నచో నుంతి వెన్కకు మరలి కన్గొనుము
వేణువు శరమయ్యెఁ గాల మున్నంగి వేణు గోపాల!

దారుమయ ప్రబంధమ్ము సర్వమ్ము ద్వారకా నాథ
దారుక సారథి! నాటి యుష్మత్కథా వీధి యెల్ల
డారు విచిత్ర గర్భమ్ము సాంబుండు తాల్చి యా ఱెల్లు
వీర విహారమ్ము సాగె మున్నంగి వేణు గోపాల!

ఓయి ఫల్గున సారథీ మహోగ్ర యుద్ధోర్వి లోనన్ గ
దాయుత పాణివి దారు వది కాదె చక్రాయుధా! ప్ర
థాయోగ్య మగు సుదర్శనము నడ్డయు దారువా యేమి
వేయి యంచుల కైదు వయ్యె మున్నంగి వేణు గోపాల!

ఔర! నీ శృంగార రసమయం బన్న యీ వనం బెల్ల
పారిజాత కథాశ్రయమ్ము దారువు పారిజాతమ్ము
దారువ నీ కథ జ్ఞాపకం బున్నదా జగన్నాథ
వేరు చేయకు మయ్యా నన్ను మున్నంగి వేణు గోపాల!

పుట్టి నప్పుడె నిన్నుఁ గొయ్య పెట్టెలోఁ బూంచి మీ యయ్య
గట్టెక్కెఁ గాళిందిఁ జేరి యా రాత్రి కంసునిమొఱగి
అట్టె యై దేడులు వచ్చె నో లేదొ యంతలోఁ బెదవి
పెట్టితి వీ కొయ్యముక్కఁ మున్నంగి వేణు గోపాల!

ఇద్ది యెందుకు చెప్పుచుంటి నన దారు వేను నటంచు
సుద్ది కల్పించి చెప్పుటకు బెజ్జాలు చూడుము పట్టి
మొద్దు బారుట చూడు మింత యూపిరి పోసిన నూదు
విద్దియల్ చూడుము కృష్ణ! మున్నంగి వేణు గోపాల!

ఇహ గత వైయర్థ్య మెంత తెలిసిన నేమి, కోరికలు
సహజ మై నట్టు కన్పడెడుఁ బరిహరించగ నెప్డు వలసి
ముహు రర్పితమ్ము నీ ముగ్ధ మోహన మూర్తి ఫాలమున
విహరించ దాయె నో కృష్ణ మున్నంగి వేణు గోపాల!

జన్మ లింకెన్ని నా చేత నెత్తింప సంకల్ప మయ్య
జన్మ లెన్నైన నా కేమి వైరాగ్య సంపద తోడ
మన్మనో విహరణ మీవు వదలకు మదన గోపాల
విన్మ నా యీ మాట యొకటి మున్నంగి వేణు గోపాల!

శివునకు నీకును నేను భేదమ్ము సేయన యేని
నవురుగా మీ రిద్ద ఱొక్కఁడే బ్రహ్మ చైతన్య మేని
అవుర! వేదాంతముల్ నిజము లేని న న్నది పొందుఁగాక
వివరమ్ము తెలిసిన నన్ను మున్నంగి వేణు గోపాల!

(శ్రీ) పయోధర సిక్త పులక సస్యకాద్రి క్షేత్రపాల
దీపి తాధ్యాత్మిక వృత్తి సుర లతా దీప్తాలవాల
సౌపర్వ నిర్ఝరిణీ ప్రసన్నాంబు జని పాద మూల
ధీ పరివాహ నిర్మల మున్నంగి వేణు గోపాల!

కమ్యూనిజము - సోషలిజము

మహాత్మ గాంధీ

★

విజయము సాధించుటకు దౌర్జన్యపూరితములైన, అడ్డదారులపై నాకు నమ్మకములేదు ఉత్తమాశయములపట్ల నాకెంత సానుభూతియున్నను, అభిమానమున్నను, ఉత్తమోత్తమ ప్రయోజనసాధనకైనను, దౌర్జన్యపద్ధతుల నవలంబించు విషయములకు నేను నిశ్చయముగా వ్యతిరేకిని కనుక దౌర్జన్యవాదమునకును, నాకును కలయికయేలేదు. కాని నా అహింసావాదము, అరాజకవాదులతోను, తక్కిన హింసాపరులతోను సంప్రతించుటకే గాక కలియుటకుగూడ నన్ను పురిగొల్పును అట్లు కలియుట వారు చేయు తప్పిదమునుండి వారిని మరల్చుటకొరకే! అసత్యహింసలనుండి, శాశ్వతమైన శుభమేదియు గలుగజాలదని, నా అనుభవమే నాకువిశ్వాసము గలిగించుచున్నది నా నమ్మకము ఒకవేళ భ్రమయేయైనను అది మనోహరమైన భ్రాంతియని, యంగీకరింపవచ్చును

బోల్షివిజము యొక్క అర్థమేమో నేనింతవరకు పూర్తిగా తెలిసికొనజాలకుంటినని యంగీకరింతును అది వ్యక్తిగతమైన, ఆస్తిపద్ధతిని నిర్మూలించుట లక్ష్యముగా కలదియని మాత్రమే నాకు తెలియును మరుసటినాటి కేమియును, దాచుకొనరాదను ధర్మ సూత్రమును ఆర్థికరంగమున నమలుపరచుటయే ఇది ! ప్రజలీయాశయమును, తమంత తామే యనుసరించినను, ప్రజలచే శాంతియుత ప్రబోధము మూలమున దీనిననుసరింపజేసినను, ఇందులో విప్రతిపత్తిలేదు. బోల్షివిజమును గురించి నాకు తెలిసినంతలో, వ్యక్తిగతమైన యాస్తిని, తీసికొనుటకును, దానిని ప్రభుత్వాధీనమున నుంచుకొనుటకును, దౌర్జన్యవిధానమును బోల్షివిజము సమ్మతించును. ఇదేనిజమైనచో, ఈనాడున్న బోల్షివిక్ పరిపాలన యిట్లెంతో కాలము, మనజాలదని, నేను నిస్సంకోచముగా చెప్పగలను దౌర్జన్యముపై నాధారపడినదేదియు శాశ్వతము కాజాలదని నాదృఢవిశ్వాసము. యేది యెట్లున్నను, దానికొరకు తమ సర్వస్వము, ధారవోసిన, యనేక స్త్రీ పురుషుల పవిత్రమైన త్యాగము, ఆ ఆశయమునకండగా నున్నదనుటలో సందేహము లేదు.

లెనిన్‌వంటి మహాత్ముల త్యాగమూలమైన యాశయము వ్యర్థము కాజాలదు. వారి ఉత్తమ త్యాగాదర్శము చిరకాలము వెలుగొంది, కాలము గడచినకొలది యా మహదాశయ సాధనమును త్వరితమొనర్చి, పవిత్రముగా నొనర్చినది.

విచారించి చూడగా చివరకు కమ్యూనిజమనగా నర్థమేమి? దాని లక్ష్యము వర్గరహితసమాజము ఇది సాధింపదగిన యాశయము. కాని, యీ యాశయ సాధనకు దౌర్జన్యముపయోగించు పట్ల మాత్రమే నేనుసహకరింపను. సృష్టియందు మన మందరము సమానులముగనే పుట్టినాము. కాని మనమిన్ని శతాబ్దులుగా భగవదిచ్ఛను ప్రతిఘటించుచు వచ్చితిమి. ఎక్కువ తక్కువలు, అసమానత అన్న

భావమే తప్పు. కాని, యొకదోషమును మానవ హృదయమునుండి, కత్తిచూపి, బెదరించి తొలగించగలమని నేను నమ్మను. ఆ పద్ధతికి మానవహృదయము లొంగునది కాదు.

పారిశ్రామికాభివృద్ధి పొందిన, రష్యా దేశమును చూచినప్పుడు, అచ్చటి జీవితము నాకు నచ్చుటలేదు. బైబిలు భాషలో చెప్పవలెనంటే .. "ప్రపంచము నంతటిని జయించినను, ఆత్మను కోల్పోయినప్పుడు మానవునకు దాని వలన లాభమేమి?" మన మాటలతో చెప్పినచో వ్యక్తిత్వము వదలుకొని, తానొక యంత్రములో చీలయగుట మానవమర్యాదకే లోపము. ప్రతి వ్యక్తియు పూర్తి జవసత్వములతో సంపూర్ణాభివృద్ధి గలిగిన సభ్యుడుగా సమాజమున నుండవలెననినా కోరిక. రష్యా రకపు, కమ్యూనిజము బలాత్కారముగా, ప్రజలపై రుద్దబడినది అట్టిది భారతదేశమునకు జుగుప్సాకరము కాగలదు దౌర్జన్యమేమియు లేకుండ, కమ్యూనిజము వచ్చినచో దానికి సుస్వాగతము అప్పుడు ప్రజలతరపున, ప్రజలకొరకుగాక యెవ్వని యధీనమందును, సంపదయుండదు ఒక కోటీశ్వరుని యొద్ద కోట్లుండ వచ్చును. కాని, వానిని ప్రజల కొరకే యాతడు తనకడ నుంచుకొనును. ప్రజా ప్రయోజనము కొరకు అవసరమైనప్పుడు ఆ ధనమును ప్రభుత్వము తీసికొన వచ్చును.

పెట్టుబడిదారులు తమ పెట్టుబడిని, దుర్వినియోగ మొనర్చుచున్నారని కనుగొనుటవలన సోషలిజము రాలేదు. నేను పూర్వమే చెప్పినట్లుగా సోషలిజమేగాదు, కమ్యూనిజము గూడ ఈశోపనిషత్తు నందలి ప్రథమశ్లోకమున స్పష్టముగా నున్నది హృదయపరిణామము కల్గించు పద్ధతిపై విశ్వాసమును కోల్పోయిన, కొందరు సంస్కర్తలు ఈ శాస్త్రీయమైన సోషలిజ మనుదానిని కల్పించిరనుట నిజము ఈ శాస్త్రీయ సామ్యవాదుల నెదుర్కొను సమస్యలను పరిష్కరించుట యందే నేనునునిమగ్నుడనై యున్నాను. కాని సర్వదా స్వచ్ఛమైన అహింసా మార్గమున మాత్రమే నాపరిష్కారపద్ధతి యుండుట తథ్యము

"ఈ భూమియంతయు గోపాలునిది దీనికి సరిహద్దెక్కడ? ఆ సరిహద్దును గీచినది మానవుడు కనుక నాతడే చెరపి వేయగలడు" అని చెప్పిన మనపూర్వుల యొక్క సంప్రదాయమునందే మనకు సోషలిజము వచ్చినది. గోపాలుడనగా, పసులకాపరియనియు, భగవంతుడనియు నర్థము. ఈనాటిమాటలలో ప్రభుత్వమని అనగా ప్రజలనియర్థము ఈనాడు భూమి ప్రజలందరకు చెందియుండని మాట సత్యము కాని ఆ దోషము మన ధర్మమునలేదు ఆ ధర్మము ననుసరింపని మన యందే యున్నది రష్యాతో సహా మరి యేజాతికి గాని యీ సమస్యా పరిష్కారము ఎంత సుసాధ్యమో, అంత సుసాధ్యముగా మనము దౌర్జన్యరహితముగ జేయగలము దౌర్జన్యయుతముగ అందరి యాస్తులు తీసివేయుటకంటె మన ధర్మ పద్ధతి మిక్కిలియుపయుక్తమైనది భూమి యునుఆస్తియును ఎవ్వడుకృషిచేయునో వానిది దురదృష్టవశమున, ఆయా కృషి చేయువారు ఈ సత్యమును తెలిసికొన జాలని స్థితియందుంచబడి యున్నారు.

మనదేశమున సోషలిజమని బల్లగ్రుద్ది చెప్పువారికంటె చాల కాలము పూర్వమే నేను సోషలిస్టునని చెప్పుకొని యుంటిని. కాని నా సోషలిజము నాకు సహజమైనది అది యేపుస్తకములనుండి సంగ్రహించినది కాదు. ఎవ్వరైనను కార్యనిరతుడగు నహింసావాది సాంఘికమైన యన్యాయమెచ్చట జరిగినను దానిని ప్రతిఘటింపక యుండజాలడు. కాని నాకు తెలిసినంతవరకు, సోషలిస్టు సిద్ధాంతము నములు పరచుటయందు దౌర్జన్య మావశ్యకమని పాశ్చాత్యసామ్యవాదులు విశ్వసించియుండుట దురదృష్టకరము.

దౌర్జన్యమువలన అనాధులకు, అధఃపతితులకు సాంఘికన్యాయము సమకూరుట అసాధ్యమని సర్వదా నా విశ్వాసము వారనుభవించుచుండిన కష్టములు తొలగవలెనన్నచో నందుకు వారు అహింసా మార్గమున సుశిక్షితులగుట చేతనే, అది సాధ్యమనికూడ నా నమ్మకము శాంతియుతమైన సహాయ నిరాకరణమని దీని యర్థము.

తాను గౌరవముగా జీవించుటకు అవసరమగుదానికంటె నెవనికి గాని యెక్కువ భూమి యుండగూడదు. ఇప్పుడు తమదని చెప్పుకోదగిన భూమి యేమియు లేకుండుటవల్లనే యీ కోట్లాది జనులకు దుర్భరదారిద్ర్య మేర్పడినదన్న సత్యము నెవ్వడు కాదనగలడు? కాని ఈ సంస్కరణము తొందరపడి సాధించుటకు వీలుకానిది దీనిని అహింసామార్గమున తేవలెనన్నచో, అది కలవారికిని లేనివారికిని తగు విజ్ఞానము కల్గించుటవల్లనే సాధ్యమగును. ఈ లక్ష్యసాధన జరుగుటకు నేను చెప్పిన విజ్ఞానము నిప్పటినుండియే బోధింపవలయును. పరస్పర గౌరవవిశ్వాసములతో గూడిన వాతావరణమును దానికి ప్రాతిపదికగా నెలకొల్పవలెను అప్పుడు వర్గముల మధ్యగాని, ప్రజామధ్యగాని, హింసాపర సంఘర్షణ కలుగజాలదు

ఆర్థికశాస్త్రము - నీతిశాస్త్రము

ఆర్థికనీతిశాస్త్రములు నడుమ నేనెట్టి వ్యత్యాసమును గమనింపనని యంగీకరింతును ఒకవ్యక్తియొక్క గాని, జాతియొక్కగాని, నైతికస్థితికి హానిచేయు, ఆర్థికశాస్త్ర మవినీతి కరమైనది అందుచే పాపభూయిష్టమైనది కనుక నే ఒక దేశము మరియొక దేశమును దోచుకొని తినుటయను నర్థపద్ధతి అవి నీతికరమైనది చెమటోడ్చి యొకడుచేసిన వస్తువులను మరియొకడు కానివాడు కొనుట పాపము నీతిని ఇంగితమును తృణీకరించు నార్థికసూత్రములు పైకి ప్రాణమున్నట్లు కన్పించుచు లోన ప్రాణము లేని మైనపుబొమ్మల వంటివి ప్రతిక్లిష్టసమయమందును ఈ నూతనముగ కల్పింపబడిన ఆర్థికసూత్రములు ఆచరణయందు విఫలములైనవి అవే యాదర్శములుగా నంగీకరించు జాతులుగాని, వ్యక్తులుగాని, నశింపకతప్పదు

నీతివిలువలను తృణీకరించునట్టి లేక ఉపేక్షించునట్టి ఆర్థికశాస్త్రము అవాస్తవికమైనది అహింసామార్గమును ఆర్థికరంగమునందు విస్తరించుట యనగా అంతర్జాతీయ వాణిజ్యమునందు, నీతి విలువలను, నెలకొల్పుటకంటె నన్యము గాదు

మనజాతీయశక్తిని సంఘటిత పరుపవలెనని మనసంకల్పము అత్యుత్తమము

లైన ఉత్పత్తిపద్ధతుల నవలంబించుట వలన మాత్రమే యిది సాధ్యపడదు దీనికై అత్యుత్తమమ్ములైన ఉత్పత్తి వినిమయవిధానముల ననుసరింపవలయును

సమ వినిమయము నా లక్ష్యము కాని నాకు తోచినంతలో నది సాధ్యముగునట్లు లేదు కనుక నేనుఅందరకుజెందునట్లు వినిమయము జేయుటకై ప్రయత్నింతును

నాసృష్టిలో భారతీయార్థిక ప్రణాళిక ఆ మాటకు వచ్చినచో ప్రాపంచికార్థిక ప్రణాళిక యంతయు నెవ్వడుగాని తిండికి గుడ్డకు బాధపడకుండు నట్లుగా నుండవలెను. మరియొకవిధముగా జెప్పినచో, ప్రతివానికిని, తిండికి జరుగుటకు తగినంత పనియుండి తీరవలయును జీవితమునకు ముఖ్యావసరములైన, వస్తువుల నుత్పత్తి చేయు సాధనములు ప్రజలచేతిలో నున్నప్పుడే, సర్వత్ర ఈ ఆశయసాధనము సాధ్యము దైవమిచ్చిన గాలియు,నీరును ఎట్లున్నవో, లేక ఎట్లుండవలెనో, అట్లే ఈ ఉత్పత్తిసాధనములుగూడ, ఎల్లవారికి నందుబాటులో నుండవలెను అంతేకాని ఇది కొందరిచేతులలోనుండి తక్కినవారిని దోచుకొనుసాధనములు కాగూడదు ఈ ఉత్పత్తిసాధనములను, ఏదేశముగాని ఏ జాతిగాని, ఏకొందరు వ్యక్తులుగాని గుత్తగొనుట అన్యాయము ఈ మనదురదృష్టవంతమైన దేశముననేగాక ప్రపంచమునందలి, తక్కిన ప్రదేశములందు గూడ దిక్కులేనిదీనావస్థ గలుగుటకు కారణము ఈ మామూలు మర్యాదను పాటించక పోవుటయే. ★

కఠోపనిషత్తు

పండిత, శ్రీ జంధ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రి

★

ప్రథమాధ్యాయము

ద్వితీయ వల్లి

అని నచికేతుం డాడిన
మనమునఁ బ్రియమంది యముఁడు మరణాత్పర
మాత్మను గూర్చిన పరమార్థము
వినిచెన్ ఏ నిగూఢతత్త్వ వృత్తంబెల్లన్.

"శ్రేయమని ప్రేయమనియును రెండు గలవు,
అందు శ్రేయమ్ము సకల శుభాస్పదమ్ము,
ప్రేయమన్నది దవ్వు నిశ్రేయ సమున
కివి విభిన్న ప్రకృతు, లిది యెఱుఁగవలయు.

శ్రేయమును ప్రేయమును నరుఁ జెందుచుండు
రెంటఁగల భేదమును విచారించి మిగుల
బరిణతాత్ముఁడు శ్రేయముం బడయఁదలఁచు
నన్యుఁ డింద్రియ వశతఁ బ్రేయమ్ము గోరు

అప్సర స్త్రీలు పుత్రపౌత్రాది కామ్య
ములును వలవ నంటి వనిత్యములుగఁ దలఁచి
మూఢు లెట్లు సంసారాన మునిగిపోదు
రా ధనమయ మార్గంబొల్ల నంటి వీవు.

విద్యయు నవిద్యయు వేఱు వేఱుగాన
వేఱువేఱు ఫలమ్ముల వెలయ నిచ్చు
నీవు విద్యాభిలాషివి నిశ్చయముగ
కామములకు లోఁగాక, నిష్కామి వగుట.

అల నవిద్యా మయుండైన యట్టివాఁడు
తానె విజ్ఞుఁడ నన్న గర్వానఁ దగిలి
కుటిలుఁడై మూర్ఖుఁడై తిరుగుళ్ల వడును
గుడ్డి చేయిపట్టుకపోవు గ్రుడ్డివోలె

అజ్ఞునకు ధనార్థికి ప్రమాదాన్వితునకు
పరముఁబొందు సాధనమొండు నరయ రాద,
ఇదె సమస్తము పరలోక మేడ ననెడు
వాఁడె నాకడ కేతెంచు వాఁడు సుమ్ము

వినుటకైనఁ బల్వురకది వీలుగాదు,
వినిన మాత్ర నెఱుంగుటయును హుళక్కి,
నాత్మ నెఱిఁగించు వాఁడెర్గునట్టి వాడు,
గురువుచేఁ దెల్పఁబడియును గుదురు టరిది.

హీనుచేఁ దెల్పఁబడి చింత్యమానుఁడయ్యు
నాత్మ సులభుండు గాడు లో నరయుటకును,
ఆత్మదర్శి ప్రబోధింప నదియుఁ దెలియు
నణువు కంటెను నణు వూహ కందరాదు.

ఆత్మ తర్కంబుచేఁ దెలియంగరాదు,
అద్ది యద్వైత బుద్ధిచే నరయనగును,
నీదు బుద్ధి సత్యమునందు నిల్చె నిన్ను
వంటి పృచ్ఛకుఁడెపుడు లభ్యమగుఁ గాక.

కర్మఫలము ననత్యంబుగా నెఱుఁగుదు
నమృత పద మలభ్యం బనిత్యముల చేత,
అగ్నిచయనము నే ననిత్యముల వలనఁ
జేసి యీ నిత్యపదమును జెందినాఁడ.

కామ్యఫలముల ప్రాప్తి లోకంబు నునికి
బ్రహ్మలోకంబు నభయంబు పార మఖిల
సుఖములను నాత్మసంస్థితిఁ జూచిచూచి
ధైర్యమున వీనినెల్ల విదల్చినావు.

కానరాని వాని, మఱుంగు గల్గువాని
బుద్ధిగుహ వసించెడువాని పూర్వతముని,
గహ్వరస్థు నధ్యాత్మ యోగమునఁ దెలిసి
పండితుఁడు శోకహర్షముల్ వాసియుండు.

అనిన నిట్లని నచికేతుఁ డడిగె యమునిఁ
"కార్యకారణములకుం ద్రికాలములకు
ధర్మమున కధర్మమునకు నీ ధరణి గల్గు
నన్ని వ్యవహారములకు వేఱైన సత్య
మీ వెఱుంగుదు వది నాకు నెఱుఁగఁ జెప్పు!

అనిన బ్రాబల్కు లే పదం బరయఁ దెలుపు,
సర్వ తపములు దేనికై సల్పుచుంద్రు,
దేనికై బ్రహ్మ చర్యముఁ బూనుచుందు.
రదియ 'ఓం'కారమని మది నరయవలయు,

ప్రణవ మది యపర బ్రహ్మమని తెలియుము
ప్రణవ మదియ పరబ్రహ్మమని తెలియుము,
ప్రణవమే బ్రహ్మమని యెఱింగిన నరుండు
దేని గోరెడినో యెడ, దానిఁ జెందు.

ప్రణవమే బ్రహ్మమొందు సాధనము ఘనము.
ప్రణవమే బ్రహ్మపదము ప్రాప్తముగఁ జేయు
ఎవ్వఁడీ ప్రణవమ్మ లో నెఱుఁగు నతఁడు
బ్రహ్మలోక సంపూజ్యుఁడై రాణఁజెందు

ఆత్మ పుట్టదు చావదు. నఖిలమెఱుఁగు.
కార్యమును గారణంబునుగాదు, అదియ
అజము నిత్యము శాశ్వత మవ్యయంబు,
దేహమొక్కటఁ జెడినను దేహి చెడదు.

ఏను జంపెద నంచని యెంచువాఁడు
ఏను జంపంగ బడెద నంచెంచు వాఁడు
వార లుభయులు తెలిసినవారు కారు,
చంప దొరు నాత్మ, యొరునిచేఁ జంపఁబడదు.

అణువున కణువు, నధిక మత్యధికమునకు,
నఖిలజంతు హృదంతరమందు వెలయు
నాత్మమహిమంబు, కామశోకాతిగుఁడగు
సుప్రసన్న మనస్కుఁడు సూచునద్ది.

ఒక్కచోనుండి దవ్వేగుచున్న యట్లు,
నిద్రితంబయ్యు జాగృతిన్వెలసినట్లు,
అల విషాద ప్రసాద సంవలిత మాత్మ
నాకు దక్క నొక్కనికిఁ గానంగరాదు.

ఆత్మ నశరీరిగా, ననిత్యంబులైన
తనువులందున్న వానిగా, ఘనుని గాగ
అంతటను నున్నవానిగా నాత్మ నెఱిఁగి
పండితుండెప్డు దుఃఖము వడయఁబోడు.

ప్రథిత వేదాధ్యయనముచేఁ, బ్రతిభచేత,
బహుతరగ్రంథ పరనచేఁ బడయరాదు
ఆత్మకామునకే కాననై నవాత్మ
వానికే స్వస్వరూపంబు వరలఁజేయు.

దుశ్చరిత్రుం డశాంత చిత్తుఁడును, ఇంద్రి
యైక లోలుఁడు, నేకాగ్రమైన మనసు
లేనివాఁడు నాత్మను గానలేమి నిజము,
బ్రహ్మవిజ్ఞానమున నది వడయనగును

ఆ ద్విజత్వ నృపత్వము లశనమగును,
మృత్యువే యను పాకమౌ, నిత్యముగను
తనయెడలఁ దానె యేకమై తనరునాత్మ
అరయనగు దాని నిట్లనియనె యముండు.

తృతీయ వల్లి

"అనఘ, జీవాత్మ పరమాత్మ లైనవారి
నాతపచ్ఛాయలుగ బుద్ధి యందునుండు
వారిగాగ, స్వకర్మానుభవము నొందు
వారిగా బ్రహ్మవేత్తలు పలుకుచుంద్రు.

కర్మరులకు దుఃఖాంభోధి గడప సేతు
వైన నాచికేతాగ్నిని నరయఁగల్గి,
ఘోరసంసార పారముం జేరువారి
కభయమగు నక్షర బ్రహ్మ మరసినాము.

ఆత్మను రథాధిరూఢుఁ డటంచు నెఱుఁగు
దేహమే రథమంచును దెలిసికొనుము,
బుద్ధియే సారథి యటంచు బుద్ధిఁ దలఁపు,
మనసు పగ్గమ్మటంచు నెమ్మది నెఱుంగు.

ఇంద్రియమ్ములు గుఱ్ఱమ్ము లెల్లవిషయ
ములను మార్గమ్ములని మదిఁ దెలియ వలయు,
మనసుతో నింద్రియములతో మసలువాఁడు
భోక్తయని సెప్పుచుందురు బుధగణమ్ము

దుష్టహయములు సారథితోఁ బెనంగి
వశముదప్పి త్రిప్పులువెట్టు భంగి నరయ
మనసు నేకాగ్రముగఁ జేసికొనని బుద్ధి
కింద్రియములు లోఁగక చరియించుచుండు.

సారథికి సదశ్వములు వశ్యములగు గతి
మదియది సమాహితమ్మయి పొదవి నపుడు
బుద్ధి కింద్రియములు వశంబు లగుచుండి
చెప్పినటులుండి మోక్షముం జెందఁజేయు.

ఎవ్వఁడు వివేకహీనుఁడు? ఎవ్వఁడశుచి?
ఎవఁడు విమనస్కుఁడై చరియించు చుండు
నాతఁ డక్షర మోక్షమ్ము నందలేడు
జనన మరణ పరంపరా సరణి గడచి.

ఎవఁడు విజ్ఞానవంతుఁడు? ఎవ్వఁడు శుచి?
మనసు నెవ్వఁడు నిగ్రహించునొ? అతండు
జన్మరాహిత్యమును బొంది, శాశ్వతమ్ము
నక్షరమ్మైన మోక్షమ్ము నందఁగలఁడు.

ఎవఁడు విజ్ఞాన సారథి, ఎవఁడు చిత్త
మనెడు పగ్గము చేఁదాల్చు నట్టివాఁడొ,
అతఁడు సంసార సాగర మధిగమించు,
నాతఁ డందును వైష్ణవం బైనపదము.

అవని నింద్రియములకంటె నర్థములును
అర్థముల కంటెను మనంబు, ఆ మనంబు
కంటె బుద్ధియు, నా బుద్ధికంటె మిగులఁ
దద్ధిరణ్య గర్భాఖ్య తత్త్వంబు పరము.

ఆ మహత్త్వముకంటె నవ్యక్త మవలఁ,
బురుషుఁ డవ్యక్తమునకంటెఁ బరుఁడనఁబడు;
పురుషుకంటెఁ బరుండు నిప్పుడమిలేడు,
అదియ పరమమ్ము శ్రేష్ఠమునైన దగును.

ఎల్ల భూతమ్ములందున నీ పురుషుఁడు
గూఢుఁడై యాత్మగా వెలుంగును వహింప,
నధిక సూక్ష్మమై యేకాగ్రమైన బుద్ధి
తోడ సూక్ష్మదర్శులచేతఁ జూడఁబడును

మనసునం దింద్రియముల, నా మనము బుద్ధి
యందు, బుద్ధిమహత్త్వము నందు, నా మ
హత్త్వమా పరబ్రహ్మము నందు లయము
సేయవలె పండితుఁడు మోక్షసిద్ధి కొఱకు.

లెండు, లెండు! ప్రాణులు మేలుకొండు! పరమ
గురుల వలన తత్త్వంబు నెఱిఁగి కొండు!
ఎటు దురత్యయం బసిధార నరుగు టటులె
యా పథంబును దుర్గమ మండ్రు బుధులు.

అది యశబ్ద మస్పర్శంబు నవ్యయంబు
నరసరూప గంధంబు, నిత్యం బనాద్య
నంతము ధ్రువంబు బుధ్యాత్మ కావలియది,
దాని నెఱుఁగ సంసార బంధములు తొలఁగు.

అని యముఁడు సెప్పె నాచికేతాఖ్య మిద్ది
యతి సనాతన మీ యుపాఖ్యాన మెవఁడు
గురులచే విని శిష్యులకును వచించు
బ్రహ్మలోక పూజ్యుండయి పరగునతఁడు.

ఈ పరమ గోపనీయ సద్వృత్త మెల్ల
శ్రాద్ధములయందు, బ్రాహ్మణ సభలయందు
శ్రోత్రియుఁడు సెప్ప వినినట్టిచో సమస్త
మట్టి శ్రాద్ధ మనంత ఫలాస్పదమగు.



చెరువులో

★

చిత్రశిల్పి
శ్రీ జగదీశ్ మిథల్

★

సంస్కృత బాలశిక్ష

శ్రీ గరికిపాటి సత్యనారాయణ, ఎం. ఏ.,

౨౪

ఈ క్రింది అకారాన్తమగు 'సర్వ' అనెడి పుంలింగశబ్దమును పరిశీలించునది సర్వశబ్దమునకు సమస్తమని యర్థము

సర్వః - సర్వౌ - సర్వే
హేసర్వ — హేసర్వౌ - హేసర్వే
సర్వమ్ - సర్వౌ - సర్వాన్
సర్వేణ — సర్వాభ్యామ్ - సర్వైః
సర్వస్మై - సర్వాభ్యామ్ - సర్వేభ్యః
సర్వస్మాత్ - సర్వాభ్యామ్ - సర్వేభ్యః
సర్వస్య - సర్వయోః - సర్వేషామ్
సర్వస్మిన్ - సర్వయోః - సర్వేషు.

ఇట్లే విశ్వ, కతర, కతమ, ఇతర, సమ శబ్దముల యాయావిభక్తి- వచనరూపములను సమన్వయించుకొనునది.

ఈ క్రింది అకారాన్తమగు సర్వఅనెడి నపుంసక లింగ శబ్దమును పరిశీలించునది.

సర్వమ్ - సర్వే - సర్వాణి
హేసర్వ - హేసర్వే - హేసర్వాణి
సర్వమ్ - సర్వే - సర్వాణి

మిగిలినదంతయు పుంలింగశబ్దమును బట్టి యన్వయించుకొనునది

ఈ క్రింది అకారాన్త మగు 'కతర' అనెడి నపుంసక లింగశబ్దమును పరిశీలించునది

కతరత్ - కతరే - కతరాణి
కతరత్ - కతరే - కతరాణి

మిగిలినదంతయు పుంలింగశబ్దరూపములను బట్టి యన్వయించుకొనునది అట్లే కతమ, ఇతర శబ్దముల యాయా విభక్తి వచనరూపముల నన్వయించుకొనునది.

కాని విశ్వశబ్దమును జ్ఞానశబ్దమును బట్టి యన్వయించుకొనునది.

ఈ క్రింది అకారాన్తమగు 'సర్వా' అనెడి స్త్రీలింగశబ్దమును పరిశీలించునది.

సర్వా - సర్వే - సర్వాః
హేసర్వే - హేసర్వే - హేసర్వాః
సర్వామ్ - సర్వే - సర్వాః
సర్వయా - సర్వాభ్యామ్ - సర్వాభిః
సర్వస్యై - సర్వాభ్యామ్ - సర్వాభ్యః
సర్వస్యాః - సర్వాభ్యామ్ - సర్వాభ్యః
సర్వస్యాః - సర్వయోః సర్వాసామ్
సర్వస్యామ్ - సర్వయోః - సర్వాసు.

ఈ క్రింది అకారాన్తమగు నేమ అనెడి పుంలింగశబ్దమును పరిశీలించునది. నేమ శబ్దమునకు సగమని యర్థము.

నేమః - నేమౌ { నేమే / నేమాః }

హేనేమ - హేనేమౌ - { హేనేమే / హేనేమాః }

మిగిలినదంతయును సర్వశబ్దమును బట్టి యన్వయించు కొననగును.

సర్వశబ్దమునకును, నేమ శబ్దమునకును ప్రథమ సంబోధన ప్రథమావిభక్తులకు సంబంధించిన ఏకవచన ద్వివచన రూపములలో సామ్యముగలదు. కాని బహువచనములలోని నేమే, నేమాః, హేనేమే, హేనేమాః అను రెండేసి రూపములలో నేమే అను ప్రథమావిభక్తియందలి బహువచనరూపమును, హేనేమే యను సంబోధన ప్రథమావిభక్తియందలి బహువచన రూపమును సర్వశబ్దము నందలి

ప్రథమ సంబోధన ప్రథమా విభక్తుల యందలి బహువచన రూపములను బోలి యున్నను, నేమాః, అను మిగిలిన పై రెండు విభక్తుల బహువచన రూపములును రామశబ్దమునందలి బహువచన రూపము లను బోలియున్నవి

ఈ క్రింది అకారాన్తమగు పూర్వ అనెడి పుంలింగశబ్దమును పరిశీలించునది

పూర్వః - పూర్వౌ - పూర్వే / పూర్వాః
హేపూర్వ - హేపూర్వౌ - హేపూర్వే / హేపూర్వాః
పూర్వమ్ - పూర్వౌ - పూర్వాన్
పూర్వేణ - పూర్వాభ్యామ్ - పూర్వైః
పూర్వస్మై - పూర్వాభ్యామ్ - పూర్వేభ్యః
పూర్వస్మాత్ / పూర్వాత్ - పూర్వాభ్యామ్- పూర్వేభ్యః
పూర్వస్య - పూర్వయోః - పూర్వేషామ్
పూర్వస్మిన్ / పూర్వే - పూర్వయోః - పూర్వేషు

దీనినిబట్టి పర, అవర, దక్షిణ, అపర, ఉత్తర, అధర అనెడి పుంలింగశబ్దముల యాయా విభక్తి వచనరూపములకు సమన్వయించు కొనునది.

నేమశబ్దమునకును పూర్వశబ్దమునకును సామ్య, వైషమ్యములను పాఠకులె వివేచనము చేసికొనునది,

ఈ క్రింది అకారాన్తమగు 'ఏక' అనెడి పుంలింగశబ్దమును పరిశీలించునది ఏకశబ్దమునకు ఒకటి యని యర్థము

ఏకః - హేఏక,-ఏకమ్,- ఏకేన-ఏకస్మై - ఏకస్మాత్ - ఏకస్య - ఏకస్మిన్

ఈ శబ్దరూపము లెల్లప్పుడును ఏకవచనమున నే యుండును. ఈక్రింది'ఉభ'అనెడి పుంలింగశబ్దమును పరిశీలించునది ఉభశబ్దమున 'కిద్దఱు' అని యర్థము.

ఉభౌ - ఉభౌ - ఉభాభ్యామ్- ఉభాభ్యామ్ - ఉభాభ్యామ్- ఉభయోః - ఉభయోః.

ఈ శబ్దరూపము లెల్లపుడును ద్వివచనమున నే యుండును. ఈ క్రింది అకారాన్తమగు 'ఉభయ' అనెడి పుంలింగ శబ్దమును బరిశీలించునది ఉభయశబ్దమునకు రెండవ యవయములు గలది యని యర్థము.

ఉభయః - ఉభయే
హేఉభయ - హేఉభయే
ఉభయమ్ - ఉభయాన్
ఉభయేన - ఉభయైః
ఉభయస్మై ఉభయేభ్యః
ఉభయస్మాత్ - ఉభయేభ్యః
ఉభయస్య - ఉభయేషామ్
ఉభయస్మిన్ - ఉభయేషు

ఈ శబ్దమున నాయా విభక్తులలో ద్వివచన రూపములు లేకుండుట గమనింప దగినది

ఈ క్రింది దకారాన్తమగు 'తత్' అనెడి పుంలింగశబ్దమును పరిశీలించునది తచ్ఛబ్దమునకు వాడని యర్థము.

సః - తౌ - తే
తమ్ - తౌ - తాన్
తేన - తాభ్యామ్ - తైః
తస్మై - తాభ్యామ్ - తేభ్యః
తస్మాత్ - తాభ్యామ్ - తేభ్యః
తస్య - తయోః - తేషామ్
తస్మిన్ - తయోః - తేషు

దీనినిబట్టియే దకారాన్తమగు 'యత్' అనెడి పుంలింగశబ్దము నాయా విభక్తి-వచనరూపములలో సమన్వయించు కొనునది. యచ్ఛబ్దమునకు ఎవడు'అనియర్థము.

ఈ క్రింది దకారాన్తమగు 'తత్' అనెడి స్త్రీలింగశబ్దమును పరిశీలించునది. ఈ లింగమున తచ్ఛబ్దమున కామె యని యర్థము.

సా - తే - తాః
తామ్ - తే - తాః
తయా - తాభ్యామ్ - తాభిః
తస్యై - తాభ్యామ్ - తాభ్యః
తస్యాః - తాభ్యామ్ - తాభ్యః
తస్యాః - తయోః - తాసామ్
తస్యామ్ - తయోః - తాసు

ఈ క్రింది దకారాన్తమగు 'తత్' అనెడి నపుంసక లింగశబ్దమును బరిశీలించినది. తచ్ఛబ్దమునకీ లింగమున 'అది' యని యర్థము.

తత్ - తే - తాని
తత్ - తే - తాని

మిగిలిన శబ్దము నంతయు పుంలింగ శబ్దమును బట్టి యన్వయించుకొననగును.

ఇట్లే యచ్ఛబ్దమునకును నాయా లింగములలో వేర్వేరు విభక్తి - వచన రూపముల నన్వయించుకొననగును.

ఈక్రింది దకారాన్తమగు ఏతచ్ఛబ్దమును (పుంలింగమున) పరిశీలించునది. ఏతచ్ఛబ్దమునకు 'వీడు' అని యర్థము.

ఏషః - ఏతౌ - ఏతే
ఏతమ్ } ఏతౌ } ఏతాన్ }
ఏనమ్ } ఏనౌ } ఏనాన్ }
ఏతేన } ఏతాభ్యామ్ - ఏతైః
ఏనేన }
ఏతస్మై - ఏతాభ్యామ్ - ఏతేభ్యః
ఏతస్మాత్ - ఏతాభ్యామ్ - ఏతేభ్యః
ఏతస్య - ఏతయోః } - ఏతేషామ్
ఏనయోః }
ఏతస్మిన్ - ఏతయోః } - ఏతేషు
ఏనయోః }

ఈక్రింది దకారాన్తమగు 'ఏతత్' అనెడి స్త్రీలింగశబ్దముమ బరికించునది ఏతచ్ఛబ్దమున కీ లింగమున 'నీమె' యనియర్థము.

ఏషా - ఏతే - ఏతాః
ఏతామ్ } ఏతే } ఏతాః }
ఏనామ్ } ఏనే } ఏనాః }
ఏతయా } ఏతాభ్యామ్ - ఏతాభిః
ఏనయా }
ఏతస్యై - ఏతాభ్యామ్ - ఏతాభ్యః
ఏతస్యాః ఏతాభ్యామ్ - ఏతాభ్యః
ఏతస్యాః - ఏతయోః } ఏతాసామ్
ఏనయోః }
ఎతస్యామ్ ఏతయోః } - ఏతాసు
ఏనయోః }

ఈక్రింది దకారాన్తమగు 'ఏతత్' అనెడి నపుంసక లింగశబ్దమును పరిశీలించునది. ఏతచ్ఛబ్దమున కీ లింగమున 'ఇది' యని యర్థము.

ఏతత్ - ఏతే - ఏతాని
ఏతత్ } ఏతే } ఏతాని }
ఏనత్ } ఏనే } ఏనాని }

మిగిలిన శబ్దమంతయు పుంలింగశబ్దమును బట్టి సమన్వయించుకొననగును.

ఈక్రింది దకారాన్తమగు 'యుష్మత్' శబ్దమును పరిశీలించునది. యుష్మచ్ఛబ్దమునకు 'నీవు' అని యర్థము.

త్వమ్ - యువామ్ - యూయమ్
త్వామ్ } యువామ్ } యుష్మాన్
త్వా } వామ్ } వః
త్వయా - యువాభ్యామ్ - యుష్మాభిః
తుభ్యమ్ } యువాభ్యామ్ } యుష్మభ్యమ్
తే } వామ్ } వః
త్వత్ - యువాభ్యామ్ - యుష్మత్
తవ } యువయోః } యుష్మాకమ్
తే } వామ్ } వః
త్వయి - యువయోః - యుష్మాసు

ఈ క్రింది దకారాన్తమగు 'అస్మత్' అనెడి శబ్దమును పరిశీలించునది అస్మచ్ఛబ్దమునకు 'నేను' అని యర్థము.

అహమ్ - ఆవామ్ - వయమ్.

మామ్ } ఆవామ్ } అస్మాన్
మా } నౌ } నః

మయా - ఆవాభ్యాం - అస్మాభిః

మహ్యమ్ } ఆవాభ్యామ్ } అస్మభ్యమ్
మే } నౌ } నః

మత్ - ఆవాభ్యామ్ - అస్మత్

మమ } ఆవయోః } అస్మాకం
మే } నౌ } నః

మయి - ఆవయోః - అస్మాసు

యుష్మచ్ఛబ్దరూపములును, అస్మచ్ఛబ్దరూపములును సర్వలింగములలో నొకే విధముగనుండును.

ఈ క్రింది మకారాన్తమగు 'కిం' అనెడి పుంలింగశబ్దమును బరికించునది.

కః - కౌ - కే

కమ్ - కౌ - కాన్

మిగిలినదంతయు తచ్ఛబ్దమును బట్టి యన్వయించుకొన నగును.

ఈ క్రింది మకారాన్తమగు 'ఇదం' అనెడి పుంలింగబబ్దమును పరికించునది. ఇదం శబ్దమునకు వీడని యర్థము.

అయమ్ ఇమే - ఇమ్

ఇమమ్ } ఇమౌ } ఇమాన్
ఏనమ్ } ఏనౌ } ఏనాన్

అనేన } ఆభ్యామ్ - ఏభిః
ఏనేన }

అస్మై - ఆభ్యామ్ - ఏభ్యః

అస్మాత్ - ఆభ్యామ్ - ఏభ్యః

అస్య - అనయోః } -ఏషామ్
ఏనయోః }

అస్మిన్ - అనయోః } - ఏషు
ఏనయోః }

ఈ క్రింది మకారాన్తమగు 'ఇదం' అనెడి స్త్రీలింగశబ్దమును పరికించునది. 'ఇదం' శబ్దమున కీ లింగమున 'ఈమె' యని యర్థము.

ఇయమ్ - ఇమే - ఇమాః

ఇమామ్ } ఇమే } ఇమాః
ఏనామ్ } ఏనే } ఏనాః

అనయా } ఆభ్యామ్ } ఆభిః
ఏనయా }

అస్యై - ఆభ్యామ్ - ఆభ్యః

అస్యాః - ఆభ్యామ్ - ఆభ్యః

అస్యాః } అనయోః | ఆసామ్
} ఏనయోః |

అస్యామ్ } అనయోః } ఆసు
} ఏనయోః }

ఈ క్రింది మకారాన్తమగు 'ఇదం' అనెడి నపుంసకలింగ శబ్దమును పరిశీలించునది 'ఇదం' శబ్దమున కీలింగమున నిదియని యర్థము.

ఇదమ్ - ఇమే - ఇమాని

ఇదమ్ | ఇమే | ఇమాని
ఏనమ్ | ఏనే | ఏనాని

మిగిలిన శబ్దమంతయును పుంలింగ శబ్దమును బట్టి యన్వయించుకొననగును.



వైజయంతిమాల · పద్మిని వీరిని
అత్యున్నత స్థాయిలో చూడండి
జెమినీ చిత్రం
విజయకోట
..తెలుగు..
వీరుడు
అక్టోబర్ 2 మొదలు ఆంధ్ర దేశ మంతటా.. ...

మాసఫలములు

(అక్టోబరు 1958)

శ్రీ 'బుధ'

[ఏ సంవత్సరమున పుట్టిననూ, పుట్టిన తేదీగల రాశిని బట్టి, ఫలము తెలిసికొనునది]

మేషము

మార్చి 21 — ఏప్రిల్ 20

మీ గ్రహస్థితి, శుభా ఽ శుభమిశ్రమ ఫలితములనిస్తుంది. స్థితి గతులలో యేలోపము యుండదు రాశ్యాదిపతి వక్రించుటచే. యత్నకార్యముల యందాలస్యము, అవరోధాలు మాత్రం కలుగుతూ వుంటాయి ఓర్పుతో పనులను సాధించుకోవలసి వుంటుంది. కొంచెం ఆలస్యమైనా 20వ తేది లోపుగనే మీ పనులు సవ్యంగా పూర్తి అవుతాయి. ఆర్థికంగాకూడా లాభిస్తుంది. వ్యాపారాదికృషులు 20వ తేదీ లోపుగనే ముగించుకొనుట మంచిది. ఆపై స్వైక్యలేటు చేయుట తగదు. స్వంతపనుల కన్నా. బంధుమిత్రాదులను గూర్చిన,కార్యకలాపాలలోనే యెక్కువగా పాల్గొనటంతో కాలం గడచిపోతుంది. వ్యావహారికంగా కొన్ని చిక్కులు సంభవిస్తాయి.

వృషభము

ఏప్రిల్ 21 — మే 22

గ్రహస్థితి. 20వ తేదీ వరకు మిగుల అనుకూలము. ఉద్యోగాభివృద్ధితోపాటు, ధనవృద్ధి, గౌరవం పెరుగుతుంది వ్యవహారికచిక్కులు తేలిపోగలవు. శత్రు జయం కలుగుతుంది. యెల్లప్పుడు బంధు మిత్రాదులతో సుఖంగా కాలముగడచిపోతూ ఉంటుంది. వ్యాపారస్తులు నూతన వ్యాపారములలో పాల్గొని మంచి లాభములను గడించగలరు. వరీక్షలలోపాల్గొనే విద్యార్థులకు జయం లభిస్తుంది. అనారోగ్యము, ప్రయాణములలో ప్రమాదములు.

మిధునము

మే 23 — జూన్ 21

గ్రహస్థితిప్రతి కూలము. ఆత్మకారక కోదయ రాశియందు కుజవక్రము మిగుల దోషము - భౌతిక, మానసిక వ్యధలే ఎక్కువగా కనుపించగలవు దారిద్ర్య ఋణబాధలు పీడించుచుండును గౌరవము సన్నగిలును ఆరోగ్యము చెడును. పిరికితన మేర్పడును సోదర సమానులతో జ్ఞాతులతో వైరము, వాత్సల్యతలేని సాంగత్యము. ప్రేమవలన దుఃఖము, తరచుగా స్థానచలనము, కొంతమంది కారాగృహ వాసమునుఅనుభవింతురు. కాని, పంచమ కోణములోరవి, బుధ, శుక్రు లుండుటచే, మీ పూర్వజన్మసుకృత ఫలం, ఈఆపద కాలములో ఆదుకొంటుంది-పై దుష్ఫలితములకు బలికాకుండాతప్పుకో గలుగుదురు. సాహిత్యము - కళలయందు పరిశ్రమ చేయువారికి, కృషియందనుకూలము - వ్యాపారస్థులకు పెట్టుబడుల వలన నష్టము.

కర్కాటకము

జూన్ 22 — జూలై 22

చాలా గ్రహములు, ప్రతికూలము. శని, కుజుల, సమసప్తకము మిగుల చెడ్డది. ఉద్యోగ వ్యాపార విషయములలో అనేక ఆటంకములు, శతృత్వము-వ్యవహారిక చిక్కులు స్థిరత్వము యుండదు అనాలోచితముగా పనులుచేయుచుందురు అలాగుననే ప్రయాణాలు, అనారోగ్యము కొంతమంది ఆకస్మిక ప్రమాదములకు గురియై ఆపరేషన్లు చేయించుకొనవలసి వచ్చును రాజకీయ అతివాదులకు, చిత్రకళా నిర్మాతలకు, రచయితలకు మంచి రోజులుకావు ప్రభుత్వము వలన కొన్ని చిక్కులు కలుగును. ఉద్యోగస్థులకు ట్రాన్సుఫర్లు సంప్రాప్తమగును. అయితే బృహస్పతి శుభవీక్షణ వలన స్థితిగతులకు, గౌరవప్రతిష్ఠలకు భంగమురాదు. వ్యాపారస్తులు నూతన

వ్యాపారములు చేయకుండుట యుక్తమం. 16 వ తేదిపిమ్మట రాజీమార్గములలో కొన్ని వ్యవహారములు పరిష్కరింపబడగలవు.

సింహము

జూలై 23 - ఆగష్టు 22

ఎక్కువ గ్రహములు అనుకూలంగా యున్నవి అప్రయత్నముగనే అనేక అవకాశములు లభ్యమగును స్థితిగతులలో స్థిరత్వమేర్పడుతుంది గొప్పవారితో స్నేహము, మిత్రులతోడ్పాటు చేకూరుతవి. యత్నకార్యసిద్ధి వృత్తి, వ్యాపారాదుల యందాధిక్యత, గౌరవము, శత్రుజయం, కలిగి వ్యవహారచిక్కులు తొలగును. ఆర్థిక పరిస్థితి తృప్తికరంగా యుండి నూతన వస్త్రాభరణభూషణప్రాప్తియును జరుగును. గృహ, భూ, విషయాలలో మీ ప్రయత్నములు అనుకూలించును. బంధు, మిత్రాదులతో గృహస్థజీవితము సుఖప్రదంగా నడుస్తుంది.

కన్య

ఆగష్టు 23 - సెప్టెంబరు 22

బుధ శుక్రులు తప్ప మిగిలిన గ్రహములన్నీ దుష్ఫలితములనే యిచ్చుచుండును - ఎంతగా ప్రయత్నించినా మీ ప్రత్యేక నేర్పరితనము-కళానిపుణత-శక్తిసామర్థ్యములన్నియు వ్యర్థములే యగును. వృత్తి, వ్యాపారములలో వడుదుడుకులు తప్పవు. కాలము అనుకూలించుట లేదని గుర్తెరిగియు వున్నదానితో తృప్తి పడరు వ్యాపార కాంక్ష అధికము. భాగస్థులు శోదవుతారు. ఆలోచనలు చేస్తారు. సాహస కార్యములకు దిగి కార్యభారము పైవేసుకొంటారు. శ్రమపడుతారు - తుదకు దైవికముగా లాభిస్తుంది. 20 తరువాత కార్యరూపం దాల్చుతాయి. ఈలోగా కాగల నమ్మకంలేదు మామూలుగా జరుగు. ఉద్యోగ వ్యాపార ధర్మములలో పూర్వార్థంలో కొన్ని చిక్కులు కలుగును - నష్టము రాగల సూచనలున్నవి. 15, 16 తేదీల నుండి క్రమేపి చిక్కులు తొలగి నష్టమును భర్తీ చేయకలుగుతారు.

తుల

సెప్టెంబరు 23 - అక్టోబరు 22

శని, శుక్రులు తప్ప మిగిలిన గ్రహములన్నియు చెరుపుచేసేవే. కావున ఈ నెలలో శుభఫలితముల కన్నా అశుభ ఫలితములే ఎక్కువ. సుఖ, దుఃఖములయందు మీకుగల సమత్వబుద్ధి ఎంతవరకు నిలబడగలదో గ్రహస్థితి పరీక్షిస్తుంది. ఆత్మవిశ్వాసము వీడకపోతే జయం మీకే లభిస్తుంది అనేక ఆటంకముల తో మీకృషి వ్యాపారాదులు సాగుచూవుండును. రవి నీచస్థితివలన, అధికారులతో కాగల పనులెవ్వియుకావు. వ్యాపారాదికృషులు తగుజాగ్రత్తతో చేసికొనవలసి యుంటుంది. ధనాధిపతి వక్రస్థితి వలన ఆర్థికపరిస్థితి తృప్తికరంగా యుండదు. కుటుంబ, సామాజిక పరిస్థితులు సహితము సుఖప్రదంగా యుండవు బంధు మిత్రాదులతో అభిప్రాయభేదములు. కళత్ర అనారోగ్యం, అసౌఖ్యం శని, శుక్రులశుభస్థితి వలన- స్థిరధన, స్థిరవసతులనుండియు స్త్రీల వలన ప్రయాణమువలన కొంతధనము లభ్యమగును-

వృశ్చికము

అక్టోబరు 23 - నవంబరు 21

బృహస్పతి తప్ప అనుకూలించే గ్రహములే అగుపించవు. యత్నకార్యములం దనేక ఆటంకములు కలుగుచుండును వృత్తికి భంగము వాటిల్లగల ప్రమాదము గలదు. గృహకల్లోలములు ఎక్కువ - ఆప్తులైన బంధు, మిత్రులతో వైరము. ఇంతేగాక వ్యవహారికముగా, రాజకీయముగా చిక్కులు. శత్రు- ఋణ-రోగ బాధలు పీడించుచుండును. గౌరవ హాని, మనోవ్యాకులత-హృదయ దౌర్బల్యము-ఇట్టి పరిస్థితులలో, మీకు బృహస్పతి బలమున్నది. కావున

దేశపరిత్యాగము చేయ నవుసర ముండదు. మొదటి వారము ఓర్పు వహించుట మంచిది. 16 వ తేదీ పిమ్మట. బుధుడు కొంత శుభుడు. ఆశాజనకములైన అవకాశములు.

ధనుస్సు

నవంబరు 22 – డిశెంబరు 22

ఈ మాసములో శని కుజులు అశుభములు మిగిలిన గ్రహములన్నియు శుభులు. కావున, ఎక్కువగా శుభ ఫలితములే జరుగగలవు. వృత్తి వుద్యమములలో ఆధిక్యత - సాంఘిక గౌరవము. గొప్పవారిప్రాపకము. వ్యవహారిక విజయము. మీ కృషి వ్యాపారాదులు చక్కగా నడచి మంచి ఆదాయము నివ్వగలవు - స్థిరవస తులను గూర్చియు- శుభకార్య నిర్వహణ గూర్చియు చేయు ప్రయత్నములు అనుకూలిం చును. నూతన వస్త్రాభరణ భూషణప్రాప్తి- విద్యార్థులకు జయము చేకూరును. ఈ రాశిలో జన్మించిన కొంతమందికి, కృషి వ్యాపారాదుల నిమిత్తమై, పరదేశ ప్రయాణమును సంభవ మగును. ఉద్యోగాధికారములలో నిర్లక్ష్యము వలన, పట్టుదలలవలన ప్రమాదములురాగలవు. శారీరక అనారోగ్యము, గాయములు, ఆపరే షన్సు మొదలగు ఆకస్మిక ప్రమాదములు.

మకరము

డిసెంబరు 23 - జనవరి 20

గ్రహస్థితి శుభాఽశుభ మిశ్రమఫలితము లిచ్చుచుండును. వ్యవహార చిక్కులు ఋణ చిక్కులు పలువిధములుగా బాధిస్తవి. యత్న కార్యము లేవీ కొనసాగవు. స్థితి గతులకు లోపము. గౌరవహాని, చరస్థిరాస్థులు న పడుట, అమ్మివేయుట, వలనకొలది ద్రవ్యమ చేతికి వచ్చును. ఉద్యోగస్థులు - వ్యాపారస్థు కొన్ని కష్టనష్టములకు గురిగాక తప్పదు కొన్ని శుభఫలితములు సహితము జరుగగలవు మిత్రుల సహాయంతో కొన్ని ప్రయత్నముల నెరవేరును, స్త్రీలవల్ల మేలు కలుగును. ఆధ్యా త్మికవికాసముకలుగును.అధికారుల సహాయం

కుంభము

జనవరి 21 - ఫిబ్రవరి 19

గ్రహస్థితి మిగుల అనుకూలము, మీయత్న కార్యము లన్నియు సఫలము లగును మన శ్శాంతి చేకూరును. ఆరోగ్యము. వికాసము కలుగును -మిత్రుల తోడ్పాటు. ఆర్థిక లాభము చేకూరును-గృహ భూ అభివృద్ధులనుగూర్చియు శుభకార్య నిర్వహణ గూర్చియు చేయు ప్రయ త్నములు అనుకూలించును. గృహస్థ జీవితము సుఖప్రదం.

మీనము

ఫిబ్రవరి 20 - మార్చి 20

గ్రహస్థితి శుభాఽశుభ మిశ్రమ ఫలితాలను ఇస్తుంది. మీకృషి వ్యాపారాదులకు స్వల్పఆటం కములు కలుగుచుండును. నిర్లక్ష్యము వలన కార్యహాని, వ్యాపార నష్టము. అనారోగ్యము ఆకస్మిక ప్రమాదములకు గురియగుట. అకా రణ కలహము. నష్టదాయకమగు ప్రయాణ ములు. 16 వ తేదినుండి మీ వ్యాపారాది కృషు లు క్రమముగా అభివృద్ధి యగును. అంతరం గిక కలహములతో గృహస్థ జీవితము సుఖము నివ్వదు. ఆఖరు వారము తలవని తలంపుగా మేలు సమకూరుతుంది.

★

Prepare for this Eventful National Gathering of the Indian Youth!

Third All-India Convention

OF THE

YOUTH CONGRESS

AT

BARODA

From Sunday the 2nd November to Thursday the 6th November, 1958
(Inauguration at 2-30 P. M.)

To Be Presided By

SMT. INDIRA GANDHI

To Be Addressed By

SHRI JAWAHARLAL NEHRU
SHRI U. N. DHEBAR

Will Deliberate On The Following Outstanding Problems Confronting the Indian Youth :

1 The Concept of a Democratic Socialist Order in India and Contemporary Trends in the Congress Ideology

2 The Youth Movement in the Rural Area.

3. The Youth and Social Reconstruction

4 Youth & The Development

5 The Condition of the Industrial Youth

Proceedings of the Office of the Inspector General of Local Administration, Andhra Pradesh, Hyderabad-4

L. Dis No. 78018/58 Dated 12-9-58

Sub :- Books and publications - Approval of Navabharathi, a literary and cultural Telugu monthly for use in Local Boards, commendation

CIRCULAR

All the Panchayats in the state are informed that if they want for their libraries, the Telugu monthly Journal, Nava Bharathi, they may purchase it.

(True copy) (Sd) *Inspector General*

★ ★ ★

Proceedings of the Director of Public Libraries, Andhra Pradesh, Hyderabad

Rc. No. 405-M 4/58 Dated 2-7-58

Sub - Books and publications - Journal entitled "Nava Bharathi"—commendation of-orders issued

The following Journal is commended for use in all the libraries of schools, and public libraries in the State :-

Name :- "Nava Bharathi"

Name of the Editor and publisher : J. Radha Krishna Reddy

Price—Rs 1/-

Copies can be had from

Nava Bharathi Karyalayam, Gandhinagaram, VIJAYAWADA-2

(True copy) (Sd) *Director of public Libraries*

Edited, Printed & Published by Sri J Radhakrishna Reddy, Vijayawada-2.